




ESTD: 1999
www.voodayam.com

# వుదయం



నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం





ఖమ్మం | 31-08-2026 సోమవారం సంపుటి : 13 | సంచిక : 274 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on


# గాంధీభవన్‌లో కేబినెట్ వేడి



**హైదరాబాద్, ఆగస్టు 30 (వుదయం)** రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల పర్యటనల అనంతరం, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కూడా హస్తిన పర్యటనకు సిద్ధమవుతున్నారు. కేబినెట్ విస్తరణ, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు ఆయన సెప్టెంబర్ 3న న్యూఢిల్లీకి వెళ్లనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. సెప్టెంబర్ 7 నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, సీఎం ప్రతిపాదిత ఢిల్లీ పర్యటన గాంధీభవన్‌లో కేబినెట్ విస్తరణ మరియు పునర్వ్యవస్థీకరణపై తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది.వివాదాల నడుమ ఢిల్లీకి సీఎం పయనంముఖ్యమంత్రిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన ఆరోపణలు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కొండా సురేఖ బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కాగా, ఆ తర్వాత కొద్ది రోజులకే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఖర్గేను కలిశారు. మరోవైపు, ఈ ఎపిసోడ్‌పై టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఇప్పటికే తమ నివేదికను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు సమర్పించింది. అయితే ఈ నివేదికను పరిశీలన కోసం ఏఐసీసీకి పంపారో లేదో ఇంకా స్పష్టత రాలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. మంత్రి కొండా సురేఖ ఉదంతంపై పార్టీ హైకమాండ్‌తో ఆయన ప్రధానంగా చర్చించే అవకాశముంది. మంత్రివర్గ విస్తరణ.. పెరిగిన ఆశావాహుల ఒత్తిడిమరోవైపు, కేబినెట్‌లో చోటు దక్కించుకునేందుకు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అధిష్టానం ఆమోదం పొందేందుకు ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన కొందరు శాసనసభ్యులు ఇప్పటికే పలుమార్లు ఢిల్లీ బాట పట్టారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో రెండు ఖాళీలు ఉన్నాయి. ఒకవేళ కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇద్దరు మంత్రులను పక్కన పెడితే, కొత్తగా నలుగురు ఎమ్మెల్యేలు లేదా ఎమ్మెల్సీలకు మంత్రివర్గంలో అవకాశం దక్కే లొసుగులు కనిపిస్తున్నాయి.మంత్రుల్లో విస్తరణ భయం.. బిసి కోటాలో పోటీకేబినెట్ విస్తరణతో పాటు కొందరు మంత్రుల పోర్ట్‌ఫోలియోలను (శాఖలను) మార్చేందుకు హైకమాండ్ ఆమోదం తెలిపే అవకాశం ఉందన్న వార్తలు కొందరు మంత్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో కొందరు మంత్రుల పనితీరుపై ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ మార్పుల ప్రచారం ఊపందుకుంది.

# ఉజ్బెకిస్థాన్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం

## యురేనియం సరఫరాకు ప్రధాని మోదీ శ్రీకారం



**తాష్కెంట్, ఆగస్టు 30 :** భారత్, ఉజ్బెకిస్థాన్ దేశాల మధ్య దౌత్య, ఆర్థిక సంబంధాలు కొత్త పుంతలు తొక్కాయి. రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక యురేనియం సరఫరా ఒప్పందం కుదరనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌లో ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్‌తో జరిగిన ద్వైపాక్షిక ప్రతినిధుల స్థాయి చర్చల్లో ప్రధాని మోదీ ఈ కీలక విషయాన్ని వెల్లడించారు. యురేనియం సరఫరాకు సుదీర్ఘకాల ఒప్పందం భారత ఇంధన అవసరాల దృష్ట్యా ఉజ్బెకిస్థాన్ నుంచి దీర్ఘకాలిక ప్రాతిపదికన యురేనియం పొందేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. దీనితో పాటు రెండు దేశాలకు చెందిన మూడు జంట నగరాలు (సిస్టర్‌సిటీస్), జంట రాష్ట్రాల (సిస్టర్‌స్టేట్స్) అనుసంధానానికి సంబంధించి తుది రూపునిస్తున్నామన్నారు. ఉజ్బెకిస్థాన్‌లో 'న్యూ తాష్కెంట్' తరహా భారీ ప్రాజెక్టులు జరుగుతున్నట్లే, గుజరాత్ వేదికగా 'గిఫ్ట్ సిటీ'ని తీర్చిదిద్దామని గుర్తుచేశారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం, విధానాలను పరిశీలించేందుకు ఉజ్బెకిస్థాన్ ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటించాలని ఆయన ఆహ్వానించారు. మంత్రులస్థాయిలోసమన్వయమండలి ఇరు దేశాల మధ్య అన్ని రంగాల్లో భాగస్వామ్యాన్ని పర్యవేక్షించేందుకు విదేశాంగ మంత్రుల స్థాయిలో ప్రత్యేక 'సమన్వయ మండలి' (కోఆర్డినేషన్ కౌన్సిల్)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ప్రధాని తెలిపారు. ఇప్పటివరకు కార్యదర్శుల స్థాయిలో ఉన్న 'జాయింట్ కమిషన్'ను ఇకపై మంత్రిత్వ శాఖల స్థాయికి పెంచుతున్నట్లు స్పష్టం చేశారు. అలాగే ఇరు దేశాల వ్యాపారవేత్తలతో త్వరలోనే సంయుక్తంగా 'బిజినెస్ సమిట్' నిర్వహిస్తామన్నారు. ద్వైపాక్షిక ఆర్థిక బంధాన్ని బలోపేతం చేసేందుకు ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు ఒక పుస్తకాన్ని రూపొందించడంపై మోదీ ప్రశంసలు కురిపించారు.

**భారతీయుల హృదయాల్లో చెదరని స్థానం**

తనకు లభించిన ఘన స్వాగతంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. "నిన్నటి విందు కార్యక్రమంలో అధ్యక్షుడు మిర్జియోయెవ్ చూపించిన ఆతిథ్యం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఉజ్బెకిస్థాన్ చిన్నారులు భారతీయ పాటలకు నృత్యం చేస్తుంటే సాక్షాత్తూ నా స్వరాష్ట్రం గుజరాత్ కళ్లముందు మెదిలినట్లయింది. నగరమంతటా భారత త్రివర్ణ పతాకాలతో శోభాయమానంగా తీర్చిదిద్దడం భారత్ పట్ల మీకున్న అభిమానానికి నిదర్శనం" అని ప్రధాని కొనియాడారు.

# మత్తుకు దూరం.. ఉజ్వల భవిష్యత్తుకు మార్గం

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ఎఎంస్)** క్షణికానందాన్ని ఇచ్చే మత్తు పదార్థాలు యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసి, జీవితాలను అంధకారంలోకి నెట్టివేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నాటి 'మన్ కీ బాత్' 137వ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. మత్తు బారిన పడకుండా ఉండేందుకు యువత శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా విరివిగా అవగాహన కల్పించాలని యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లకు సూచించారు. 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్'కు యువత నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. వ్యసనం నుంచి బయటపడిన వారిని సమాజం ఆదరించి గౌరవించాలని, యోగా, ధ్యానం, ఆత్మవిశ్వాసంతో మత్తుకు దూరంగా ఉండవచ్చని పేర్కొన్నారు. వీధి వ్యాపారులకు 'స్వనిధి' కొండంత అండ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం స్వనిధి యోజన' పథకం వీధి వ్యాపారులకు, ముఖ్యంగా మహిళా సాధికారతకు ఎంతో దోహదపడుతోందని ప్రధాని గుర్తుచేశారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారిలో దాదాపు 46 శాతం మంది మహిళలే ఉన్నారని, వారు తమ వ్యాపారాలను విస్తరించుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం ప్రధాని నరేంద్ర మోదీకి మరో అంతర్జాతీయ గౌరవం దక్కింది. ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారమైన 'ఒలియ్ దరాజాలి దస్లిక్'ను ఆ దేశ అధ్యక్షుడు

# ప్రభుత్వ స్థలాల కేటాయింపును నిలిపివేయాలి

## రూ. 500 కోట్ల విలువైన భూమి కేవలం రూ. 87 కోట్లకే ధారాదత్తంపై హరీశ్‌రావు ఫైర్



**హైదరాబాద్, ఆగస్టు 30 (వుదయం)** రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరలకు కట్టబెట్టే చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ జాతీయ నాయకుడు హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని, ప్రభుత్వ ఆస్తులను రియల్ ఎస్టేట్ వ్యాపారంలా మార్చేస్తోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఆజామాబాద్ భూమి కేటాయింపులో భారీ అక్రమాలుహైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న ఆజామాబాద్‌లో సుమారు రూ. 500 కోట్ల మార్కెట్ విలువ కలిగిన ప్రభుత్వ భూమిని కేవలం రూ. 87 కోట్ల అతి తక్కువ మొత్తానికే ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం సిద్ధపడిందని హరీశ్‌రావు లేఖలో ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'తెలంగాణ ఆయిల్ ఫెడ్' సదరు భూమికి రూ. 87 కోట్లు చెల్లించి కొనుగోలు చేయడానికి సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, దాన్ని పక్కనబెట్టి మరీ ప్రైవేట్ వ్యక్తుల లబ్ధి కోసం కట్టబెట్టడం వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు.రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా ప్రభుత్వంపాలనపై దృష్టి సారించాల్సిన రేవంత్ సర్కారు ఒక 'రియల్ ఎస్టేట్ ఏజెన్సీ'లా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణను విస్మరించి, కార్పొరేట్ మరియు ప్రైవేట్ వర్గాలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజా సంక్షేమానికి విరుద్ధమని స్పష్టం చేశారు. ఆజామాబాద్ భూమి కేటాయింపుల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజా క్షేత్రంలోనూ, చట్టపరంగానూ పోరాటం చేస్తామని లేఖ ద్వారా హెచ్చరించారు.

# మెగా డీల్‌లో రక్షణ శాఖకు 35 శాతం వాటా!

**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) సరికొత్త అవతారమెత్తనుంది. సైనిక వ్యవహారాలు, వ్యూహాత్మక భద్రతకే పరిమితమైన పెంటగాన్.. తాజాగా నేరుగా చమురు వ్యాపారంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. అమెరికావెనిజువెలా దేశాల మధ్య కుదిరిన చారిత్రక చమురు ఒప్పందంలో పెంటగాన్‌కు భారీ వాటా దక్కనుండటమే ఇందుకు కారణం. ఆ దేశానికి చెందిన ఓ ప్రముఖ పత్రిక ప్రచురించిన కథనం ప్రకారం, ఈ ఒప్పందం ద్వారా అమెరికాకు లభించే మొత్తం చమురులో ఏకంగా 35 శాతం వాటాను పెంటగాన్‌కే కేటాయించనున్నారు. పెంటగాన్ హక్కులు.. బ్లూ ఎనర్జీ పాత్ర అమెరికా రక్షణ శాఖకు చెందిన 'స్ట్రాటజిక్ క్యాపిటల్ ప్లాన్స్' విభాగానికి 'నార్త్ అమెరికన్ బ్లూ ఎనర్జీ పార్టనర్స్' సంస్థలో పెన్నీ వారెంట్ల ద్వారా భాగస్వామ్యం లభించనుంది. దీని ఫలితంగా భవిష్యత్తులో ఉత్పత్తి అయ్యే చమురు పరిమాణంలో, ఉత్పత్తి వ్యయంలో 20 శాతాన్ని నేరుగా కొనుగోలు చేసే ప్రత్యేక హక్కులు పెంటగాన్‌కు లభిస్తాయి.

# 42 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

- రూ. 27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మార్చుతాం
- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కేంద్రమంత్రి తనిఖీ



**వికారాబాద్, ఆగస్టు 30 (వుదయం) :** వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో రూ. 27 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఆధునికీకరణ పనులను కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలసి ఆదివారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు అందేలా ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, అనుకున్న సమయానికి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమృత్ భారత్ పథకం కింద తెలంగాణ వ్యాప్తంగా ఏకకాలంలో 42 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే వికారాబాద్ రైల్వే స్టేషన్‌ను రూ. 27 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్లు, రెండు లిఫ్టులు, ఆధునిక క్యాంటీన్ సదుపాయంతో పాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ పనులన్నింటినీ పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. వికారాబాద్ ప్రాంత సమగ్ర వికాసానికి మెరుగైన రైల్వే అనుసంధానం అత్యంత కీలకమని, ఈ ఆధునికీకరణ పూర్తయితే ప్రయాణికులకు వేగవంతమైన, అత్యుత్తమ సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు.

# 750 దాటిన మృతుల సంఖ్య 3,000 మంది లభ్యం కాని గల్లంతు

**బీజింగ్ / ఖాట్మండు:** టిబెట్‌లో సంభవించిన భయాందోళనకరమైన మంచు కొండచరియల (గ్లేసియర్) విరిగిపాటు, దానికి తోడైన వరదలు, బురద ప్రవాహాలు సరిహద్దు ప్రాంతాల్లో మహా విధ్వంసాన్ని సృష్టించాయి. అయితే, ఈ భయానక ఘటనకు సంబంధించిన దృశ్యాలు, వీడియోలు బయటకు రాకుండా చైనా ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల నుంచి తీవ్రస్థాయిలో తొలగిస్తున్నట్లు అంతర్జాతీయ పత్రిక 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' కథనం వెల్లడించింది.

**నదుల్లో ఉప్పొంగిన బురద ప్రవాహం.. 750 మంది బలి**

ఆగస్టు 26న టిబెట్‌లో సంభవించిన గ్లేసియర్ కూలిపోవడం వల్ల లేండే ఖోలా గుండా విపరీతమైన బురద, రాళ్లు, నీరు వచ్చిపడ్డాయి. ఈ ప్రవాహం భోటే కోషి, త్రిశూలి నదీ వ్యవస్థల్లోకి చేరడంతో నేపాల్‌టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో ఊహించని నష్టం వాటిల్లింది. ఈ ఘోర విపత్తు కారణంగా నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో ఆదివారం నాటికి సంయుక్త మరణాల సంఖ్య 750కి చేరింది. సుమారు 3,000 మందికి పైగా గల్లంతయ్యారు. ఒక్క నేపాల్‌లోనే 734 మంది మృతి చెందగా, 2,498 మంది ఆచూకీ దొరకలేదు. టిబెట్‌లోని గిరోంగ్ కౌంటీ పరిధిలో ఐదుగురు మృతి చెందగా, 260 మంది విదేశీయులు సహా 558 మంది అదృశ్యమయ్యారని చైనా అధికారికంగా ప్రకటించింది. ఉత్తర భారతదేశంలోని నదుల్లో సైతం 10 మృతదేహాలు లభ్యమైనట్లు సమాచారం.

**సామాజిక మాధ్యమాల్లో దృశ్యాల డిలీట్**

ప్రమాదం జరిగిన వెంటనే గిరోంగ్ పోర్ట్ వద్ద భవనాలపైకి భారీ ఎత్తున బురద వరద దూసుకొస్తున్న దృశ్యాలు, జనాలు ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగులు తీస్తున్న వీడియోలు చైనా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే, ప్రభుత్వం రంగంలోకి దిగి ఆ దృశ్యాలన్నింటినీ తొలగించడం ప్రారంభించింది.






## ఇంతే కదా...!




# రాఖీ పండుగకు వచ్చి అనంతలోకాలకు..

**- పండుగ వేళ ఆరిపోయిన దీపాలు - మొండికుంటలో జారిపడి మృతిచెందిన ఇంటర్, పదో తరగతి విద్యార్థులు**



**ములుగు, ఆగస్టు 30 (వుదయం) :** జిల్లా కేంద్ర సమీపంలో పెను విషాదం చోటుచేసుకుంది. సరదాగా గడపడానికి వచ్చిన ఇద్దరు అన్నదమ్ములు నీటికుంటలో మునిగి ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబంలో తీరని శోకం అలముకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన మాలోతు యాకూబ్, స్వాతి దంపతులకు వినయ్ కిశోర్ (16), రాజేశ్ (14) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో వినయ్ ఇంటర్, రాజేశ్ పదో తరగతి చదువుతున్నారు. రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని స్వాతి తన ఇద్దరి పిల్లలను తీసుకుని ములుగు మున్సిపాలిటీ పరిధిలోని గణేశ్‌లాల్‌పల్లిలోని తన పుట్టింటికి వచ్చారు. అనంతరం ఆదివారం సెలవు రోజు కావడం వల్ల పిల్లలను అక్కడే ఉంచి ఆమె కమలాపూర్ వెళ్లారు. ఆదివారం సాయంత్రం వేళ బంధువుల అబ్బాయితో కలిసి వినయ్, రాజేశ్‌లు గ్రామానికి దగ్గరలోని మొండికుంట వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో మొరం మట్టి తవ్వకాలు జరిపిన లోతైన గుంతలో ప్రమాదవశాత్తు ఒకరి తర్వాత ఒకరు జారిపడి నీటిలో మునిగిపోయారు. పక్కనే ఉన్న మరో బాలుడు వెంటనే పరుగులు తీస్తూ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులు, స్థానికులకు సమాచారం అందించాడు. గ్రామస్థులు హుటాహుటిన కుంట వద్దకు చేరుకుని గాలించినప్పటికీ, అప్పటికే ఆ ఇద్దరు సోదరులు ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కష్టపడి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కొడుకులను ప్రయోజకులను చేయాలనుకున్న యాకూబ్ దంపతులు, కళ్లముందే బిడ్డల మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

# నిరుపేద కుటుంబానికి సర్పంచ్ బియ్యం పంపిణీ



**దౌల్తాబాద్, ఆగస్టు 30 (వుదయం):** మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన దూదేకుల ఇస్సుబ్ గత వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో గాజులపల్లి సర్పంచ్ పంజ స్వామి తన వంతు సహాయంగా ఆదివారం వారి కుటుంబానికి బియ్యం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పంజ స్వామి మాట్లాడుతూ.. ఇస్సుబ్ కుటుంబానికి అండగా నిలిచేందుకు తనవంతు సహాయం అందించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రేమ్‌కుమార్, వార్డు సభ్యులు మాదర్ స్వామి, ఎం. రాజు, దాసరి స్వామి, కే. కరుణాకర్, గంగులు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ విధానాన్ని సవరించాలి

- **హలో మాల.. చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలి**

**దౌల్తాబాద్, ఆగస్టు 30 (వుదయం):** విద్య, ఉద్యోగ రంగాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించడంతో పాటు రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న నిర్వహించనున్న హలో మాల.. చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల సంఘం మండల అధ్యక్షుడు బొల్లం రాజేష్ పిలుపునిచ్చారు.ఆదివారం దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద 'హలో మాల.. చలో సెక్రటేరియట్' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొల్లం రాజేష్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుత రోస్టర్ విధానం కారణంగా మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో మాలలకు నష్టం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించి, మాలలకు



రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు సోమవారం సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీరాముల సుధాకర్, మండల నాయకులు కంఠం బాలనర్స్, రాయపోల్ కిష్టయ్య, పరశురాములు, బిక్షపతి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం



**మునిపల్లి వుదయం :** మండలం లో ని మొదుగుంపల్లి గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తుల జయ జయధ్వానాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కళ్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా సాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కళ్యాణ మహోత్సవంలో భక్తులతో కలిసి పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో శివ కుమార్,పట్లోళ్ల నాగేశ్వర్ పాటిల్, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, వీరశైవ సమాజ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుని సన్నిధిలో ఘనంగా గందిగా

# కవిత రాజు దంపతుల 27వ వివాహ వార్షికోత్సవ వేడుకలు

**సదాశివపేట వుదయం :** భక్తిశ్రద్ధల నడుమ, శ్రీ బసవేశ్వర స్వామి వారి ఆశీస్సులతో వీరశైవ లింగాయత్ సమాజం సదాశివపేట అధ్యక్షులు శ్రీ గందిగా కవిత రాజు దంపతుల 27వ వివాహ వార్షికోత్సవ వేడుకలు స్థానిక శ్రీ బసవేశ్వర మందిరంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బసవేశ్వర స్వామివారి ఆశీస్సులు పొందారు. గందిగా కవిత రాజు దంపతుల దాంపత్య జీవితం మరింత ఆనందమయంగా, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండాలని సమాజ సభ్యులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ అపర్ణ పాటిల్, కార్యనిర్వాహక అధ్యక్షులు అన్నిశెట్టి జయప్రకాశ్, కోశాధికారి అమరాధి రాచన్నతో పాటు సమాజ సభ్యులు రాచప్ప, రమేష్, రవి, సురేష్, శేఖర్, సతీష్, రవణప్ప, సోమశేఖర్, షాబాద్ వీరన్న, విశ్వనాథ్, ప్రవీణ్, లోకేష్, మల్లేశం, వీరు, వైద్యనాథ్, నర్సింలు, నాగు తదితరులు పాల్గొన్నారు.అలాగే జిల్లా మహిళా కార్య నిర్వాహక అధ్యక్షులు అన్నిశెట్టి అన్నపూర్ణ, కవిత, శశికళ, శిరీష, పల్లవి, సంధ్య, రమా, స్వాతి, సావిత్రి, నర్మద, లలిత తదితరులు పాల్గొన్నారు.వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు, మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని గందిగా కవిత రాజు దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిభావంతో ఆలయం మారుమోగుతుండగా, సమాజ సభ్యుల ఆత్మీయత మధ్య వేడుకలు ఆనందోత్సాహంగా కొనసాగాయి.శ్రీ బసవేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు గందిగా కవిత రాజు దంపతులపై ఎల్లప్పుడూ ఉండాలని, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో కొనసాగాలని వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు ఆకాంక్షించారు.



# రోడు బాగుచేయాలి

- **ఎమ్మెల్యే సునీత రెడ్డి పాదయాత్ర.....**
- **శివ్వంపేట.బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజా రమణా గౌడ్....**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 30....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని పోతుల బొగుడ గ్రామం నుండి వెల్దుర్తి వరకు రోడ్డు బాగు చేయించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాదయాత్ర. శివ్వంపేట మండల పరిధిలోని పోతుల బొగుడ గ్రామ చెపురస్త నుండి వెల్దుర్తి వరకు రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడడంతో రాదారిపై వేలే ప్రయాణికులకు ఇబ్బంది కారంగా ఉందని. ప్రభుత్వం తక్షణమే ఈ రోడ్డు తక్షణమే చేపట్టాలని సోమవారం ఉదయం 7గంటల నుంచి పాదయాత్ర శివ్వంపేట మండల బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి వెల్దుర్తి వరకు పాదయాత్ర చేస్తున్నందున పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్ర విజయవంతం చేయాలని బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్ పిలుపునిచ్చారు.

## అనాథ పిల్లలకు రూ.4 వేల

# చేయూత పింఛన్ ఇవ్వాలి

- **TGVP రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చరణ్ తేజ డిమాండ్**



**దుబ్బాక, ఆగస్టు 30 (వుదయం):** తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా జీవిస్తున్న బాలబాలికలకు చేయూత పథకం కింద నెలకు రూ.4 వేల పింఛన్ అందించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (TGVP) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇస్తారిగల్ల చరణ్ తేజ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులను కోల్పోయిన అనేక మంది అనాథ బాలబాలికలు బంధువుల ఇళ్లలో, పాఠశాలలు, హాస్టళ్లలో జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. కొంతమంది పిల్లలు కనీస వసతులు, ఆర్థిక భరోసా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తల్లి లేదా తండ్రిలో ఒకరిని కోల్పోయిన సెమీ ఆర్ఫన్ పిల్లలతో పాటు తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన ఫుల్ ఆర్ఫన్ పిల్లలను కూడా చేయూత పథకం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. వారి విద్య, జీవనోపాధి, భవిష్యత్ అవసరాలకు ప్రభుత్వం అండగా నిలవాలని అన్నారు.అనాథ పిల్లలను చేయూత పింఛన్ పరిధిలో ప్రత్యేక కేటగిరీగా చేర్చి అర్హులైన ప్రతి చిన్నారికి నెలకు రూ.4 వేల చొప్పున పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తల్లిదండ్రుల్లేని పిల్లలకు సామాజిక భద్రత కల్పించాలని చరణ్ తేజ కోరారు.

# మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి 48వ పుట్టినరోజు వేడుకలు

- **వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు**
- **ఉమ్మడి మండలాల ఇన్చార్జి గోవిందు శ్రీధర్ రెడ్డి**
- **మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి**
- **మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి**

**చిన్నంబావి మండలం 30 (వుదయం రిపోర్టర్ )** చిన్నంబావి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి 48వ పుట్టినరోజు వేడుకలకు ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు. చిన్నంబావి మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ప్రారంభం కానున్నాయి. మొదట ఈ కార్యక్రమం వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తల్లో చే న్నంబావి మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించబడును. అనంతరం కార్యకర్తల సమక్షంలో కేక్ కటింగ్ చేసే కార్యక్రమం ప్రారంభించబడును. ఈ కార్యక్రమానికి కొల్లాపూర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు మాజీ తాజా ప్రజా ప్రతినిధులు, ప్రజలతో పాటు చిన్నంబావి మండల సీనియర్ నాయకులు, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అభిమానులు, శ్రేయోభిలాషులు, నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.



## సర్పంచుల సంఘం

# అధ్యక్షులు శరత్ రెడ్డి కి సన్మానం



- **మాజీ జడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం**
- **వనపర్తి జిల్లా ప్రతినిధి సామాజిక తెలంగాణ**

**చిన్నంబావి మండలం 30 (వుదయం రిపోర్టర్ )** చిన్నంబావి మండల సర్పంచుల సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన వెలగొండ గ్రామ సర్పంచ్ శరత్ రెడ్డి ని చిన్నంబావి మండల మాజీ జడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నూతన సర్పంచుల సంఘం అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి చేతుల మీదగా ఘన సన్మానంతో వెల్లివిరిసిన నాయకులు, కార్యకర్తల అభిమానం.

## దుబ్బాక బస్‌స్టేషన్‌లో

# ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం



- **ప్రయాణికుల రద్దీ ఉన్నా డ్యూటీ కంట్రోలర్ లేని వైనం**

**దుబ్బాక, ఆగస్టు 30 (వుదయం)** దుబ్బాక పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ బస్‌స్టేషన్‌లో డ్యూటీ కంట్రోలర్ అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బస్సుల రాకపోకలు, సమయాలపై సమాచారం అందించేందుకు డ్యూటీ కంట్రోలర్ లేకపోవడంతో ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల వివరాలు తెలుసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్‌స్టేషన్‌లో విధుల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

# దేవాలయ నిర్మాణంతో భక్తి, భావం ఆధ్యాత్మికత ను పెంపొందిస్తాయి

- **సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**వెల్దండ ఆగస్టు 30 (వు దయం )** మండల పరిధిలోని బర్కత్‌పల్లి గ్రామంలోశ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు, ఆలయ నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

ఈ పవిత్ర కార్యక్రమానికిఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై అమ్మవారి ప్రతిష్ఠాపన అనంతరం శ్రీ పెద్దమ్మ తల్లిని దర్శించుకుని పూజ కార్యక్రమంలో పాల్గొని,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు,

**ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.** శ్రీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు బర్కత్‌పల్లి గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు,భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు,

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు భక్తులకు ఆయన అభినందనలు తెలిపారు,అలాగే ఆలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటును అందించేందుకు ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు,

**ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ**

తమ ఆహ్వానం మేరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ అమ్మవారి ఆశీస్సులతో గొప్ప స్థానాలకు చేరుకోవాలని కోరుకుంటున్నామని తెలియజేశారుఈ కార్యక్రమంలో.ఆలయ కమిటీ చైర్మన్ పర్వతాలు,ఉప సర్పంచ్ నరసింహ,సీనియర్ నాయకులు బొజ్జయ్య, అల్లాజీ,కొండల్, లింగం,మల్లేష్,శ్రీశైలం,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రాజు, జంగయ్య,కొండల్ యాదవ్,

# శ్రీసాయినాథుడే దత్తాత్రేయుడు

- **ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్....**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 30...**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం లో కొలువు తీరిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి శిరిడి సాయి బాబా కు నేడు శ్రావణ మాసం పురస్కరించుకొని శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన అర్చకులు శాస్త్రుల నటరాజ్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ ప్రముఖ సంఘ సేవకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది పెదగౌని జిన్నారం శివకుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతరంవారు మాట్లాడుతూ సాయి బాబా గురించి ఇలా వివరిస్తూ భక్తుల్ని ఇష్టానుసారం పూజలు చేసుకోవడానికి బాబా అనుమతించే వారని తెలుసుకున్నాం కదా! కానీ, ఆ చేసే సేవ సరిగా చేయకపోతే మాత్రం సహించే వారు కాదు.ఒకసారి నానా సాహెబు చందోర్కరు తన తోడల్లుడు బిని వాల్యాతో కలిసి షిరిడీకి వచ్చాడు. నానా బాబాతో ఏదో మాట్లాడుతుండగా హఠాత్తుగా బాబా "ఇన్నాళ్ల నుంచి నా సహవాసం చేసి కూడా ఇలా చేశావేమిటి?" అని నిలదీశారు.నానా సాహెబుకు మొదటేమీ అర్థం కాలేదు. వివరంగా చెప్పమని బాబాను అడిగాడు. "కోపర్గాం నుంచి షిరిడీకి ఎలా వచ్చావు?" అని బాబా అడిగారు.

**వెంటనే నానాకు తాను చేసిన తప్పేమిటో తెలిసింది.**

సాధారణంగా నానా షిరిడీకి వచ్చే ముందు కోపర్గాంలో దిగి దత్తదర్శనం చేసుకుని ఆ తరువాత బాబాను దర్శించుకునేవాడు. ఈసారి తన తోడల్లుడు దత్త మందిరానికి వెళ్లామని బలవంతం చేసినా వినకుండా, ఆలస్యమైపోతోందని నేరుగా షిరిడీకి వచ్చేశాడు.

**సర్వజ్ఞులైన బాబా ఈ విషయాన్నే నానాకు గుర్తు చేశారు!**

అందుకేనేమో, తాను కోపర్గాంలోని గోదావరిలో స్నానం చేస్తున్నప్పుడు ఒక ముల్లు గుచ్చు కుని మిక్కిలి బాధించిందని నానా చెప్పాడు.

కొంతవరకు తప్పనకు ప్రాయశ్చిత్తం జరిగిందని, ఇకపై జాగ్రత్తగా ఉండమని బాబా అతనికి హితవు పలికారు.





## బాధిత కుటుంబాలకు

# బియ్యం అందజేసిన 'ఫ్రెండ్స్ గ్రూప్'

**సిద్దిపేట/జగదేవపూర్, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలో ఇటీవల మరణించిన మాందాపూర్ గ్రామానికి చెందిన మావురపు సత్తయ్య, పలుగుగడ్డకు చెందిన చెక్కల గంగమ్మల కుటుంబాలను పలుగుగడ్డ, మాందాపూర్ 'ఫ్రెండ్స్ గ్రూప్' సభ్యులు పరామర్శించారు. నర్ర నర్సింలు, లింగాల గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం బాధిత కుటుంబాలకు రూ. సహాయంగా ఒక్కో కుటుంబానికి క్వింటాల్ (100 కేజీలు) చొప్పున సన్న బియ్యం అందజేశారు. ఆపదలో ఉన్న వారికి సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ఈ సందర్భంగా సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, కృష్ణ, అంజయ్య, నరేష్, రమేష్, సంపత్ తదితర ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## ఫిర్యాదు అందిన

# 24 గంటల్లోనే ఐచర్ దొంగ అరెస్ట్

- **రూ.12 లక్షల విలువైన డీసీఎం ఐచర్ వాహనం స్వాధీనం**




**సదాశివపేట, ఆగస్టు 30:వుదయం:** పార్కింగ్ చేసిన డీసీఎం ఐచర్ వాహనాన్ని అర్ధరాత్రి దొంగిలించిన ఘటనలో సదాశివపేట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి, ఫిర్యాదు అందిన కేవలం 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన దొంగిలించిన డీసీఎం ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 27వ తేదీ రాత్రి సదాశివపేట పట్టణంలోని పీ ఎస్ఎంఎల్ బైపాస్ సమీపంలో ఉన్న అమ్మ ఒడి రెస్టారెంట్ వెనుక పార్క్ చేసి ఉన్న TS15UD1956 నంబర్ గల డీసీఎం ఐచర్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ ఘటనపై బాధితుడు ఈ నెల 29న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.కేసు తీవ్రతను గుర్తించిన సదాశివపేట ఇన్స్పెక్టర్ డి. వెంకటేష్ వెంటనే దర్యాప్తు చేపట్టారు. ఎస్సై లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక క్రైమ్ టీమ్‌ను ఏర్పాటు చేసి, పట్టణంలోని సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. గతంలో తాను పనిచేసిన బ్రిక్స్ కంపెనీ వద్ద రాత్రి సమయంలో ఐచర్ వాహనం అమ్మ ఒడి రెస్టారెంట్ వెనుక పార్క్ చేసి ఉంటుందని తెలిసిన నిందితుడు, అర్ధరాత్రి సమయంలో ఎవరూ లేని అవకాశాన్ని ఉపయోగించుకుని వాహనాన్ని దొంగిలించి పరారైనట్లు పోలీసులు పేర్కొన్నారు.అయితే, సీసీ కెమెరాలు మరియు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పోలీసులు వేగంగా దర్యాప్తు జరిపి ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన డీసీఎం ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అనంతరం నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ డి. వెంకటేష్ మాట్లాడుతూ, ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాలు, షాపుల వద్ద తప్పని సరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించిన సదాశివపేట పోలీసు బృందాన్ని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య అభినందించారు. ఇన్స్పెక్టర్ వెంకటేష్, ఎస్సై లక్ష్మారెడ్డి, ఐడీ పార్టీ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, కానిస్టేబుళ్లు వెంకటేశం, అమానుల్లా, నహీద్ పాషాలను ప్రత్యేకంగా ప్రశంసించారు.

# పద్మా దేవేందర్ రెడ్డి పాదయాత్ర పై కాంగ్రెస్ నాయకుల కౌంటర్

**మెదక్ జిల్లా వుదయం** నిజాంపేట మండలం పదేళ్ల పాలనలో అభివృద్ధి చేయలేని మాజీ శాసన సభ్యురాలు పద్మాదేవేందర్ రెడ్డి, పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందని నిజాంపేట మండల కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 10 సంవత్సరాలుగా ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ గా ఉన్న పద్మ దేవేందర్ రెడ్డి, నిజాంపేట మండలాన్ని ఎంత పార్టీ అభివృద్ధి చేశారో చూపించాలని వారు సూటిగా ప్రశ్నించారు. నిన్న చేసిన పాదయాత్రలో 16 గ్రామపంచాయతీలకు సంబంధించి నాలుగు గ్రామాల ప్రజలు కొందరు మాత్రమే మద్దతుగా నిలిచారని మిగతా గ్రామాల ప్రజలు రాకుండా వేరే మండలాల నుండి కార్యకర్తలను తరలించి పాదయాత్ర చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు.నంద గోకుల్, చల్మెడ,రోడ్డు విషయంలో 13 కోట్లు మంజూరు చేసింది మీరే కదా! మరి మీరు ఎందుకు రోడ్డు వేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ రెండేళ్ల వ్యవధిలో సంక్షేమ అభివృద్ధితో దూసుకెళ్లడం చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే పై కక్ష సాధింపుగా వ్యవహరిస్తున్నారని దమ్ముంటే మీరు మండలానికి ఇచ్చిన నిధులు ఎన్నో చూపించాలని. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన నిధులు ప్రజల సమక్షంలో తేల్చుకుందామని వారు సవాల్ విసిరారు. పద్మా దేవేందర్ రెడ్డి కార్యకర్తలను కాపాడుకుని యోగతలేని మీకు కాంగ్రెస్ ప్రభుత్వం పై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. రోడ్డు విషయంలో కమిషన్ల పేరిట కాలయాపన చేస్తున్నారని మాపై అనడం సరైనది కాదని గతంలో పద్మ భర్త దేవేందర్ రెడ్డి, తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఏడుపాయల మంజీరా నదిలో పసుపు పట్టుకుని ప్రమాణాలు చేసింది మీరు కాదా అన్నారు. ఏది ఏమైనప్పటికీ రానున్న రోజుల్లో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, సహకారంతో చల్మేడ కమాన్ నుండి నందగోకుల్ గ్రామం వరకు బ్రహ్మాండమైన రోడ్డు పనులు ప్రారంభిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల పోరం అధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీపీ సిద్ధ రాములు, నసీరుద్దీన్, లింగం గౌడ్, మాజీ సర్పంచ్ అమర సేనా రెడ్డి, కల్వకుంట సొసైటీ చైర్మన్ మహేందర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, సర్పంచులు రామచందర్ నాయక్,బాబు నాయక్, ఉప సర్పంచ్ లు ఆకుల మహేందర్, అంజిరెడ్డి,నాయకులు కొమ్మట బాబు, రవీందర్ రెడ్డి, బజా రమేష్,పంజా మహేందర్ చిన్న అంజగౌడ్, లక్ష్మణ్ గౌడ్, ముత్యాల మధుసూదన్ రెడ్డి, భాస్కర్ గౌడ్,జి.శ్రీనివాస్, భూపతి రెడ్డి,నాగరాజు, కనక రాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.



# పింఛన్ల గడువు పొడిగించాలి: సీపీఎం తాడూర్ మండల కార్యదర్శి అంతటి కాశన్న

**తాడూర్, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):** తాడూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన వికలాంగులు, వితంతువులు, వృద్ధులకు పింఛన్లు అందేలా దరఖాస్తుల గడువును వచ్చే నెల 20వ తేదీ వరకు పొడిగించాలని సీపీఎం తాడూర్ మండల కార్యదర్శి అంతటి కాశన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక సమస్యలు, సమాచారం లేకపోవడం తదితర కారణాల వల్ల మండలంలోని అనేక గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులు పింఛన్లకు దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులు పింఛన్లపైనే ఆధారపడి జీవిస్తున్నారని, గడువు ముగిసిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం మానవత్వంతో స్పందించి దరఖాస్తు గడువును వచ్చే నెల 20వ తేదీ వరకు పొడిగించి, లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాములు, చంద్రయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్





## బాచుపల్లిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**బాచుపల్లి, ఆగష్టు 30,( వుదయం ప్రతినిధి ),**

అర్బన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బాచుపల్లి 2బీ హెచ్ఐజీ3, ప్లాట్ 7వ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి దుర్గాప్రసాద్, జైరాజ్, మోహన్, ఝాన్సీ ఆహ్వానం మేరకు నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఅర్ఎస్ పార్టీ ఆర్గనైజషన్ సెక్రటరీ సాంబశివరెడ్డి హాజరై శిబిరాన్ని సందర్శించారు. ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని పేర్కొంటూ నిర్వాహకులను అభినందించారు. స్థానిక ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో చంద్రయ్య, రాంసయ్య, నర్సింగ్, లలితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని సంస్కృతులకు గౌరవం

### సంస్కృతుల సమ్మేళనానికి వేదిక - ఓనం వేడుకల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి"





**రామచంద్రాపురం , ఆగస్టు 30( వుదయం)**

విభిన్న సంస్కృతులు, ఆచారాలు, సంప్రదాయాలకు పటాన్‌చెరు నియోజకవర్గం నిలయంగా నిలుస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు.

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నాయర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓనం వేడుకలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేరళ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఓనం పండుగను రామచంద్రాపురంలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే ఇటువంటి పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరి పండుగలు, సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఓనం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ వేడుకలు, కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ప్రమోద్ గౌడ్, ఐలేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, నాయర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

- **జీపీఎల్–3 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**

**గుమ్మడిదల ఆగస్ట్ 30(వుదయం):**

గుమ్మడిదల ఆగస్ట్ 30(వుదయం): గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం సందడిగా జరిగాయి. సీకేజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీపీఎల్ 3 క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులను గోవర్ధన్‌రెడ్డి పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. యువత క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యంతోపాటు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు ప్రతిభను చాటుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కుమార్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సురభి కుమార్‌గౌడ్, సంజీవరెడ్డి, కిషన్, నాయకులు వెంకట్రాంరెడ్డి, దేవేందర్‌రెడ్డి, హుస్సేన్, తుపాకుల రాజు, మహేష్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మురళి, ఆంజనేయులు, కరుణాకర్‌గౌడ్, దాసరి సాయియాదవ్, నరేష్, సాయి, శ్రీనివాస్, రవి తదితరులతో పాటు సీకేజీ యువసేన సభ్యులు, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీ

**ముషీరాబాద్, ఆగస్టు 30 (వుదయం)**



భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి నూతన కమిటీని నియమించినట్లు సమితి ప్రధాన కార్యదర్శి డా. రవినూతల శశిధర్ తెలిపారు.నూతన కన్వీనర్‌గా కె. సందీప్ కిరణ్, కోకన్వీనర్లుగా ఏ. గంగాధర్, పి. విజయ్ కుమార్ (లడ్డు), జి. ఉదయ్ కుమార్లను నియమించారు.ఈ సందర్భంగా నూతన కన్వీనర్, కోకన్వీనర్లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సమితి అధ్యక్షులు జి. రాఘవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. రవినూతల శశిధర్, కార్యదర్శి మరియు సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆలే భాస్కర్ రాజ్, సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.ఎస్. భాస్కర్ గిరి, కోఆర్డినేషన్ సభ్యులు సురేందర్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే శ్రీ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా, విజయవంతంగా నిర్వహించేందుకు సమితి మార్గదర్శకత్వంలో పూర్తి అంకితభావంతో పనిచేస్తామని వారు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు, యువత, ప్రజలందరినీ సమన్వయం చేసుకుంటూ భక్తి, సేవ, సమాజ ఐక్యతకు ప్రతీకగా గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## కిస్మత్పూర్‌లో ఘనంగా మల్లన్న స్వామి బోనాల పండుగ

### పాల్గొన్న నీరుడు సర్వేష్ ముదిరాజ్

- **మల్లన్న స్వామి బోనాల కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుల సందడి**
- **భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మల్లన్న స్వామి బోనాల పండుగ కార్యక్రమం**

**గండిపేట్, ఆగస్టు 30 (వుదయం)**

కిస్మత్పూర్ విలేజ్‌లో ఆదివారం మల్లన్న స్వామి బోనాల పండుగ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు నీరుడు సర్వేష్ ముదిరాజ్ పాల్గొని మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ వాతావరణంతో కిస్మత్పూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమానికి మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ గారు కూడా హాజరై మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి వేడుకలను వీక్షించారు. గ్రామస్తులు, భక్తులు సంప్రదాయబద్ధంగా బోనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి, ఆధ్యాత్మికతతో కూడిన సందడి నెలకొంది.కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, బండారి మల్లేష్ యాదవ్, బండారి దేవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆంజనేయులు ముదిరాజ్, టిల్లు ముదిరాజ్తో పాటు పలువురు నాయకులు, గ్రామ ప్రముఖులు, భక్తులు హాజరయ్యారు. అందరూ కలిసి మల్లన్న స్వామి బోనాల పండుగ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు. పండుగ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.కిస్మత్పూర్ గ్రామంలో ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే బోనాల పండుగకు ఈసారి కూడా విశేష స్పందన లభించింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని పండుగను ఘనంగా నిర్వహించారు. మల్లన్న స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం భక్తులు, నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పండుగ వేడుకలను ముగించారు.



## యువత డ్రగ్స్ బారిన పడకుండా చైతన్యపరచాలి

### మన్ కీ బాత్' ప్రసంగంలో బీజేపీ నేత ఎ.వినయ్ కుమార్



**ముషీరాబాద్,ఆగస్టు 30(వుదయం)**

వ్యసనం ఒక వ్యక్తినే కాకుండా మొత్తం కుటుంబాన్ని, సమాజాన్ని తీవ్రంగా నాశనం చేస్తుందని, డ్రగ్స్ దుష్ప్రభావాలపై యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ బూత్ నెం.7 పరిధిలోని చిక్కడపల్లి వివేక్‌నగర్ బస్తీలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ముఖ్య అతిథిగా ఎ.వినయ్ కుమార్ పాల్గొని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులతో కలిసి ప్రధాని ప్రసంగాన్ని విన్నారు.వినయ్ కుమార్ మాట్లాడుతూ, 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ డ్రగ్స్ నిర్మూలన, యువతలో అవగాహన, 'డ్రగ్‌ఫ్రీ ఇండియా' లక్ష్యంపై ప్రత్యేకంగా ప్రస్తావించారని తెలిపారు. దేశవ్యాప్తంగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు మరింత వేగం పుంజుకోవాల్సిన అవసరం ఉందన్నారు.డ్రగ్స్ మరియు ఇతర వ్యసనాలకు యువత దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువజన సంఘాలు, ప్రజా సంఘాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యసనాల బారిన పడిన వారికి అండగా నిలిచి, వారికి సరైన మార్గదర్శకత్వం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.'డ్రగ్‌ఫ్రీ ఇండియా' సాధన కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రజలందరూ భాగస్వాములై ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎ.వినయ్ కుమార్ కోరారు. యువత ఆరోగ్యంగా, బాధ్యతాయుతంగా ఎదిగినప్పుడే దేశం మరింత బలమైన భవిష్యత్తు వైపు పయనిస్తుందని అన్నారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యేందర్, లావణ్యతో పాటు వివేక్‌నగర్ బస్తీ స్థానికులు సురేష్ బాబు, రాజు, అరుణమ్మ, సత్యమ్మ, చంద్రకళ, శివ, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.







## ఘనంగా ఐదుగుళ్ల పోచమ్మ బోనాలు

- **సంప్రదాయబద్ధంగా బోనం, తొట్టెల సమర్పణ**

**రామచంద్రాపురం, ఆగస్టు 30(వుదయం)**

శ్రావణమాస బోనాల పండుగ సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ మందుముల శ్రీనివాస్‌నగర్ కాలనీలోని శ్రీ ఐదుగుళ్ల పోచమ్మతల్లి ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కుటుంబసభ్యులతో కలిసి తమ ఇంటి నుంచి బోనం, తొట్టెలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## ఘనంగా రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు





**రామచంద్రాపురం, ఆగస్టు 30(వు దయం)**

తెలంగాణ రాష్ట్ర 45వ సబ్‌జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రిలింగంపల్లి నియోజకవర్గం భారతీనగర్ డివిజన్ ఓల్డ్ ఎంఐజీ కాలనీలో మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించారు.పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి పోటీలకు హాజరై వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను అభినందించారు. చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని అన్నారు.

క్రీడాకారులు పట్టుదలతో సాధన చేసి ఉన్నతస్థాయికి ఎదిగి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కాటూరి శ్రీనివాస్‌రావు, కార్యదర్శి వై.రామారావు, పారిశ్రామికవేత్త రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్‌రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, కాలనీ అధ్యక్షులు బాలయ్య, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







ఉష
వుదయం సాహిత్యం

# ఆకుపచ్చని కవితలు

గుల్జార్ గురించి రాయడం చాలా ఇష్టమయిన ఒక విచిత్రమైన సవాలు. ఆయన జీవితం సాహిత్యం చూస్తే మనకు ఎంతగా పరిచితుడు అనిపిస్తాడో అంతే కొత్తగా కనిపిస్తాడు. ఆయన కవితలు, పాటలు మన సామూహిక జ్ఞాపకాల్లోకి ప్రవేశించాయి. అవి వర్షం కురుస్తున్నప్పటి సంతోషాన్ని మోసుకొస్తాయి. ప్రేమతో పలుకుతాయి. విరహంతో మౌనందాలుస్తాయి. అంతేకాదు పాఠకుడికి తన బాల్యాన్ని గుర్తు చేస్తాయి. ఒంటరితనానికి ఒక స్వరాన్ని ఇస్తాయి. సినిమా, రేడియో, టెలివిజన్, పుస్తకాలు దాదాపు అన్ని మాధ్యమాల ద్వారా ఆయన సాహిత్యం పాటలు తరతరాల భారతీయ అనుభవంలో భాగమైపోయాయి. గుల్జార్ గొప్పతనం కేవలం కవిత్వాన్ని సినిమాకు తీసుకు రావడంలో లేదు. సరళమయిన కవిత్వానికి అవసరమైన లోతుని అంతర్ముఖతను, సంకేతాన్ని, అందించడంలో ఆయన ప్రత్యేకత వుంది. ఆయన తన రచనల ద్వారా మన నిత్యజీవితాన్ని మనమే మళ్లీ ఆశ్చర్యంగా చూడటం నేర్పించారు ఆయన కవిత్వంలో ఒక రైల్వే స్టేషన్ భావోద్వేగ భూభాగమవుతుంది. ఒక కిటికీ జ్ఞాపకానికి ద్వారమవుతుంది. వర్షం ఒక సంభాషణగా మారుతుంది. ఎప్పుడో వెళ్లిపోయిన మనిషి ఒక గదిలో మిగిల్చిన నిశ్శబ్దం ఒక కవితగా మారుతుంది. గుల్జార్ కవిత్వం సాధారణ వస్తువుల దగ్గర మొదలవుతుంది. గుల్జార్ సృజనలో అత్యంత ఆకర్షణీయమైన విషయం ఆయన పదచిత్రాలు. సాధారణంగా కవి ఒక భావాన్ని పదాల్లో చెబుతాడు. గుల్జార్ మాత్రం ఆ భావానికి ఒక దృశ్యరూపాన్ని ఇస్తాడు. అందుకే ఆయన కవితలు పాటలు వినిపించడమే కాదు కనిపిస్తాయి.

ఇంకా గుల్జార్‌ను చదివినప్పుడు మనకు పదేపదే ఎదురయ్యేది 'జ్ఞాపకం'. వర్తమానంలో ఉన్న మనిషి వెనక్కి చూస్తాడు. గతంలో జరిగిన ఒక చిన్న సంఘటన అతని వర్తమాన జీవితాన్ని మార్చేస్తుంది. ఒక పాత వస్తువు. ఒక పాత పాట. ఒక పాత వీధి. ఒక పాత ఉత్తరం. ఒక పాత ప్రేమ. ఇవేవీ గతంలోనే ఉండిపోవు. గుల్జార్ రచనల్లో 'గతం వర్తమానంలోకి తిరిగి వచ్చే జ్ఞాపకం'లా వుంటుంది. అందుకే ఆయన రచనలో కాలం సరళరేఖలా ఉండదు. గతం, వర్తమానం ఒకదానిలోకి మరొకటి ప్రవేశిస్తాయి. ఇది బహుశా ఆయన చూసిన దేశ విభజన కాలం నాటి అనుభవంతో వచ్చి వుంటుంది. ఆయన బాలుడిగానే తాను పుట్టిన నేలను వదిలి రావడం, దేశ విభజనలో హింసను చూడడం, వలస జీవితం, కోల్పోయిన పరిచయాలు ఇలాంటి అనేక అనుభవాలు గుల్జార్ మనసులో చెరపలేని ముద్రలుగా మిగిలాయి. అవి ఆయన రచనల్లో అంతర్లీనంగా సున్నితత్వంగా మారాయి.

ఒకరకంగా సీరియస్ సాహిత్యం, ప్రజాదరణ పొందిన సినీ సంస్కృతులను మనం తరచూ వేర్వేరు ప్రపంచాలుగా చూస్తుంటాం. కవిత ఒక పుస్తకంలో ఉండాలి. పాట సినిమా కోసం. కథ పత్రికకు లేదా సినిమా కోసం కావాలి అని భావిస్తాం. కానీ ఈ హద్దులన్నింటినీ గుల్జార్ చెదరగొట్టాడు. ఆయన కవి. గేయరచయిత. దర్శకుడు. కథకుడు. స్క్రీన్‌ప్లే రచయిత. కవితా రూపాలపై ప్రయోగాలు చేసిన సృజనకారుడు. హిందీ-ఉర్దూ సాహిత్య సంప్రదాయాల్లో లోతుగా వేళ్లూనుకుని, అదే సమయంలో హిందీ సినిమా అనే అత్యంత ప్రజాదరణ పొందిన మాధ్యమం ద్వారా సాహిత్యాన్ని కోట్లాది మంది ప్రేక్షకుల అనుభవంలోకి తీసుకెళ్లిన రచయిత. ఇది మౌలికంగా ఆయన సృజనాత్మక స్వభావం. గుల్జార్ కవిత్వం గురించి మాట్లాడేటప్పుడు ఆయన క్లుప్తతను గురించి మాట్లాడాలి. ఎక్కువ మాటలు చెప్పడం సాహిత్య గొప్పతనం కాదు. ఒక చిన్న పంక్తి మనలో పెద్ద అనుభూతిని రేపగలిగితే అదే కవిత్వం. గుల్జార్ కూడా 'అధికంగా చెప్పడం కంటే తక్కువ మాటల్లో ఎక్కువ చెప్పడానికే ప్రాధాన్యం ఇస్తానని' పలుసార్లు చెప్పారు. అది ఇది ఆయన పాటల్లోనూ కనిపిస్తుంది. సంభాషణల్లోనూ కనిపిస్తుంది. కవితల్లోనూ కనిపిస్తుంది. చెప్పిన దానికంటే చెప్పకుండా వదిలినదే కొన్నిసార్లు ఎక్కువ మాట్లాడుతుంది. నిజానికి గుల్జార్ ప్రయాణం ఒకే దారిలో సాగలేదు. మొదట రచన. తర్వాత పాట. తర్వాత సంభాషణ. తర్వాత దర్శకత్వం. మరోవైపు కవిత్వం. మరోవైపు అనువాదం. టెలివిజన్‌లో మరో సృజనాత్మక ప్రపంచం. 'మిర్జా గాలిబ్' వంటి టెలివిజన్ సీరియల్స్‌లో గాలిబ్ జీవితం, కవిత్వాన్ని దృశ్యరూపంలో ఆవిష్కరించడం ఆయన సాహిత్యాభిరుచికి మరో ఉదాహరణ.






ఇది గుల్జార్ బహుముఖ ప్రజ్ఞ మాత్రమే కాదు. ఒక కళ మరొక కళ ఎలా చోదక శక్తి అవుతుందో చూపించే సృజనాత్మక ప్రయాణం. కవిత్వం ఆయన సినిమాను ప్రభావితం చేసింది. సినిమా ఆయన కవిత్వానికి దృశ్యాన్ని ఇచ్చింది. సంగీతం ఆయన పదాలకు శరీరమైంది. భాష ఆయనకు ప్రపంచాన్ని పరిచయం చేసింది. గుల్జార్ సృజనలో అనువాదం ఒక ప్రత్యేకమైన అధ్యాయం. భారతదేశాన్ని అర్థం చేసుకోవాలంటే భారతీయ భాషల్ని వినాలి. ప్రతి భాషలో ఒక ప్రాంతం ఉంటుంది. ప్రతి ప్రాంతంలో ఒక జీవితం ఉంటుంది. ప్రతి జీవితంలో ఒక ప్రత్యేకమైన అనుభవం ఉంటుంది. ఆ అనుభవాలు ఒక భాషలోనే బంధించబడిపోతే దేశం తనలోని ఒక భాగాన్ని కోల్పోతుంది. గుల్జార్ అనువాదాల ద్వారా ఆ గోడలను కొంతవరకు తొలగించే ప్రయత్నం చేశారు. వివిధ భారతీయ భాషల సమకాలీన కవులను ఒకే సంకలనంలో పరిచయం చేయడం ఆయన సాంస్కృతిక దృష్టికి నిదర్శనం 'A Poem a Day'లో 34 భారతీయ భాషలకు చెందిన 279 మంది కవుల 365 కవితలను అనువాదం చేసాడాయన. ఇది భారతదేశాన్ని ఒక భాష నుంచి మరో భాషలో వినిపించే ప్రయత్నం.

ఒక తెలుగు కవి తన మలయాళీ సోదరుడి కవితను చదవడం, ఒక బెంగాలీ కవి పంజాబీ కవితలో తన అనుభవాన్ని గుర్తించడం ఇదే నిజమైన సాంస్కృతిక ఏకత్వం. గుల్జార్‌కు సినిమా రంగంలో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆస్కార్, గ్రామీ, దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం వంటి అనేక గౌరవాలు ఆయనకు లభించాయి. సాహిత్య రంగంలో సాహిత్య అకాడెమీ పురస్కారం, పద్మభూషణ్ వంటి గౌరవాలు కూడా అందుకున్నారు. అంతేకాదు గుల్జార్‌కు లభించిన 58వ జ్ఞానపీఠ పురస్కారం ఆయనకు అందిన గొప్ప గౌరవం. గుల్జార్‌ను చూస్తే నాకు ఒక గొప్ప అందమయిన వంతెన గుర్తుకొస్తుంది. ఒక వైపు సాహిత్యం. మరో వైపు సినిమా. ఒక వైపు హిందీ, మరో వైపు ఉర్దూ, పంజాబీ, బెంగాలీ, ఇతర భారతీయ భాషలు. ఒక వైపు శబ్దం. మరో వైపు నిశ్శబ్దం. ఒక వైపు గతం. మరో వైపు వర్తమానం. ఆ రెండు నదుల మధ్య నడుస్తూ, వాటిని కలుపుతూ వెళ్తున్న మనిషి గుల్జార్. ఆయన పాట ఒక చిన్న కవిత. ఆయన కవిత ఒక దృశ్యం. ఆయన దృశ్యం ఒక జ్ఞాపకం. ఆ జ్ఞాపకం చివరికి మన జీవితంలోకి వచ్చి చేరుతుంది. అందుకే గుల్జార్‌ను చదవడం అంటే కేవలం ఒక కవిని చదవడం కాదు. మనలో ఎప్పుడో మరచిపోయిన ఒక మనిషిని మళ్లీ కలుసుకోవడం. అదే గుల్జార్ సృజనకు ఉన్న చిరస్థాయిత్వం.

> ఇంకా గుల్జార్‌ను చదివినప్పుడు మనకు పదేపదే ఎదురయ్యేది 'జ్ఞాపకం'. వర్తమానంలో ఉన్న మనిషి వెనక్కి చూస్తాడు. గతంలో జరిగిన ఒక చిన్న సంఘటన అతని వర్తమాన జీవితాన్ని మార్చేస్తుంది. ఒక పాత వస్తువు. ఒక పాత పాట. ఒక పాత వీధి. ఒక పాత ఉత్తరం. ఒక పాత ప్రేమ. ఇవేవీ గతంలోనే ఉండిపోవు. గుల్జార్ రచనల్లో 'గతం వర్తమానంలోకి తిరిగి వచ్చే జ్ఞాపకం'లా వుంటుంది. అందుకే ఆయన రచనలో కాలం సరళరేఖలా ఉండదు. గతం, వర్తమానం ఒకదానిలోకి మరొకటి ప్రవేశిస్తాయి. ఇది బహుశా ఆయన చూసిన దేశ విభజన కాలం నాటి అనుభవంతో వచ్చి వుంటుంది.

భారతీయ కవిత

## బురద వరదలో నేపాల్ భూస్థాపితం (జలప్రళయం — విలయతాండవం)

మనసున మనసై...
బతుకున బతుకై...
తోడొకరుండిన అదే
భాగ్యము అదే స్వర్గము "...
ఇది మహాకవి శ్రీశ్రీ వచనం.

తోడు లేని వృద్ధాప్యం నరకమే
ఇది శాపం!
తోడు లేకపోతే.......!!
రాత్రి వెన్నెల కురిసినా....
పొద్దు పొడిచిన చీకటే..
మాట్లాడేందుకు మనిషి లేక
గోడలతో గోడు చెప్పుకోవాలి
కన్నీరు తుడిచే చేయి లేక...
పైటకొంగు తోనే తుడుచుకోవాలి!
మందు బిళ్ళ అందించే మనిషి
లేక.....
వణికే చేతులతో తడబడాలి!
వేధించే వ్యాధిని భరించాలి

ఇది నరకం కాక మరి ఏమిటి ?
నవ్వలేక నడవలేక
పోవడమే నరకమంటే..
సొంత బిడ్డలు చెంత ఉంటే
అదే స్వర్గం

మహాకవి తోడొకరుండిన అదే
భాగ్యం అని ఎందుకన్నాడు ?
గుండె కోతతో రాసిన కవిత్వం అది

పెళ్ళాం మొగుడు పోయాక
ఒంటరి అయ్యాను ఇది శాపం
కానీ బతికుండి... బిడ్డలు
వదిలేసి.....
భార్య భర్త తిట్టుకుంటూ.....
నరకం చూపిస్తే.....
అంతకంటే ఒంటరిగా చావడం
నయం!

ఇదే మహాకవి వేదన!!
తోడు ఉండి వేధిస్తే....
ఆ తోడు కంటే తోడు
లేకపోవడమే భాగ్యం!
ప్రేమ లేని బంధం కంటే....
బంధం లేని ఒంటరితనం నయం!

అసలు ధర్మం ఏమిటి ?
చెట్టు ముసలిదైతే......
పక్షులు వదిలేస్తాయా ?
ఇంకా ఎక్కువ వాలి కబుర్లు
చెప్తాయి!
నది ఎండిపోతే...చేపలు
దూషిస్తాయా ?
చివరి నీటి బొట్టు వరకు
తోడుంటాయి!
మరి కొందరు మనుషులు
అమ్మానాన్న వృద్ధులవుతే
తిట్టుకుంటూ..

ఎందుకు వదిలేస్తారు...?
ఎందుకంటే.......మనిషి
పంచభూతాల ధర్మం మరిచాడు.
పంచభూతాలు తమ ధర్మం మరిస్తే
మనిషి బ్రతకడం కష్టం

తోడు లేని వృద్ధాప్యం నరకం..
ఇది నిజం!
తోడు ఉండి నరకం చూపితే...
అది
అంతకంటే పెద్ద నరకం!
*అసలు భాగ్యం ఏమిటంటే....*
చివరి శ్వాస వరకు
చేయిపట్టుకుని
"నేనున్నా అనే తోడు!
అది భార్య కావచ్చు.....
భర్త కావచ్చు.....
కొడుకుకావచ్చు....
కూతురు కావచ్చు.....
ఒక మంచి మిత్రుడు కావచ్చు!
"తోడు" అనే మాటకు
అర్థం చెప్పే సమాజం కోసం!
"తోడు ఉండాలి.....
చివరి వరకు ఉండాలి...
ప్రేమతో ఉండాలి....
భారం కాదు కూడదు....
భాగ్యంగా ఉండాలి
స్వర్గంగా ఉండాలి..
తోడు ఉన్న ప్రతి వృద్ధుడికకీ
తోడు కోసం ఎదురుచూసే
ప్రతి గుండెకీ.....
*ఈ కవిత అంకితం*



పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

# చివరి ఉత్తరం — మనుషుల మధ్య మాయమవుతున్న మమకారం

ఒకప్పుడు ఉత్తరం అంటే కాగితం మీద రాసిన కొన్ని అక్షరాలు కాదు... ఒక మనిషి తన హృదయాన్ని మరో మనిషి చేతుల్లో పెట్టిన జ్ఞాపకం. ఒక తెల్లటి కాగితం మడతల్లో ఎన్నో భావాలు దాగి ఉండేవి. సిరా చుక్కల్లో కన్నీళ్లు ఉండేవి. అక్షరాల మధ్య నవ్వులు ఉండేవి. ప్రతి వాక్యంలో ఎదురు చూపు ఉండేది. పోస్టుమాన్ సైకిల్ గంట వినిపిస్తే ఇంట్లోని మనసులన్నీ ఒక్కసారిగా తలుపు వైపు పరుగెత్తేవి. గుమ్మం దగ్గర నిలబడి "ఎవరి ఉత్తరం?" అని అడిగే ఆత్రుతలో ఒక ప్రపంచం ఉండేది. కవరును చేతిలోకి తీసుకున్న క్షణంలోనే దూరంగా ఉన్న మనిషి దగ్గరగా వచ్చిన అనుభూతి కలిగేది. ఆ ఉత్తరాన్ని వెంటనే తెరవకుండా కొద్దిసేపు చేతిలో పట్టుకుని, చిరునామాను చూస్తూ, అక్షరాలను గుర్తుపడుతూ, "ఇది మనవాడి చేతిరాతే..." అని మనసులో అనుకునే రోజులుండేవి. ఇప్పుడు ప్రపంచం మన చేతిలో ఉంది. దూరం అనే మాటకు అర్థం తగ్గిపోయింది. ఒక బటన్ నొక్కితే వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న మనిషి ముఖం కళ్ల ముందు కనిపిస్తుంది. ఒక క్షణంలో మాట చేరుతుంది. ఒక క్షణంలో ఫోటో చేరుతుంది. ఒక క్షణంలో వీడియో చేరుతుంది. కానీ విచిత్రం ఏమిటంటే... మనిషి దగ్గరికి వచ్చిన కొద్దీ మనసులు మాత్రం దూరమవుతున్నాయి. వేగం పెరిగింది. సంభాషణ తగ్గింది. పరిచయాలు పెరిగాయి. అనుబంధాలు తగ్గాయి. సందేశాలు వేల సంఖ్యలో వస్తున్నాయి. కానీ మనసును తాకే ఒక్క మాట కోసం మనిషి ఇంకా ఎదురు చూస్తూనే ఉన్నాడు. ఇదే కాలం మన ముందు పెట్టిన పెద్ద ప్రశ్న. మనం మాట్లాడుతున్నామా? లేక కేవలం మెసేజ్‌లు పంపుతున్నామా? మనం ఒకరినొకరు తెలుసుకుంటున్నామా? లేక ఒకరి ఆన్‌లైన్ స్థితిని మాత్రమే చూస్తున్నామా? మనం ప్రేమిస్తున్నామా? లేక ప్రేమను ఒక ఎమోజీతో ముగిస్తున్నామా? ఒకప్పుడు ఒక ఉత్తరం రాయడానికి సమయం పట్టేది. ఇప్పుడు ఒక మెసేజ్ పంపడానికి క్షణం చాలు. కానీ ఆ క్షణంలో మనసు ఎంత ఉంటుంది? అదే అసలు ప్రశ్న. ఉత్తరం రాసే మనిషి ముందుగా ఆలోచించేవాడు. ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? ఏ మాటతో ప్రారంభించాలి? ఏ జ్ఞాపకాన్ని గుర్తుచేయాలి? చివరికి ఏ ఆశీర్వాదంతో ముగించాలి? అని ఎన్నోసార్లు ఆలోచించేవాడు. ఒక వాక్యం తప్పుగా రాస్తే దాన్ని కొట్టేసి మళ్లీ రాసేవాడు. కొన్ని మాటలు రాయలేకపోతే ఖాళీగా వదిలేవాడు. ఆ ఖాళీలో కూడా భావం ఉండేది. కొన్నిసార్లు "నిన్ను చాలా గుర్తు చేసుకుంటున్నాను" అని రాయడానికి కూడా సిగ్గుపడేవారు. కానీ ఆ మాట రాయకపోయినా మొత్తం ఉత్తరం అదే భావంతో నిండిపోయేది. ఇప్పుడు మనం భావాలను టైప్ చేస్తున్నాం. కానీ మనసు పెట్టి రాస్తున్నామా? "టేక్ కేర్", "మిస్ యూ", "హ్యాపీ బర్త్‌డే", "కంగ్రాట్స్" అనే కొన్ని సిద్ధమైన పదాలతో మన అనుబంధాలను ముగిస్తున్నామా? కాలం మారడం తప్పు కాదు. కానీ కాలంతో పాటు మనసు మారిపోవడమే బాధ. ఒకప్పుడు పోస్టుమాన్ ఒక ఉత్తరం తీసుకొస్తే అది ఇంటి వార్త అయ్యేది. విదేశాల్లో ఉన్న కొడుకు నుంచి వచ్చిన




ఉత్తరం అయితే ఇంట్లో పండుగ. సైన్యంలో ఉన్న భర్త నుంచి వచ్చిన ఉత్తరం అయితే భార్యకు ఊపిరి. పెళ్లైన కూతురు నుంచి వచ్చిన ఉత్తరం అయితే తల్లిదండ్రులకు ఆత్మీయత. దూరంగా చదువుకుంటున్న పిల్లవాడి ఉత్తరం అయితే ఇంట్లో ఆనందం. ఉద్యోగం కోసం నగరానికి వెళ్లిన యువకుడి ఉత్తరం అయితే తల్లిదండ్రుల కళ్లలో గర్వం. ఆ ఉత్తరాన్ని ఇంట్లో అందరూ కలిసి చదివేవారు. ఒకరు చదివితే మరొకరు వినేవారు. ఒక మాటను మళ్లీ మళ్లీ చదివేవారు. కొన్ని ఉత్తరాలను పెట్టెలో దాచేవారు. పాత బట్టల మధ్య, పుస్తకాల మధ్య, దేవుడి ఫోటో వెనుక, ఇనుప పెట్టెలో... ఏదో ఒకచోట భద్రంగా ఉంచేవారు. సంవత్సరాలు గడిచినా ఆ ఉత్తరం మళ్లీ బయటకు వచ్చేది. కాగితం పసుపురంగులోకి మారిపోయినా అక్షరాల్లోని ప్రేమ మాత్రం మసకబారేది కాదు. చేతిరాత చూసిన వెంటనే మనిషి గుర్తొచ్చేవాడు. సిరా వాసనలో కాలం తిరిగి వచ్చేది. ఒక పాత ఉత్తరం ఒక మనిషిని గతంలోకి తీసుకెళ్లగలిగేది. ఇప్పుడు మన దగ్గర వేల ఫోటోలు ఉన్నాయి. వేల మెసేజ్‌లు ఉన్నాయి. వందల వీడియోలు ఉన్నాయి. కానీ వాటిలో ఎన్నింటిని మనం పదేళ్ల తర్వాత చేతిలో పట్టుకుని కన్నీళ్లతో చూడగలుగుతాం? ఎన్నింటిలో మనిషి స్వభావం ఉంటుంది? ఎన్నింటిలో ఎదురు చూపు ఉంటుంది? ఎన్నింటిలో ఆత్మ ఉంటుంది? డిజిటల్ సందేశం వేగంగా వస్తుంది. ఉత్తరం మాత్రం నెమ్మదిగా వచ్చేది. ఆ నెమ్మదిలోనే మమకారం పెరిగేది. ఎదురు చూపు ప్రేమను పెంచేది. దూరం అనుబంధాన్ని బలపరచేది. ఇప్పుడు దూరం లేదు. కానీ దగ్గరితనం కూడా లేదు. మనిషి ప్రపంచం నలుమూలల వారితో మాట్లాడుతున్నాడు. కానీ తన ఇంట్లో ఉన్న మనిషితో మాట్లాడటానికి సమయం లేదని అంటున్నాడు. ఇది ఎంత విచిత్రమైన కాలం! ఒకే ఇంట్లో నాలుగు గదులు ఉంటాయి. ప్రతి గదిలో ఒక మనిషి. ప్రతి మనిషి చేతిలో ఒక ఫోన్. అందరూ ప్రపంచంతో మాట్లాడుతున్నారు. కానీ ఇంట్లో ఒకరితో ఒకరు మాట్లాడటం లేదు. తల్లి తన కొడుకుతో "భోజనం చేశావా?" అని అడగడానికి పది అడుగులు నడవాల్సిన అవసరం లేదు. అయినా ఆమె మెసేజ్ చేస్తోంది. తండ్రి తన కూతురి గదిలోకి వెళ్లి మాట్లాడకుండా ఫోన్‌లో "ఎక్కడున్నావు?" అని అడుగుతున్నాడు. భార్యాభర్తలు పక్కపక్కనే కూర్చుని వేరే ప్రపంచాలతో మాట్లాడుతున్నారు. పిల్లలు తల్లిదండ్రుల ముఖాలను చూడకుండా స్క్రీన్‌ను చూస్తున్నారు. ఇది సౌకర్యమా? లేక మౌనంగా పెరుగుతున్న ఒంటరితనమా? మనం ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉత్తరం ఒక సంభాషణ మాత్రమే కాదు. అది ఒక బాధ్యత. ఎవరికైనా ఉత్తరం రాస్తే మనం వారి కోసం సమయం కేటాయించేవాళ్లం. ఇప్పుడు సమయం లేకపోవడం కాదు; మనసు లేకపోవడమే సమస్య. మనిషి సమయం ఎక్కడ పోతుంది? గంటల తరబడి సోషల్ మీడియాలో గడపడానికి సమయం ఉంది. వీడియోలు చూడడానికి సమయం ఉంది. ఇతరుల జీవితాలను గమనించడానికి సమయం ఉంది. కానీ మన తల్లిదండ్రులతో పది నిమిషాలు కూర్చోవడానికి సమయం లేదు. పాత స్నేహితుడికి ఫోన్ చేయడానికి సమయం లేదు. ఒక మంచి ఉత్తరం రాయడానికి సమయం లేదు. "ఎలా ఉన్నావు?" అనే ప్రశ్నను మనస్ఫూర్తిగా అడగడానికి సమయం లేదు.

మనిషి బిజీ కాలేదు... అతని ప్రాధాన్యతలు మారాయి. ఇదే నిజం. మనిషి మమకారం కోల్పోవడం ఒక్కరోజులో జరగలేదు. చిన్న చిన్న అలవాట్లతో అది తగ్గింది. ముందుగా ఇంట్లో కూర్చుని మాట్లాడటం తగ్గింది. తరువాత కలిసి భోజనం చేయడం తగ్గింది. తరువాత పండుగలకు అందరూ ఒకచోట చేరడం తగ్గింది. తరువాత పెద్దల మాట వినడం తగ్గింది. తరువాత పిల్లలతో ఆడటం తగ్గింది. చివరికి ఒకరి బాధ మరొకరికి తెలియని స్థితి వచ్చింది . ప్రతి కాలానికీ తన ప్రత్యేకత ఉంది. సాంకేతికత ఎన్నో దూరాలను తగ్గించింది. విదేశాల్లో ఉన్న తల్లిదండ్రులు పిల్లల ముఖాలను ప్రతి రోజూ చూడగలుగుతున్నారు. దూరంగా ఉన్న కుటుంబాలు వీడియో కాల్ ద్వారా కలుస్తున్నాయి. అత్యవసర సమయంలో సమాచారం క్షణాల్లో చేరుతోంది. అనారోగ్యంలో ఉన్నవారికి సహాయం త్వరగా అందుతోంది. ఇవన్నీ గొప్ప మార్పులే. సమస్య సాంకేతికతలో లేదు. దాన్ని ఉపయోగించే మనిషి మనసులో ఉంది. ఫోన్ మన చేతిలో ఉండాలి. మనం ఫోన్ చేతిలో బందీలం కాకూడదు. మెసేజ్ మన భావాన్ని వ్యక్తం చేయాలి. మన భావాన్ని భర్తీ చేయకూడదు. ఒక వీడియో కాల్ కుటుంబాన్ని దగ్గర చేయగలదు. కానీ ఒకే ఇంట్లో కూర్చున్న మనుషులను దూరం చేయకూడదు. ఒక ఫోటో జ్ఞాపకాన్ని నిలుపుకోవాలి. కానీ జ్ఞాపకంగా మారే జీవితం మన ముందే ఉండాలి. ఉత్తరాల కాలం మనకు ఒక గొప్ప విషయం నేర్పింది — ఎదురు చూడటం. ఎదురు చూపు అనేది ఇప్పుడు మన జీవితంలో తగ్గిపోయిన గొప్ప భావన. ఎవరో ఒకరు మనకు ఉత్తరం రాస్తారని ఎదురు చూడటం. పోస్టుమాన్ ఎప్పుడు వస్తాడో చూడటం. తలుపు దగ్గర అడుగుల శబ్దం వినిపిస్తే గుండె కొట్టుకోవడం. కవర్ తెరిచేటప్పుడు చేతులు వణకడం. ఇవన్నీ ఇప్పుడు దాదాపు మాయమయ్యాయి. ఇప్పుడు సందేశం వచ్చింది లేదా లేదా అని చూసేది నోటిఫికేషన్. ఎదురు చూపు స్థానంలో రిఫ్రెష్ వచ్చింది. ప్రేమ స్థానంలో రియాక్షన్ వచ్చింది. సంభాషణ స్థానంలో స్టేటస్ వచ్చింది. కలుసుకోవడం స్థానంలో వీడియో కాల్ వచ్చింది. జ్ఞాపకం స్థానంలో క్లౌడ్ వచ్చింది. మనిషి ఎంతో భద్రపరుస్తున్నాడు. కానీ తన మనసులో ఏం నిలుపుకుంటున్నాడు? ఈ ప్రశ్నకు సమాధానం అంత సులభం కాదు. ఒక పాత ఇంటి గోడలో చిన్న రంధ్రం ఉంటుంది. ఆ రంధ్రంలో ఒక తుప్పుపట్టిన పెట్టె ఉంటుంది. పెట్టెలో పాత ఉత్తరాలు ఉంటాయి. వాటిని తీసి చదివే వృద్ధుడి కళ్లలో ఒక్కసారిగా వెలుగు కనిపిస్తుంది. అతని చేతులు వణుకుతాయి. ఒక ఉత్తరం తెరిచినప్పుడు అతని వయసు ఇరవై ఏళ్లకు తగ్గిపోతుంది. అక్షరాలు అతనితో మాట్లాడతాయి. "నాన్నా, నేను బాగున్నాను..." "అమ్మా, నన్ను గురించి ఆందోళన పడవద్దు..." "త్వరలో వస్తాను..." "నిన్ను చాలా గుర్తు చేసుకుంటున్నాను..." వంటి సాధారణ మాటలు ఆ వృద్ధుడికి ప్రపంచంలోనే గొప్ప సంపదగా మారతాయి. ఎందుకంటే ఆ మాటల్లో ఇప్పుడు లేని మనుషులు ఉంటారు. కొందరు తిరిగి రారు. కొందరు దూరమైపోతారు. కొందరు మన జ్ఞాపకాలలో మాత్రమే మిగిలిపోతారు. కానీ వారి చేతిరాత మాత్రం ఒక పాత కాగితంపై మిగిలి ఉంటుంది. అందుకే ఉత్తరం ఒక వస్తువు కాదు. అది కాలాన్ని దాటిన మనిషి స్వరం. చివరి ఉత్తరం అనే మాటలో అందుకే అంత బాధ ఉంది. అది నిజంగా చివరి ఉత్తరం అయితే? ఆ తర్వాత ఎప్పటికీ మరో ఉత్తరం రాకపోతే? మనం ఏం చేస్తాం? ఆ కాగితాన్ని గుండెలకు హత్తుకుంటామా? దాన్ని మళ్లీ మళ్లీ చదువుతామా? లేక డిజిటల్ ప్రపంచంలో మరొక నోటిఫికేషన్ మధ్య దాన్ని మరిచిపోతామా? ఒక తల్లి తన దూరమైన కొడుకు నుంచి వచ్చిన చివరి ఉత్తరాన్ని ఏళ్ల తరబడి దాచుకుంటుంది. కొడుకు ఇక లేడు. కానీ అతని అక్షరాలు ఉన్నాయి. ఆ తల్లి ప్రతిరోజూ ఆ ఉత్తరాన్ని చదవదు. కానీ తన పెట్టెను తెరిచినప్పుడల్లా ఆ కాగితం కనిపిస్తుంది. అప్పుడు ఆమెకు కొడుకు కనిపిస్తాడు. అక్షరాలు మాటలుగా మారతాయి. మాటలు స్వరంగా మారతాయి. స్వరం జ్ఞాపకంగా మారుతుంది. జ్ఞాపకం కన్నీటిగా మారుతుంది. కన్నీరు మమకారంగా మారుతుంది. ఇలాంటి బంధాన్ని ఏ డిజిటల్ పరికరం పూర్తిగా భర్తీ చేయగలదు? మనిషి చేతిరాతలో ఒక ప్రత్యేకమైన ఆత్మ ఉంటుంది. ప్రతి మనిషి అక్షరాలు అతని స్వభావాన్ని చెబుతాయి. ఎవరి అక్షరాలు వంగి ఉంటాయి. ఎవరి అక్షరాలు గట్టిగా ఉంటాయి. ఎవరి ల్సిన అవసరం లేకపోయినా, మనస్ఫూర్తిగా మాట్లాడటం నేర్పాలి. తల్లిదండ్రులకు మెసేజ్ చేయడం సరే. కానీ కొన్నిసార్లు వారి పక్కన కూర్చోవాలి. స్నేహితుడికి రియాక్షన్ పెట్టడం సరే. కానీ అతని బాధను అడిగి తెలుసుకోవాలి. పుట్టినరోజుకు పోస్టు చేయడం సరే. కానీ వ్యక్తిగతంగా ఒక మంచి మాట చెప్పాలి. మరణించిన వ్యక్తి ఫోటోకు సంతాపం పెట్టడం సరే. కానీ అతని కుటుంబం దగ్గరకు వెళ్లి భుజం మీద చేయి వేయాలి. ఎందుకంటే మమకారం స్క్రీన్‌పై కనిపించదు. అది మన ప్రవర్తనలో కనిపిస్తుంది. మనిషి తన సంబంధాలను కాపాడుకోవాలంటే పెద్ద పెద్ద పనులు చేయాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న పనులు చాలు. ఉదయం తల్లిని పలకరించడం. తండ్రితో పది నిమిషాలు మాట్లాడటం. పిల్లలతో ఫోన్ పక్కన పెట్టి భోజనం చేయడం. వృద్ధుడి కథ వినడం. పాత స్నేహితుడిని ఒకసారి కలవడం. దూరంగా ఉన్న బంధువును మనస్ఫూర్తిగా పలకరించడం. ఎవరో బాధలో ఉన్నప్పుడు "నేను ఉన్నాను" అని చెప్పడం. ఇవే మమకారం. ఇవే మనిషితనం. ఉత్తరం మనకు ఇదే పాఠం చెప్పింది. మనిషి ఎంత పెద్దవాడైనా ఒక మాట కోసం ఎదురు చూస్తాడు. ఎంత ధనవంతుడైనా ఒక ఆప్యాయత కోసం ఆకలిగా ఉంటాడు. ఎంత విజయవంతుడైనా తన విజయాన్ని పంచుకునే మనిషి కోసం వెతుకుతాడు. చివరికి మనిషికి కావాల్సింది ప్రేక్షకులు కాదు... మనుషులు. ఫాలోవర్లు కాదు... తోడుగా నిలిచే వాళ్లు. లైకులు కాదు... నిజమైన అభిమానం. కామెంట్లు కాదు... హృదయపూర్వకమైన మాట. అందుకే మమకారం మాయమవుతున్న కాలంలో మనం ఒక కొత్త ఉత్తరం రాయాలి. అది కాగితంపై కాకపోయినా మన ప్రవర్తనలో రాయాలి. "అమ్మా, నీతో మాట్లాడటానికి నాకు సమయం ఉంది" అని ఒక వాక్యం రాయాలి. "నాన్నా, నీ కష్టం నాకు తెలుసు" అని ఒక వాక్యం రాయాలి. "స్నేహితుడా, నీకు అవసరం ఉన్నప్పుడు నేను నీతో ఉంటాను" అని ఒక వాక్యం రాయాలి. "బిడ్డా, నీకు ఏం కావాలన్నా ముందు నీ మనసు చెప్పు" అని తల్లిదండ్రులు పిల్లలకు చెప్పాలి. ఈ మాటలు రాసినప్పుడు మాత్రమే మన మధ్య మమకారం తిరిగి వస్తుంది. చివరి ఉత్తరం నిజంగా చివరి ఉత్తరంగా మిగలకూడదు. మనిషి నుంచి మనిషికి వెళ్లే ఆత్మీయతకు అది కొత్త ప్రారంభం కావాలి. మనం ఉత్తరాలను కోల్పోయాం. కానీ ఉత్తరాల మనసును కోల్పోవద్దు. కాగితం మాయమవచ్చు. సిరా ఎండిపోవచ్చు. పోస్టుమాన్ రాకపోవచ్చు. కానీ మనిషి మనసులోని మమకారం ఎండిపోకూడదు. ఎందుకంటే మమకారం లేని ప్రపంచం ఎంత ఆధునికంగా ఉన్నా అది లోపల ఖాళీగా ఉంటుంది. పెద్ద భవనాలు ఉంటాయి. వేగవంతమైన రహదారులు ఉంటాయి. చేతిలో ప్రపంచాన్ని చూపించే పరికరాలు ఉంటాయి. కానీ ఒకరినొకరు పలకరించని మనుషులు ఉంటే ఆ ప్రపంచం ఎంత అందంగా ఉన్నా అసంపూర్ణమే. మనిషి మనిషిని గుర్తుపట్టాలి. అతని బాధను వినాలి. అతని ఆనందాన్ని పంచుకోవాలి. అతని కన్నీటికి భుజం ఇవ్వాలి. అతని విజయానికి చప్పట్లు కొట్టాలి. అతని వైఫల్యంలో పక్కన నిలబడాలి. అప్పుడు మాత్రమే మనిషి అనే పదానికి అర్థం ఉంటుంది. ఒక రోజు మన పిల్లలు మనల్ని అడగవచ్చు — "నాన్నా, మీ కాలంలో నిజంగా ఉత్తరాలు రాసేవారా?" అని. మనం నవ్వుతూ "అవును" అని చెప్పవచ్చు. కానీ వెంటనే మరో ప్రశ్న అడగాలి — "మేము ఉత్తరాలు రాసే కాలంలో మనుషులు ఒకరినొకరు ఎక్కువగా గుర్తు చేసుకునేవారు. మీ కాలంలో మీరు ఒకరినొకరు నిజంగా గుర్తు చేసుకుంటున్నారా?" అని. ఆ ప్రశ్నకు మనం సమాధానం చెప్పాల్సిన అవసరం రాకుండా ఉండాలి. అందుకే ఇప్పుడే మనసు తెరవాలి. ఇప్పుడే మనుషులను పలకరించాలి. ఇప్పుడే కుటుంబంతో కూర్చోవాలి. ఇప్పుడే తల్లిదండ్రుల చేతిని పట్టుకోవాలి. ఇప్పుడే పిల్లల కళ్లలోకి చూసి మాట్లాడాలి. ఇప్పుడే పాత స్నేహితుడిని గుర్తు చేసుకోవాలి. ఇప్పుడే ఎవరో ఒకరికి ఒక మంచి మాట చెప్పాలి. ఎందుకంటే మనిషి జీవితం చిన్నది. కానీ మనం ఇచ్చిన మమకారం చాలా కాలం బతుకుతుంది. ఒక ఉత్తరం కాగితం మీద మిగిలినట్లు, మనం చేసిన ఒక మంచి పని ఎవరో ఒకరి హృదయంలో మిగిలిపోతుంది. మనం పలికిన ఒక మంచి మాట ఎవరో ఒకరి జీవితంలో వెలుగవుతుంది. మనం అందించిన ఒక చిన్న సహాయం ఎవరో ఒకరి కన్నీటిని ఆపవచ్చు. మనం ఇచ్చిన ఒక ఆప్యాయత ఎవరో ఒకరి ఒంటరితనాన్ని తొలగించవచ్చు. ఇదే మనిషి నిజమైన వారసత్వం. డబ్బు మిగలకపోవచ్చు. ఇళ్లు మారిపోవచ్చు. ఫోటోలు పాతబడిపోవచ్చు. ఫోన్‌లు పాడైపోవచ్చు. కానీ మనసులో నిలిచిన మమకారం మాత్రం కాలం దాటుతుంది. అందుకే చివరి ఉత్తరం ఒక ముగింపు కాదు. అది మనిషి తన మనసుకు రాసుకోవాల్సిన మొదటి ఉత్తరం. "నేను బతుకుతున్నాను... కానీ ఇతరుల కోసం కూడా బతకాలి" అని రాసుకోవాల్సిన ఉత్తరం. "నాకు ప్రపంచం కావాలి... కానీ ప్రపంచంలో మనుషులు కూడా కావాలి" అని రాసుకోవాల్సిన ఉత్తరం. "సాంకేతికత నాకు అవసరం... కానీ మమకారం నాకు ఇంకా ఎక్కువ అవసరం" అని రాసుకోవాల్సిన ఉత్తరం. "నా విజయానికి సాక్షులు చాలామంది ఉండొచ్చు... కానీ నా కన్నీటికి తోడుగా ఉండే ఒక మనిషి నాకు కావాలి" అని రాసుకోవాల్సిన ఉత్తరం. చివరికి మనిషి మనిషికి రాసే ఉత్తరమే అతని నిజమైన చరిత్ర. మనం ఎంత సంపాదించామన్నది చరిత్రలో ఒక సంఖ్య కావచ్చు. కానీ ఎంతమందికి మనసు ఇచ్చామన్నదే మనిషి కథ. ఎంత పెద్ద స్థాయికి ఎదిగామన్నది ఒక గుర్తింపు కావచ్చు. కానీ ఎంతమందిని మనతో పాటు పైకి తీసుకెళ్లామన్నదే మనిషితనం. ఎంత దూరం ప్రయాణించామన్నది ఒక విజయగాథ కావచ్చు. కానీ తిరిగి వచ్చి మన వాళ్లను ఎంత ప్రేమించామన్నదే అసలు జీవితం. అందుకే మమకారం మాయమవుతున్న ఈ కాలంలో మనం ఒకరికొకరం ఉత్తరాలుగా మారాలి. ఒకరి జీవితంలో మరొకరు ఒక మంచి వాక్యంగా నిలవాలి. ఒకరి కన్నీటిలో మరొకరు ఓదార్పుగా ఉండాలి. ఒకరి ఆనందంలో మరొకరు పండుగగా మారాలి. అప్పుడు కాగితం మీద ఉత్తరాలు లేకపోయినా మనుషుల మధ్య మమకారం ఉంటుంది. పోస్టుమాన్ సైకిల్ గంట వినిపించకపోయినా మనసు తలుపు తట్టే శబ్దం ఉంటుంది. పాత కవర్లు లేకపోయినా జ్ఞాపకాలు ఉంటాయి. సిరా లేకపోయినా ప్రేమ ఉంటుంది. చివరి ఉత్తరం ముగిసిన చోట... మనిషి మనిషికి రాసే కొత్త మమకార గాథ మొదలవుతుంది.



ఎం రవీందర్
7901503777

## తోడొకరుండిన అదే భాగ్యము

మనసున మనసై...
బతుకున బతుకై...
తోడొకరుండిన అదే
భాగ్యము అదే స్వర్గము "...
ఇది మహాకవి శ్రీశ్రీ వచనం.

తోడు లేని వృద్ధాప్యం నరకమే
ఇది శాపం!
తోడు లేకపోతే.......!!
రాత్రి వెన్నెల కురిసినా....
పొద్దు పొడిచిన చీకటే..
మాట్లాడేందుకు మనిషి లేక
గోడలతో గోడు చెప్పుకోవాలి
కన్నీరు తుడిచే చేయి లేక...
పైటకొంగు తోనే తుడుచుకోవాలి!
మందు బిళ్ళ అందించే మనిషి లేక.....
వణికే చేతులతో తడబడాలి!
వేధించే వ్యాధిని భరించాలి

ఇది నరకం కాక మరి ఏమిటి ?
నవ్వలేక నడవలేక
పోవడమే నరకమంటే..
సొంత బిడ్డలు చెంత ఉంటే
అదే స్వర్గం

మహాకవి తోడొకరుండిన అదే
భాగ్యం అని ఎందుకన్నాడు ?
గుండె కోతతో రాసిన కవిత్వం అది

పెళ్ళాం మొగుడు పోయాక
ఒంటరి అయ్యాను ఇది శాపం
కానీ బతికుండి... బిడ్డలు వదిలేసి.....
భార్య భర్త తిట్టుకుంటూ.....
నరకం చూపిస్తే.....
అంతకంటే ఒంటరిగా చావడం నయం!

ఇదే మహాకవి వేదన!!
తోడు ఉండి వేధిస్తే....
ఆ తోడు కంటే తోడు
లేకపోవడమే భాగ్యం!
ప్రేమ లేని బంధం కంటే....
బంధం లేని ఒంటరితనం నయం!

అసలు ధర్మం ఏమిటి ?
చెట్టు ముసలిదైతే......
పక్షులు వదిలేస్తాయా ?
ఇంకా ఎక్కువ వాలి కబుర్లు చెప్తాయి!
నది ఎండిపోతే...చేపలు దూషిస్తాయా ?
చివరి నీటి బొట్టు వరకు తోడుంటాయి!

మరి కొందరు మనుషులు
అమ్మానాన్న వృద్ధులవుతే
తిట్టుకుంటూ..




ఎందుకు వదిలేస్తారు...?
ఎందుకంటే.......మనిషి
పంచభూతాల ధర్మం మరిచాడు.
పంచభూతాలు తమ ధర్మం మరిస్తే
మనిషి బ్రతకడం కష్టం

తోడు లేని వృద్ధాప్యం నరకం..
ఇది నిజం!
తోడు ఉండి నరకం చూపితే...
అది అంతకంటే పెద్ద నరకం!
*అసలు భాగ్యం ఏమిటంటే....*
చివరి శ్వాస వరకు
చేయిపట్టుకుని
"నేనున్నా అనే తోడు!
అది భార్య కావచ్చు.....
భర్త కావచ్చు..... కొడుకుకావచ్చు....
కూతురు కావచ్చు.....
ఒక మంచి మిత్రుడు కావచ్చు!
"తోడు" అనే మాటకు
అర్థం చెప్పే సమాజం కోసం!
"తోడు ఉండాలి.....
చివరి వరకు ఉండాలి...
ప్రేమతో ఉండాలి....
భారం కాదు కూడదు....
భాగ్యంగా ఉండాలి
స్వర్గంగా ఉండాలి..
తోడు ఉన్న ప్రతి వృద్ధుడికకీ
తోడు కోసం ఎదురుచూసే
ప్రతి గుండెకీ.....
*ఈ కవిత అంకితం*

కావ్యసుధ
9247313488



# జాతీయం-అంతర్జాతీయం



## కులగణనకు గండికొడుతున్న మోడీ సర్కార్

- 2011 అనుభవం నుంచి పాఠాలు నేర్వని కేంద్రం
- సామాజికవేత్తలు, నిపుణుల ఆందోళనలు
- కులం విషయంలో 'ఓపెన్ కాలం'
- ఓబీసీలకు ప్రత్యేక స్థానం కరువు
- గోప్యతపై ఆందోళనలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ఎ.ఎం.ఎస్):**

దేశ జనాభా, సామాజికఆర్థిక పరిస్థితులను శాస్త్రీయంగా లెక్కించాల్సిన జనగణనపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిర్ణయాలు కొత్త అనుమానాలకు తావిస్తున్నాయి. 2027 జనగణనలో కులగణనకు తొలిసారి అవకాశం కల్పిస్తున్నామని కేంద్రం చెప్తున్నప్పటికీ.. కులాన్ని ఓపెన్ కాలంలో నమోదు చేయడం, ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీ లేకపోవడం వంటి అంశాలు ఇప్పుడు చర్చకు దారి తీస్తున్నాయి. ఇవి కులగణనను ఉద్దేశపూర్వకంగానే గందరగోళంలోకి నెట్టే ప్రయత్నమా అన్న ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. మరోవైపు ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, మొబైల్, బ్యాంకు ఖాతాల వంటి వ్యక్తిగత వివరాలను సేకరించడంపై 'జనగణన పేరుతో నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్) తరహా సమాచార సేకరణ జరుగుతోందా?' అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో 1931 తర్వాత తొలిసారిగా కులాల వారీగా జనాభాను లెక్కించనున్నామని కేంద్రం ప్రకటించిం ది. సామాజిక న్యాయం, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలకు అవసరమైన వాస్తవ గణాంకాలు అందుతాయని ఆశించిన వేళ.. జనగణన కోసం రూపొందించిన ప్రశ్నావళి ఇప్పుడు వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. మొత్తం 40 ప్రశ్నలతో రూపొందించనున్న ఫారంలో తల్లిదండ్రుల వివరాలు, డిజిటల్ అక్షరాస్యత, కోవిడ్ టీకా తీసుకున్న ప్రదేశం, బ్యాంకు ఖాతాల సంఖ్య, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, మొబైల్, ఆధార్, ఓటర్ ఐడీ వంటి వ్యక్తిగత వివరాలను అడగడం తీవ్ర చర్చకు దారితీసింది. అలాగే కులం విషయంలో శాస్త్రీయంగా వర్గీకరించే విధానం లేకుండా ఓపెన్ ఎంట్రీకి అవకాశం ఇవ్వడం, ఓబీసీలను ప్రత్యేక కేటగిరీగా చేర్చకపోవడం కేంద్ర ప్రభుత్వ చర్యలపై అనుమానాలు, అనేక ప్రశ్నలకు అవకాశమిస్తున్నాయి. జనగణన ప్రధాన ఉద్దేశం దేశ జనాభా, కుటుంబాల సామాజికఆర్థిక పరిస్థితులను లెక్కించడం. విధానాల రూపకల్పనకు అవసరమైన గణాంకాలను అందించడం. అయితే వ్యక్తిని నేరుగా గుర్తించగల ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, మొబైల్ వంటి వివరాలు సేకరించడం సాధారణ జనగణన లక్ష్యాలకు ఎంతవర కు అవసరమన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ వివరాలు జనగణన కంటే నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్)ను నవీకరించడానికి ఉపయోగపడే అవకాశం ఉందన్న అనుమానాన్ని మాజీ డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ కె.నారాయణన్ ఉన్ని వ్యక్తం చేశారు.



జనగణన ప్రధానంగా గణాంకాల సేకరణ, విశ్లేషణ కోసం జరుగుతుంది. ఎన్‌పీఆర్ మాత్రం దేశంలో సాధారణంగా నివసించే పౌరుల సమగ్ర వివరాలకు సంబంధించినది. 2010లో తొలిసారిగా ఎన్‌పీఆర్ రూపొందించగా.. 2015లో దానిని నవీకరించారు. 2019లో కేంద్ర మంత్రివర్గం ఎన్‌పీఆర్‌ను నవీకరించేందుకు రూ.3,941 కోట్లను కేటాయించింది. అయితే కరోనా మహమ్మారి కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇప్పుడు జనగణన ప్రశ్నావళిలోనూ వ్యక్తిగత గుర్తింపు వివరాలను సేకరించే ప్రయత్నం కనిపిస్తుండటంతో.. జనగణను ఎన్‌పీఆర్ తరహా సమాచార సేకరణకు ఉపయోగిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు, మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతాలు వంటి వివరాలు ఒకే కుటుంబ రికార్డులో కులం, మతం, భాష, వలస చరిత్ర వంటి సమాచారంతో అనుసంధానమైతే.. వ్యక్తిగత సమాచారాన్ని వివిధ డేటాబేస్‌లతో అనుసంధానం చేసే అవకాశం ఏర్పడుతుందని ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఆధార్ వివరాలు యూఐడీఏఐ డేటాబేస్‌తో, ఓటరల్ ఐడీ ఎన్నికల జాబితాలతో, పాస్‌పోర్టు వివరాలు పాస్‌పోర్టు రికార్డులతో, మొబైల్ వివరాలు టెలికాం రికార్డులతో, బ్యాంకు వివరాలు ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమయ్యే అవకాశం ఉందని ఐఎఫ్ఎఫ్ పేర్కొంది. అన్నింటికంటే పెద్ద ప్రశ్న కులగణన విషయంలోనే అని చెప్పొచ్చు. కులగణన కోసం దశాబ్దాలుగా డిమాండ్ ఉన్నప్పటికీ... 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలోనే బీజేపీ కులగణన డిమాండ్‌పై తీవ్ర విమర్శలు చేసింది. ఇది సమాజాన్ని విభజిస్తుందని వాదించింది. ప్రధాని మోడీ కూడా ప్రతిపక్షాల కులగణన డిమాండ్‌ను విమర్శించారు. అయితే గతేడాది ఏప్రిల్ 30న కేంద్ర మంత్రివర్గం తదుపరి జనగణనలో కులగణన చేపట్టాలని ప్రకటించింది. దీంతో కేంద్రం వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపించింది. కానీ.. ఆచరణలో ప్రశ్నావళి మాత్రం కొత్త సందేహాలను రేకెత్తిస్తోంది. ప్రశ్నావళిలో ఎస్సీ, ఎస్టీ, కులం అనే అంశాన్ని చేర్చారు. అయితే ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీ ఇవ్వలేదు. ఇదే ఇప్పుడు కీలకంగా మారింది. దేశంలో సామాజిక న్యాయం, రిజర్వేషన్లు, విద్యాఉద్యోగ అవకాశాలు, స్థానిక సంస్థల రిజర్వేషన్లకు ఓబీసీ జనాభా గణాంకాలు అత్యంత కీలకం. అలాంటి వర్గానికి ప్రత్యేకంగా ఎందుకు స్థానం కల్పించలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కులం వివరాలను నమోదు చేసేందుకు ముందుగా గుర్తించిన కులాల జాబితా ఆధారంగా డ్రాప్‌డౌన్ విధానం కాకుండా.. వ్యక్తి చెప్పిన కులాన్ని ఓపెన్‌గా నమోదు చేసే విధానం తీసుకొచ్చారు. ఇదే నిర్ణయంపై సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్‌పాండే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే కులానికి భిన్నమైన స్థానిక పేర్లు, ఉపకులాల పేర్లు నమోదైతే లక్షలాది వేర్వేరు ఎంట్రీలు ఏర్పడి, తుది గణాంకాలు విశ్లేషించడానికి పనికిరాని స్థితి రావచ్చని ఆయన హెచ్చరించారు. 2011లో నిర్వహించిన సామాజికఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ)లో కుల వివరాలను సేకరించగా.. దాదాపు 46 లక్షల కులాలు, ఉపకులాలు, కులపేర్లు, ఇంటిపేర్లు, వంశంపేర్లు వంటివి నమోదయ్యాయి. తర్వాత కేంద్రం ఈ డేటాలో సాంకేతిక లోపాలున్నాయనీ, దాంతో దానిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేకపోతున్నామని సుప్రీంకోర్టుకు తెలిపింది. గత అనుభవం ప్రత్యక్షంగా కనబడుతున్నప్పటికీ.. కేంద్రం దాని నుంచి పాఠాలు నేర్వలేదని విశ్లేషకులు చెప్తున్నారు. కులగణనకు సంబంధించిన ప్రస్తుత ప్రశ్నావళిని మార్చాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోడీకి లేఖ రాశారు. ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు.

2027 జనాభా లెక్కల కోసం మొత్తం 40 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని కేంద్ర హోంశాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆగస్టు 14న ప్రకటించారు. 2011 జనగణనలో ఉన్న 29 ప్రశ్నలకు అదనంగా మరో 11 ప్రశ్నలను చేర్చారు. కొత్త ప్రశ్నల్లో తల్లి, తండ్రి వివరాలు, శాశ్వత నివాస చిరునామా, డిజిటల్ అక్షరాస్యత, కోవిడ్ టీకా తీసుకున్న ప్రదేశం, బ్యాంకు ఖాతాల సంఖ్య, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు వంటివి ఉన్నాయి. అందుబాటులో ఉంటే ఆధార్, మొబైల్, పాస్‌పోర్టు, ఓటర్ ఐడీ నంబర్లను కూడా నమోదు చేయాల్సి ఉంటుంది.

## చివరకు ఏం మిగిలింది?

- పీడకలగా ట్రంప్ 'విహార యాత్ర'
- మధ్యప్రాచ్యం ఆవలకు విస్తరించిన పోరు
- దక్షిణ కొరియాతో సంబంధాలకు విఘాతం
- మిత్రదేశాల్లో కలవరం
- ఆరు నెలల యుద్ధంలో ఏ ఒక్క లక్ష్యాన్నీ చేరుకోని అమెరికా




**వాషింగ్టన్, ఆగస్టు 30 :**

ఇరాన్‌పై ఫిబ్రవరి చివరలో యుద్ధాన్ని ప్రారంభించినప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దానిని ఓ 'విహార యాత్ర'గా అభివర్ణించి, కొన్ని వారాల్లోనే ముగిసిపోతుందని చెప్పారు. కానీ ఆరు నెలలు గడిచిన తర్వాత ఇప్పుడు ఆ పోరు ఓ పీడకలగా మారింది. ఇరాన్‌లో, మధ్యప్రాచ్యంలో నివసిస్తున్న లక్షలాది మందికే కాదు... ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది వినియోగదారులకు విపత్తుగా పరిణమించింది. అయినప్పటికీ ట్రంప్ యుద్ధ లక్ష్యాలేవీ నెరవేరలేదు. ఇరాన్ పూర్తిగా లొంగిపోవాలని, అక్కడి ప్రభుత్వాన్ని మార్చాలని, అణు లక్ష్యాలను టెహ్రాన్ వదులుకోవాలని తొలుత డిమాండ్ చేసిన ట్రంప్... ఇప్పుడు హార్మూజ్ జలసంధిని తెరవాలని, ఇరాన్ అణు కార్యక్రమానికి బ్రేకులు వేయాలని అంటున్నారు. అమెరికా ప్రతిష్టను దిగజారుస్తోంది. దాని ప్రత్యర్థులు తమ ప్రభావాన్ని విస్తరించుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. తనకు తానుగా సృష్టించుకున్న సంక్షోభం నుంచి బయటపడడానికి ట్రంప్ ప్రభుత్వం చేయని ప్రయత్నమంటూ లేదు. యుద్ధం అత్యంత కీలకమైన భౌగోళిక, రాజకీయ, భద్రతా ప్రభావాలు మధ్యప్రాచ్యానికి ఆవల కూడా కన్పిస్తున్నాయి. దక్షిణ కొరియాతో వార్షిక సైనిక విన్యాసాలను అమెరికా కుదించుకుంది. పశ్చిమ పసిఫిక్‌లో ఉన్న ఏకైక యుద్ధ విమాన వాహక నౌకను వెనక్కి రప్పించింది. రష్యా ప్రయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొనే వ్యవస్థల తయారీకి సంబంధించిన లైసెన్సును ఉక్రెయిన్‌కు ఇవ్వడం లేదు. రష్యా నుంచి దూసుకొస్తున్న బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునే వ్యవస్థలు ఉక్రెయిన్ వద్ద దాదాపుగా నిండుకున్నాయి. హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ప్రపంచ చమురు సంక్షోభం తలెత్తింది. రష్యాపై ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక ఒత్తిడి ప్రభావం బలహీనపడింది. అమెరికాలో పెట్రోల్ ధరలు పెరగడంతో రష్యా చమురు ఎగుమతులపై విధించిన కొన్ని ఆంక్షలను ట్రంప్ ఎత్తివేశారు. దీంతో ఉక్రెయిన్‌పై యుద్ధానికి నిధులు సమకూర్చుకోవడానికి రష్యాకు అమెరికా పరోక్షంగా సాయపడినట్లు అయింది. అంతేకాదు... చమురు, గ్యాస్, ఎరువుల వ్యాపారానికి ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన అడ్డంకుల కారణంగా రష్యా కొత్తగా వినియోగదారులను సంపాదించగలిగింది.

దక్షిణ కొరియాతో అమెరికాకు చాలా కాలంగా సైనిక సంబంధాలు ఉన్నాయి. దక్షిణ కొరియాలో 28,500 మంది సైనికులు తిష్ట వేసి ఉన్నారు. అయితే ఇరాన్‌పై తాను చేస్తున్న యుద్ధానికి సహకరించడానికి దక్షిణ కొరియా అంగీకరించకపోవడంతో ట్రంప్ ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సంయుక్త సైనిక విన్యాసాలను కుదించుకోవాలని ఆయన రక్షణ శాఖను ఆదేశించారు. దీంతో ద్వైపాక్షిక సంబంధాలకు విఘాతం ఏర్పడింది. ఉత్తర కొరియాతో చర్చలకు సిద్ధమేనని ట్రంప్ సంకేతాలు కూడా ఇచ్చారు. ట్రంప్ నిర్ణయానికి ప్రతిగా...సెప్టెంబరులో జరగాల్సిన యాంఫిబియస్ ల్యాండింగ్ విన్యాసాలను దక్షిణ కొరియా రద్దు చేసుకుంది.

యూఎస్ఎస్ అబ్రహం లింకన్ స్థానంలో యూఎస్ఎస్ జార్జ్ వాషింగ్టన్‌ను అరేబియా సముద్రానికి పంపడంతో ఇప్పుడు పసిఫిక్‌లో అవసరానికి అమెరికాకు ఒక్క యుద్ధ విమాన వాహక నౌక కూడా లేకుండా పోయింది. దీంతో మిత్రదేశాలలో ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా దక్షిణ చైనా సముద్రంలో జీజింగ్ నియంత్రణలో ఉన్న స్కార్‌బరో షోల్ వంటి ప్రాంతాల చుట్టూ చైనా కార్యకలాపాలు పెరుగుతుండడం ఫిలిప్పీన్స్‌ను కలవరపెడుతోంది. ఈ నెల 8న దక్షిణ చైనా సముద్రంలో కన్పించిన యూఎస్ఎస్ జార్జ్ వాషింగ్టన్ ఆ తర్వాత అక్కడి నుంచి నిష్క్రమించింది. ఒకవేళ చైనాతో ఘర్షణలు జరిగితే తమకు ఆయుధ కొరత తప్పదని ఫిలిప్పీన్స్ చెబుతోంది. ఏదేమైనా అమెరికా ఎంత కాలం పోరాడుతుందన్న విషయంపై యుద్ధ తీవ్రత ఆధారపడి ఉంటుంది.



## ప్రధాని మోడీకి ఉజ్బెకిస్తాన్ అత్యున్నత పురస్కారం

- ఆ దేశ అధ్యక్షుడి చేతుల మీదుగా అందజేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ఎ.ఎం.ఎస్) :**

ప్రధాన మంత్రి మోడీ ఆదివారం ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయేవ్ చేతుల మీదుగా ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఒలి దరాజలి దుస్ట్లిక్' ను స్వీకరించారు. ఈ గౌరవం పట్ల తన కృతజ్ఞతలు తెలిపిన మోడీ, గ్లోబల్ సౌత్, మానవాళి శ్రేయస్సు కోసం భారత్, ఉజ్బెకిస్తాన్ కలిసి పనిచేస్తాయని పేర్కొన్నారు. అంతకు ముందు ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై ప్రధాని మోడీ, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్‌లు ఉజ్బెకిస్థాన్‌లోని 'కుక్సరోయ్ ప్రెసిడెన్షియల్ ప్యాలెస్' వేదికగా కీలక చర్చలు నిర్వహించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ ధోబాల్, విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్, విదేశాంగ మంత్రిత శాఖ కార్యదర్శి (వెస్ట్) సి [illegible] ర్జ్, ఇంకా ఇరు దేశాలకు చెందిన పలువురు సీనియర్ దౌత్యవేత్తలు పాల్గొన్నారు. ఈ చర్చల్లో ఇరు దేశాల నేతలు ప్రధానంగా వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, సాంస్కృతిక సంబంధాలపై ఆయా రంగాల పురోగతిని సమీక్షించారు. భవిష్యత్తులో ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణను ఖరారు చేశారు.

## నేపాల్ వరదల్లో 788 మృతదేహాలు వెలికితీత

- చిత్వాన్‌లో అత్యధిక మరణాలు నమోదు
- వెల్లడించిన పోలీసు అధికారులు
- కొనసాగుతున్న సహాయక చర్యలు

**ఖాట్మండు, ఆగస్టు 30 :**



భారీ ఆకస్మిక వరదల అనంతరం 788 మృతదేహాలు వెలికితీసినట్లు ఆదివారం నేపాల్ పోలీసులు ప్రకటించారు. తాజా గణాంకాల ప్రకారం.. అత్యధిక మరణాలు చిత్వాన్‌లో (264) నమోదయ్యాయి. ఆ తర్వాతి స్థానాల్లో నవల్‌పరాసి తూర్పు (194), నవల్‌పరాసి పశ్చిమ (120), గోర్ఖా (58), నువాకోట్ (52), ధాడింగ్ (50), తనహున్ (37), రసువా (13) ఉన్నాయి. అంతకుముందు, వివిధ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, మధ్యాహ్నం 1 గంట సమయానికి 2,502 మంది ఆచూకీ తెలియకుండా పోయారని నేపాల్‌లోని 'నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ & మేనేజ్‌మెంట్ అథారిటీ' ప్రకటించింది. సరైన వివరాలు తెలియని మృతదేహాలను ఆ దేశవ్యాప్తంగా ఉన్న 21 ఆసుపత్రులలో భద్రపరిచారు. గల్లంతైన వారిలో 933 మంది ప్రాంతీయ జలవిద్యుత్ ప్రాజెక్టుల కార్మికులు, 592 మంది విదేశీయులు, విదేశీ బృందాలతో ప్రయాణిస్తున్న 127 మంది నేపాలీ పౌరులు ఉన్నారని అథారిటీ తెలిపింది. ముప్పు ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.



## ఆర్.ఎస్.ఎస్. కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నిరసన

- మనుస్మృతి ప్రతుల దహనం

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ఎ.ఎం.ఎస్):**

న్యూఢిల్లీలోని ఝండేవలన్‌లో ఉన్న ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఎదుట ఇండియన్ యూత్ కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం నిరసన చేపట్టారు. నిరసన ప్రదర్శనలో భాగంగా మనుస్మృతి ప్రతిని దహనం చేశారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యక్రమం తర్వాత వేదికను 'శుద్ధి' చేయడం అనేది కేవలం ఒక వ్యక్తికి మాత్రమే కాదు, దేశంలోని కోట్లాది మంది దళితులకు, రాజ్యాంగ ఆత్మకే జరిగిన అవమానం అని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ మాట్లాడారు.. ఆర్ఎస్ఎస్‌బీజేపీల భావజాలం 'మనుస్మృతి' ఆధారితమైనదని, అది "దళిత వ్యతిరేకమైనది" అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యక్రమం తర్వాత వేదికను 'శుద్ధి' చేయడం అనేది కేవలం ఒక వ్యక్తికి మాత్రమే కాదు, బీజేపీఆర్ఎస్ఎస్‌లకు "కులతత్వ ధోరణి" ఉందని, ఆర్ఎస్ఎస్‌బీజేపీ భావజాలం దళిత వ్యతిరేకమైన మనుస్మృతి అని, దేశంలో రెండు భావజాలాల మధ్య పోరాటం జరుగుతోంది, ఒకటి రాజ్యాంగం, మరొకటి బీజేపీఆర్ఎస్ఎస్ భావజాలం. "ఈ కులతత్వ ధోరణికి వ్యతిరేకంగా మేము పోరాటం కొనసాగిస్తాము, ఎందుకంటే ఈ దేశం మనుస్మృతి ద్వారా కాదు, రాజ్యాంగం ద్వారా పాలించబడుతుంది," అని ఆయన తెలియజేశారు.

## నేపాల్‌కు మళ్లీ పొంచి ఉన్న ముప్పు



- ఏ క్షణంలోనైనా సరస్సులు కట్టలు తెంచుకోవచ్చు
- చైనా అధికారుల ఆందోళన
- హెచ్చరికలు జారీ

**బీజింగ్, ఆగస్టు 30:**

హిమానీనదం బద్దలై ఇప్పటికే తీవ్ర స్థాయిలో నష్టపోయిన నేపాల్ దేశానికి మరో కొత్త ముప్పు ఎదురవుతోంది. ఆ వినాశకర విపత్తు కారణంగా పెద్ద ఎత్తున కొట్టుకు వచ్చిన పెద్ద పెద్ద రాళ్లు, దట్టమైన బురద, మంచు, ఇతర శిథిలాలు ఒకచోట పేరుకు పోయి టిబెట్ వైపున ఒక తాత్కాలిక సరస్సుగా ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఆ సరస్సు ప్రమాదకర స్థాయిలో పొంగుతుండటంతో.. నేపాల్ సరిహద్దు ప్రాంతాలకు మళ్లీ విలయం పొంచి ఉందంటూ చైనా మరోసారి అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ఏ క్షణంలోనైనా ఈ సరస్సు కట్టలు తెంచుకుని, తీవ్ర నీటి ప్రవాహంతో కిందికి దూసుకురావచ్చని చైనా అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. సరస్సు ఉప్పొంగే ప్రమాదం ఉందని చెప్పడానికి బలమైన శాస్త్రీయ కారణాలను చైనా ఎత్తిచూపింది. ఈ విపత్తు తర్వాత ఏర్పడిన ఆ కృత్రిమ సరస్సులోని నీటి రంగు వేగంగా మారుతుండటాన్ని చైనా నిపుణులు గుర్తించారు. సాధారణ రంగులో ఉండే నీరు ఇప్పుడు క్రమంగా ముదురు రంగులోకి మారుతోందని చైనా అధికారులు స్పష్టం చేశారు. నీటి రంగు ముదురు రంగులోకి మారడం అంటే నీటి అడుగున లేదా గట్టు భాగాల్లో ఒత్తిడి పెరిగుతోందని అర్థమని.. అదే జరిగితే సరస్సు ఏ క్షణంలోనైనా బద్దలయ్యేందుకు బలమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ ప్రమాదకరమైన పరిస్థితి తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న చైనా ప్రభుత్వం.. తక్షణమే నేపాల్ విదేశాంగ శాఖకు ఈ సమాచారాన్ని చేరవేసింది. ఎగువ ప్రాంతంలో చోటుచేసుకుంటున్న మార్పులు, నీటి మట్ట పెరుగుదల, రంగు ఆధారంగా విశ్లేషించిన వివరాలను నేపాల్ అధికారులతో చైనా పంచుకుంది. సరస్సు గట్టు తెగితే దిగువన ఉన్న నేపాల్ గ్రామాలు, మానవ నివాసాలు తీవ్ర ప్రభావితం అయ్యే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

ఇప్పటికే హిమానీనదం పగలడంతో వచ్చిన వరదల దెబ్బకు కోలుకోలేని స్థితిలో ఉన్న నేపాల్ ప్రజలకు చైనా నుంచి వచ్చిన ఈ హెచ్చరికలు మరిన్ని గుబులు రేపుతున్నాయి. కొండచరియలు, మంచు శిథిలాల అడ్డుకట్టతో ఏర్పాటైన సరస్సు కావడం వల్ల నీటి ఒత్తిడిని ఎంతవరకు తట్టుకుంటుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. చైనా అందించిన ఈ సమాచారంతో నేపాల్ ప్రభుత్వం సరిహద్దు, దిగువ ప్రాంతాల్లోని యంత్రాంగాన్ని అప్రమత్తం చేసే పనిలో పడింది. అయినప్పటికీ.. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని అంతా భయపడిపోతున్నారు.

## రాజస్థాన్‌లో విద్యుత్ అంతరాయం




- నీట్-పీజీ రద్దు
- ఎగ్జామినేషన్ బోర్డు వెల్లడి

**జైపూర్, ఆగస్టు 30 (ఎ.ఎం.ఎస్) :**

రాజస్థాన్ జైపూర్ లో నీట్ పీజీ రద్దు అయింది. ఈ మేరకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ వర్గాలు తెలిపాయి. జైపూర్‌లో ఐఓఎన్ డిజిటల్ జోన్ సితాపుర2 పరీక్షా కేంద్రంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో ఆ కేంద్రానికి కేటాయించబడిన అభ్యర్థులందరికీ వచ్చే నెల సెప్టెంబర్ 5న పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. సదురు కేంద్రంలో దాదాపు 300 మంది అభ్యర్థులకు రీ ఎగ్జామ్ కు హాజరు కావాల్సి ఉంది.

ఆదివారం దేశవ్యాప్తంగా నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (అండర్ గ్రాడ్యుయేట్) (నీట్) పీజీ 2026 పరీక్ష ప్రారంభమైంది. ఈ పరీక్షను ఎన్‌బిఇఎంఎస్ కంప్యూటర్ ఆధారిత విధానంలో ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఒకే షిఫ్ట్‌లో నిర్వహించారు. పలు నగరాల్లోని ఆయా పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు తరలివచ్చారు. దాదాపు 2.73 లక్షలకు పైగా వైద్య విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు.

## బురదలోనే మూడు రోజులు

- ఆరేండ్ల బాలికను కాపాడిన రెస్క్యూ సిబ్బంది

**ఖాట్మండు, ఆగస్టు 30 :**

నేపాల్‌లో సంభవించిన ఘోర వరదల్లో ఒక అద్భుతం చోటుచేసుకుంది. హిమాలయ దేశాన్ని అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదల కారణంగా 650 మందికి పైగా మరణించిన విషయం తెలిసిందే. ఈ విపత్తు జరిగిన మూడు రోజుల తర్వాత, రసూవా జిల్లాలో మట్టి, శిథిలాల కింద చిక్కుకున్న ఆరేళ్ల బాలికను రెస్క్యూ సిబ్బంది ప్రాణాలతో కాపాడారు.రసూవా జిల్లాలోని టిమురే ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. భోటే కోశి నదికి వచ్చిన వరదల వల్ల గల్లంతైన వారి కోసం ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ బృందం శుక్రవారం గాలిస్తుండగా, శిథిలాల కింద నుంచి చిన్నారి ఏడుపులు వినిపించాయి. వెంటనే అప్రమత్తమైన బృందాలు, బాలికను సురక్షితంగా



## బాలుడి సమయ స్ఫూర్తి



- సురక్షితంగా కాపాడిన పైలెట్

**ఖాట్మండు, ఆగస్టు 30 :**

నేపాల్ దేశంలో ఆకస్మిక వరదలు పెను విధ్వంసాన్ని సృష్టించిన విషయం తెలిసిందే. భోటేకోసి, త్రిశూలి నదులకు పోటెత్తిన భారీ వరదలు..నదీ పరివాహక ప్రాంతాల్లో అల్లకల్లోలం చేశాయి. వరదల ధాటికి అనేక భవంతులు, రోడ్లు, వంతెనలు, మౌలిక సదుపాయాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బురదతో కూడిన వరద నీరు గ్రామాలను నిండాముంచింది. ప్రజల సాధారణ జీవనం స్తంభించిపోయింది. వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత ముప్పు ప్రభావిత ప్రాంతాల్లో ఆ దేశ ఆర్మీ బలగాలు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈక్రమంలో ఆర్మీ హెలికాప్టర్ రాకను గమనించిన ఓ బాలుడు తన ఒంటిపై టీ షర్ట్ తో గాల్లో ఊపుతూ సంకేతం అందించాడు. గమనించిన పైలట్ ఆ బాలుడు ఉన్న ఇంటి వైపు హెలికాప్టర్ ను మళ్లించాడు. ఆ తర్వాత సురక్షితంగా బాలుడిని కాపాడారు.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి



**కీవ్లో, ఆగస్టు 30 :**

ఉక్రెయిన్ రాజధాని కీవ్లోని ఆర్మీ వెపన్స్ డిపోపై రష్యా డ్రోన్లతో భీకర దాడి చేసింది. ఈ దాడిలో షెల్స్, మైన్స్ కారణంగా భారీ పేలుళ్లు సంభవించి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 38 మంది మృతి చెందగా, 42 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. దాదాపు 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొన్ని నెలల కాలంలో ఇదే అతిపెద్ద దాడిగా పేర్కొన్నారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆసుపత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

**– మంత్రి దామోదర రాజనర్సింహకు మంత్రి సీతక్క విజ్ఞప్తి**

**ములుగు, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి) :**



ములుగు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో పాటు, ఆదివాసీ ప్రాంతాల్లోని ప్రత్యేక వ్యాధులపై అధ్యయనానికి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కోరారు. శనివారం సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి ఆమె వినతిపత్రం సమర్పించారు. డ్రైనేజీ, పారిశుద్ధ్యం, అత్యవసర పనుల కోసం రూ.50 లక్షలు విడుదల చేయాలి. రోగుల రద్దీకి అనుగుణంగా అదనపు ఓపీ గదుల నిర్మాణం కోసం రూ.2 కోట్లు కేటాయించాలి. 50 మంది IHFMS వర్కర్ల నియామకానికి రూ.1.20 కోట్లు కేటాయించాలి. 132 టెక్నికల్ పోస్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. వైద్య పరికరాలు, మౌలిక వసతులు ఆసుపత్రిలో ఎంఆర్ఐ (MRI) యంత్రం, 5-10 పడకల డయాలసిస్ కేంద్రం, కంటి శస్త్రచికిత్సల కోసం క్రిటికల్ కేర్ బ్లాక్‌లో అధునాతన ఆపరేషన్ థియేటర్, ర్యాంప్ సౌకర్యం కల్పించాలి. గిరిజన ప్రాంతాల్లో అధికంగా ఉన్న తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హీమోఫీలియా వంటి వ్యాధులపై అధ్యయనం, చికిత్స కోసం ములుగులో ప్రత్యేక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. మారుమూల గిరిజనులు మెరుగైన వైద్యం కోసం ఇతర జిల్లాలకు వెళ్లే అవసరం లేకుండా ఆసుపత్రిని బలోపేతం చేయాలని సీతక్క కోరారు. మంత్రి విజ్ఞప్తులపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందిస్తూ, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు.

## పార్కును 'మోడల్ పార్కు'గా తీర్చిదిద్దుతాం

**ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి**

**హనుమకొండ, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి) :**



కనకదుర్గ కాలనీలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పార్కును అన్ని ఆధునిక సౌకర్యాలతో మోడల్ పార్కుగా తీర్చిదిద్దుతామని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఆదివారం స్థానిక కమ్యూనిటీ సెంటర్, పార్కును వారు సందర్శించి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, మొక్కల నిర్వహణను పరిశీలించారు. అనంతరం వాకర్స్, స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పార్కులో చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. పిల్లల కోసం ప్రత్యేక సురక్షిత ఆట పరికరాల ఏర్పాటు. వరంగల్ సంస్కృతి, కాకతీయుల కళ వైభవం ప్రతిబింబించేలా గోడలపై ఆకర్షణీయమైన పెయింటింగ్స్. యోగ, మెడిటేషన్ హాల్, వృద్ధులు, మహిళలకు ఉపయోగపడేలా ధ్యాన కేంద్రం నిర్మాణం.భద్రత, విద్యుత్ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు సాయంత్రం వేళల్లో మెరుగైన లైటింగ్ వ్యవస్థ. పార్కు అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణలో తమవంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుజ్జుల వసంత, మున్సిపల్ అడిషనల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, స్థానిక వాకర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

## ఖాతాలగూడెంలో ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

**భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు**
**భారీగా పాల్గొన్న మహిళలు**
**11వ డివిజన్ కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్ గౌడ్**

**నల్గొండ జిల్లా**
**వుదయం ప్రతినిధి ఆగస్టు 30**



నల్గొండ పట్టణంలోని ఖాతాలగూడెంలో ముత్యాలమ్మ బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా, అత్యంత వైభవంగా నిర్వహించారు. 11వ డివిజన్ కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్ గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్బన్ కాలనీ, ఖాతాల గూడెం, గ్రీన్‌హిల్స్ కాలనీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో బోనాల వేడుకలో పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, పూలతో అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు.మంగళ వాయిద్యాల నడుమ బోనాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. అనంతరం ముత్యాలమ్మ తల్లికి బోనాలను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## ప్రేమ శాంతి సోదరభావమే ప్రవక్త బోధన






**జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు**

**జయశంకర్ భూపాలపల్లి**
**ఆగస్టు 30(వుదయం జిల్లా ప్రతినిధి):**

ప్రేమ శాంతి సోదరభావమే ప్రవక్త బోధనలు అని భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు అన్నారు. ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మహాదేవపూర్ మండల కేంద్రంలో ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను మదీనా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు ముజాహిద్ ఖాన్ అధ్యక్షతన ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. మస్జిద్ లో ప్రత్యేక ప్రార్థనలు జరగగా, మతబోధకులు ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్ర, జీవన విధానం, బోధనలను వివరించారు. శాంతి, సహనం, ప్రేమను బోధించిన ప్రవక్త సర్వమానవాళికి మార్గదర్శకుడని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముస్లిం కుటుంబాల్లో ఖురాన్ పఠనం నిర్వహించి, మిఠాయిలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని మదీనా మస్జిద్ నుంచి వీధులలో ప్రధాన రహదారుల మీదుగా జమ మస్జిద్ వరకు మత పెద్దలు, ముస్లిం సోదరులు, చిన్నారులు, ప్రజాప్రతినిధులు కులమతాలకు అతీతంగా భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు ధరించిన సంప్రదాయ వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ వేడుకలలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజబాబుతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ బోధించిన ప్రేమ, శాంతి, సోదరభావం

ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లాతో పాటు మంథని నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులకు వారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ప్రవక్త మహమ్మద్ చూపిన మానవత్వం, కరుణ, సోదరభావం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలంతా పరస్పర ప్రేమాభిమానాలతో, శాంతి సౌభ్రాతృత్వాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆ అల్లాను కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ వేడుకల కార్యక్రమాల్లో పిఏసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్, ఉప సర్పంచ్ తుంగల శ్రీజ సంతోష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వరప్రసాద్, గుడాల శ్రీనివాస్,అక్బర్ ఖాన్, మైనార్టీ నాయకులు ముజాహిద్ ఖాన్, మసూద్ అలీ, ఎండి రఫీ, అజ్మద్, మిర్జా ఎజాస్ అహ్మద్ బేగ్, ఇస్మాయిల్, అక్రమ్, రావుఫ్,
అసద్ ఖాన్, అమీర్ ఖాన్, మంజూర్ ఖాన్,తోపాటు ముస్లిం ప్రజలు పాల్గొన్నారు. మరోవైపు మహాదేవపూర్ ఎస్సై ఎం సాంబమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు

## ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి ఆర్థిక సహాయం

**19వ వార్డు కార్పొరేటర్ గోగుల గణేష్**

**నల్గొండ జిల్లా**
**వుదయం ప్రతినిధి ఆగస్టు 30**



నల్లగొండ పట్టణ కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి గతంలో రూ.1,00,000/ విరాళం అందిస్తామని హామీ ఇచ్చాము ఆ హామీలో భాగంగా, 19వ వార్డు కార్పొరేటర్ శ్రీ గోగుల గణేష్ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కోసం ప్రస్తుతం రూ.50,000/ విరాళంగా అందజేశాము.ఈ కార్యక్రమంలో

కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు కొప్పు శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎల్లమ్మ ఆలయ చైర్మన్ కొప్పు కృష్ణ గౌడ్, INTUC రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దయాకర్ గౌడ్, కొమండ్లపల్లి శేషకుమార్,మిట్టు డివిజన్ గంగాపుత్ర సంగం అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు ,డివిజన్ పెద్దలు సింగం వెంకటయ్య ,సింగం సత్యనారాయణ ,సింగం రామ్మూర్తి , గోంగిడి లక్ష్మణ్ , పబ్బు నర్సింహ ,ఏటికల నర్సయ్య , గంగాధరి యాదగిరి, ఏరువ అంజయ్య, గొంగడి రాములు,పూర్ణ చందర్, సైదులు, వెంకట్ రెడ్డి ,రవి తదితరులూ పాల్గొన్నారు

### ముత్తారం, గొల్లపల్లి, ముస్తఫాపూర్ గ్రామాల్లో

## మంత్రి పొన్నం ప్రభాకర్ విస్తృత పర్యటన

**రూ.3.74 కోట్లతో ముత్తారం – గట్ల నర్సింగాపూర్ రహదారి పనులకు శంకుస్థాపన**
**గౌరవెల్లి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి నీళ్లు నింపుతాం : మంత్రి పొన్నం**
**ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే 'ప్రజా పాలన' ప్రధాన లక్ష్యం**

**హనుమకొండ/భీమదేవరపల్లి, ఆగస్టు 30 (వుదయం జిల్లా ప్రతినిధి)**



ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన "పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం, గొల్లపల్లి, ముస్తఫాపూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ముత్తారం చౌరస్తా నుంచి గట్ల నర్సింగాపూర్ మీదుగా లంబాడీ తండా వరకు రూ. 3.74 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ పంచాయతీల వద్ద నిర్వహించిన ప్రజా పాలన సమీక్షా సమావేశాల్లో పాల్గొని, ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ప్రజల నుంచి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గౌరవెల్లి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి రిజర్వాయర్‌లో నీళ్లు నింపే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపిన ఆయన, ముస్తఫాపూర్‌లో 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 21ఎకరాల భూసేకరణ పరిహారాన్ని ప్రభుత్వం అందించిందని గుర్తుచేశారు.

ఈ ప్రాజెక్టు ద్వారా ముస్తఫాపూర్‌లో 770 ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు. గొల్లపల్లి బస్ స్టేషన్ నుంచి ముత్తారం రోడ్డు నిర్మాణానికి రూ. 3.5 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. గ్రామాల అభివృద్ధికి వరాలు: గొల్లపల్లిలో ఓపెన్ జిమ్, ఆర్వో వాటర్ ప్లాంట్ మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. స్థల సేకరణ పూర్తయిన వెంటనే గొల్లపల్లి గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20 లక్షలు, మహిళా భవనానికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తామని తెలిపారు. ముత్తారంలో రూ. 15 లక్షలు, గొల్లపల్లిలో రూ. 25 లక్షలు, ముస్తఫాపూర్‌లో రూ. 25 లక్షల ఖర్చుతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు.

పర్యటనలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ... 'జలసిరి' పథకం కింద ప్రతి ఇంటి వద్ద రూ. 6,500తో ఇంకుడు గుంత, రూ. 1.30 లక్షలతో పొలం కుంట నిర్మించుకోవాలి. ఈ కార్యక్రమాల్లో జడ్పీ సీఈవోలు, వివిధ జిల్లాల అధికారులు, స్థానిక సర్పంచ్‌లు ఊరడి భారతి జైపాల్ రెడ్డి (ముత్తారం), నేతుల చంద్రమోహన్ (గొల్లపల్లి), గడ్డం సుజాత రఘుపతి రెడ్డి (ముస్తఫాపూర్), ప్రజాప్రతినిధులు, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి అభివృద్ధికి కొత్త గనులే కీలకం

**కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**
**ఆగస్టు 31 (వుదయం ప్రతినిధి)**



సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ అన్నారు. సింగరేణి అభ్యున్నతి, యూనియన్ బలోపేతానికి చేపట్టాల్సిన విధివిధానాలపై కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్‌లో సెంట్రల్, బ్రాంచ్, ఫిట్ కార్యదర్శులు, నాయకులతో సమావేశం నిర్వహించారు.
హైదరాబాద్ సచివాలయంలో గత సోమవారం జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ పాల్గొని ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.డి. రజాక్ మాట్లాడుతూ సింగరేణి ప్రస్తుత పరిస్థితులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థ భవిష్యత్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఐఎన్టీయూసీ నాయకత్వం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిందన్నారు. సింగరేణి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన బొగ్గు గనులను ప్రారంభించాలని, సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని కోరారు.కార్మికుల సంక్షేమంతో పాటు సంస్థ ఆర్థిక అభివృద్ధికి కొత్త గనుల ప్రారంభం ఎంతో అవసరమని పేర్కొన్నారు.సింగరేణి కార్మికులకు సంబంధించిన పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలని, మారు పేర్ల సమస్యను పరిష్కరించాలని, సొంత ఇంటి కల పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటాను (ప్రాఫిట్ షేర్) ప్రకటించి, కార్మికులకు త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తగూడెం ఏరియాలో అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న జనరల్ అసిస్టెంట్లకు త్వరగా సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ హోదా కల్పించాలని, ఏరియాలోని మైన్స్, ఓపెన్‌కాస్ట్ మైన్స్, వివిధ విభాగాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ బుటిక రాజేశ్వరరావు, సెంట్రల్, బ్రాంచ్ కమిటీ సభ్యులు సకినాల సమ్మయ్య, జిదుల రాజేశ్వరరావు, కాసర్ల సమ్మయ్య, మెంగని అశోక్, పోశం శ్రీనివాస్, రాజశేఖర్, ఫిట్ కార్యదర్శులు చిలుక రాజయ్య, గోపు కుమారస్వామి, ఎం.డి. సత్తార్ పాషా, ఈ. మోహన్‌రెడ్డి, డి. శంకర్‌బాబు, కే. నట్రాజ్, సిహెచ్. సాగర్, జి. మల్లికార్జునరావు, అసిస్టెంట్ సెక్రటరీలు జల్లి కిరణ్, కే. కుమార్, కే. నాగేశ్వరరావు, వల్లాల సాంబమూర్తి, ఎం.డి. సవీర్, నాయకులు ఎస్.డి. యాకుబుద్దీన్, నాగుల శంకర్, ఎస్.కే. ఖాజా పాషా, బాబుదిన్, వెంకట్‌స్వామి, రాజేంద్రప్రసాద్, లెనిన్‌బాబు, దశరథం, రెడ్డి, రమాకాంత్, దిలీప్ తదితర నాయకులు, పాల్గొన్నారు.

## తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బోనాల పండుగ

**శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ కలగాలి - ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

**సూర్యాపేట ఆగస్టు:30**
**వుదయం ప్రతినిధి**



తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బోనాల పండుగ అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ గారు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డలో శ్రీ శ్రీ శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని పేర్కొన్నారు.
అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలవడం మన సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనదని తెలిపారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి, సంతోషం, సౌభాగ్యం వెల్లివిరియాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండటంతో పాటు నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు.
ప్రజలందరూ బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సర్వోత్తమ్ రెడ్డి కోరారు.

## జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

**-అక్టోబర్ లో పోరాట కార్యాచరణ**
**-సెప్టెంబర్ లో సభలు, సమావేశాలు**
**-ఐజెయు సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్**

**ఖమ్మం ఆగస్టు:30**
**వుదయం ప్రతినిధి**




జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జర్నలిస్టులను సమీకరించి పోరుబాట పడతామని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్ హెచ్చరించారు. జర్నలిస్టులు ఎప్పుడు అడిగిన ప్రభుత్వం కాదనడం లేదని కానీ పని కూడా పూర్తి చేయడం లేదని ఖమ్మంలో ప్రభుత్వం కేటాయించిన స్థలం ఉండి అర్హులైన జర్నలిస్టుల జాబితా అధికారుల వద్ద ఉన్నా కూడా నిర్ణయంతీసుకోవడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.టియుడబ్ల్యూజె(ఐజెయు) నగర కమిటీ సమావేశం ఆదివారం స్థానిక మాంగళ్య ఫంక్షన్ హాల్లో జరిగింది. నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాట చరిత్ర ఐజెయు సొంత మని పూర్వపు ఆంధ్రప్రదేశ్లో లో కానీ ఇప్పటి తెలంగాణలో కానీ జర్నలిస్టులకు అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకం ఐజెయు పోరాట ఫలితంగానే వచ్చిందన్నారు.దే ఖమ్మం జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య రెండు దశాబ్దాలుగా పెండింగ్లోలో ఉందని ఐజెయు పోరాట ఫలితంగా 23 ఎకరాల స్థలాన్ని సొసైటీకి ఇస్తూ గత క్యాబినెట్ తీర్మానం చేసిందని దానిని జర్నలిస్టులకు అందించేందుకు సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. సెప్టెంబర్ మాసంలో అన్ని నియోజక వర్గాల సమావేశాలను పూర్తి చేసుకుని అక్టోబర్ లో ప్రభుత్వ తీరును బట్టి పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని వేణుగోపాల్ తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, ఇండ్ల స్థలాల సాధన పూర్తి భద్రత లక్ష్యంగా ఐజెయు పని చేస్తుందన్నారు.
ఈ సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, సామినేని మురారి, హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి మహేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆలస్యం అప్పారావు, నగర కోశాధికారి ఏలూరి వేణుగోపాల్, నాయకులు మాధవరావు, వివిధ పత్రికల బ్యూరోలు ఎస్ కె మోహీనుద్దీన్, సత్యనారాయణ, నగర కమిటీ సభ్యులు, వివిధ చానెళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యవేక్షణతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు**



**రూ. 95.50 లక్షల సుడా నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**ఖమ్మం వుదయం బ్యూరో, ఆగస్టు- 29**

నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి, పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు.నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం




**వరంగల్, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి) :**

లయన్స్ క్లబ్ ఆఫ్ హెచ్ఎన్కే న్యూ శాయంపేట ఆధ్వర్యంలో న్యూ శాయంపేటలోని గ్రీన్ ఫీల్డ్ స్కూల్ లో ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ లయన్ ఎన్. సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కంటి వైద్య నిపుణులు డా. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ వి. శ్యామ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జె. అశోక్ రెడ్డి, సెక్రటరీ ఎండి. ఉస్మాన్ పాషా, ట్రెజరర్ జూకంటి శ్రీనివాస్ (వాసు), జిల్లా కాంగ్రెస్ పీసీ మెంబర్ మామిండ్ల సురేష్ తో పాటు లయన్ సభ్యులు వలి మహమ్మద్, సురేందర్, నాగరాజు, జి. దశరథం, సోమన్న, రజనీకాంత్, కొల్లూరి కృష్ణ, ఇ. ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## కీర్తి రెడ్డి పుట్టిన రోజున సందర్భంగా ఆహారం పంపిణీ చేసిన కీర్తి రెడ్డి యువసేన సభ్యులు



**భూపాలపల్లి ఆగస్టు 30**
**వుదయం ప్రతినిధి.**

భూపాలపల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి జన్మదిన సందర్భంగా హన్మకొండ లో కీర్తి రెడ్డి యువసేన అధ్వర్యంలో భద్రకాళి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం అనంతరం కీర్తి రెడ్డి యువసేన సభ్యులు అలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న అనాధలకు ఆహారం మరియు పండ్ల పంపిణీ చేయ్యడం జరిగింది ఈ కార్యక్రమంలో లడె శివ గుండెకారి గణేష్ తేనేటీ రామ కృష్ణ బైకాని కీషోర్ ఎర్ర రాకేష్ రెడ్డి బిల్లా రాజూ కూమార్ దేశెట్టి సునీల్ డోబిలీ దనూష్ నద్దునూరి ఆఖీల్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న కౌన్సిలర్ పూర్ణచారి



**పరకాల ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):**

పరకాల పట్టణంలోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన పరకాల 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి వెంటనే స్పందించారు. క్షతగాత్రులకు ప్రాథమిక సహాయం అందించడంతో పాటు, తక్షణమే అంబులెన్స్‌కు సమాచారం అందించి వారిని ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆదుకున్న కౌన్సిలర్ పూర్ణచారి మానవత్వాన్ని చాటుకున్నారని స్థానికులు అభినందించారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి**

**ఆదిలాబాద్, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):**

ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీపార్కులో భీమన్న దేవుడు, పెద్దమ్మతల్లి, పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ కులస్తులు శ్రీకాంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ముదిరాజ్ కులస్తుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.భీమన్న దేవుడి ఆశీస్సులతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## ఆలయ అభివృద్ధికి తనవంతు తోడ్పాటు..



- **ధన్వంతరి ఆరాధనోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్..**

**నిజామాబాద్,ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి)**

రాఘవేంద్ర స్వామి మఠం అభివృద్ధికి తన వంతు తోడ్పాటు అందిస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల రాఘవేంద్ర స్వామి మఠంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ధన్వంతరి ఆరాధన ఉత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత సంవత్సరం శ్రీశ్రీశ్రీ సత్యాత్మ తీర్థ శ్రీపాదుల వారి కరకమలముల చేత ధన్వంతరి స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా నిర్వహించారని గుర్తు చేశారు. దేశంలోనే రెండో ధన్వంతరి ఆలయం కావడం ఇందూరు ప్రజల అదృష్టం అన్నారు. ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. నూతన ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు పవన్ ముందడ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మన్ కీ బాత్ దేశ ప్రజల గుండె చప్పుడు

### కరీంనగర్‌లో బోయినపల్లి ప్రవీణ్ రావు



**కరీంనగర్ ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):**

ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమం దేశ ప్రజల గుండె చప్పుడుగా మారిందని కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పార్లమెంట్ ప్రధాన కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రధాని ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ప్రవీణ్ రావు మీడియాతో మాట్లాడారు.ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి నెలా అందించే మన్ కీ బాత్ సందేశం దేశ పౌరులందరిలో కొత్త ఉత్సాహాన్ని, దేశభక్తిని నింపుతోందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి కార్యకర్త, ప్రతి పౌరుడు ప్రధాని మాటల నుండి ఎంతో స్ఫూర్తిని పొందుతున్నారు. సమాజంలో మార్పు కోసం నిస్వార్థంగా పనిచేసే సామాన్యుల శ్రమను గుర్తించి, వారిని ఈ వేదిక ద్వారా ప్రధాని అభినందిస్తున్న తీరు అద్భుతం.

ఈరోజు మోడీ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలను స్ఫూర్తిగా తీసుకుని, మన కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, స్థానిక ఉత్పత్తుల (వోకల్ ఫర్ లోకల్) ప్రోత్సాహం వంటి సేవా కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లేలా, బీజేపీ కార్యకర్తలందరూ గ్రామ గ్రామాన ప్రజలను భాగస్వామ్యం చేస్తూ దేశ ప్రగతి లో భాగం కావాలి అని అన్నారు.

## అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

- **41 పశువులు స్వాధీనం.**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**



బెజ్జూరు మండలంలోని సుష్మీర్ గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు మహారాష్ట్రలో తక్కువ ధరకు పశువులను కొనుగోలు చేసి, వాటిని జగిత్యాల స్లాటరింగ్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బెజ్జూర్ ఎస్సై ఎం.డి. సర్తాజ్ పాషా వెంటనే తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని, పశువులను తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి మొత్తం 41 పశువులను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న పశువుల్లో 10 ఎద్దులు, 21 ఆవులు మరియు 10 దూడలు ఉన్నాయి.విచారణలో నిందితులు మహారాష్ట్రలో తక్కువ ధరకు పశువులను కొనుగోలు చేసి, వాటిని జగిత్యాల స్లాటరింగ్ మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడైంది.ఈ ఘటనపై నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కేసు నమోదు చేయడం జరిగింది. స్వాధీనం చేసుకున్న పశువులు పోలీసుల ఆధీనంలో ఉన్నాయి, ఈ ఘటనపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీల నియామకం

- **పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
- **ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**

**కామారెడ్డి, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):**



కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో పట్టణంలోని 10, 12, 35వ వార్డులకు నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీలను ఏర్పాటు చేశారు. దేవునిపల్లిలోని మున్నూరు కాపు సంఘం భవన్‌లో గూడెం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐరేనీ సందీప్, కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజా గౌడ్ ఆధ్వర్యంలో వార్డు నాయకులతో సమావేశం అనంతరం కమిటీల ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వార్డు కమిటీలను ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రకటించారు.10వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉరుదొండ ప్రవీణ్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా మర్కంటి స్వామి, నీలం రవి, కార్యదర్శిగా లద్దూరి నాగార్జున, కోశాధికారిగా ఆరిఫ్ నియమితులయ్యారు. సలహాదారులుగా చెట్కూరి గంగారం, ఉరుదొండ నరేష్, లద్దూరి లక్ష్మీపతి యాదవ్, రాజయ్య, ఎజాజ్, నాగళ్ల రాజయ్య, సాకలి నవీన్ లను నియమించారు.12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ధర్పల్లి మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పార్థసారథి, కార్యదర్శిగా నీలం వెంకటి, కోశాధికారిగా గోలి సుధాకర్, సలహాదారుగా ఉరుదొండ నరసింహులు నియమితులయ్యారు .35వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చంద్రకాంతరావు, ఉపాధ్యక్షులుగా రసూల్, జోసెఫ్, జనరల్ సెక్రటరీగా ముజ్జు, యూత్ ప్రెసిడెంట్‌గా నరేందర్, సలహాదారుగా సతీష్ రెడ్డి నియమితులయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, ప్రతి వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర యువజన నాయకులు మహమ్మద్ ఇలియాస్, కామారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఐరేనీ సందీప్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పండ్ల రాజు, గంప ప్రసాద్, నౌసిలాల్ నాయక్, కామారెడ్డి మండల అధ్యక్షులు రాజాగౌడ్, ఇప్ప శ్రీనివాస్, దేవునిపల్లి మాజీ సర్పంచ్ నిట్టు వెంకట్ రావు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్, మాజీ ఎంపీపీ లక్ష్మీపతి యాదవ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, వార్డు ఇన్‌చార్జులు చిట్టెడి మధుసూదన్, గంగారం, నీలం కళావతి తదితరులు పాల్గొన్నారు.నూతనంగా నియమితులైన వార్డు కమిటీ అధ్యక్షులు, నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు.

## ఎన్ని విమర్శలు చేసినా జగిత్యాల లో అభివృద్ధి ఆగదు...

- **ప్యాకేజీ మాటలు మాట్లాడుతున్నారు...**
- **ప్రజల సంక్షేమం కోసం పని చేస్తే ప్రైవేట్ లిమిటెడ్ అనడమా...**
- **కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్సీ గా ఉండి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి...**
- **2008 లో శంకుస్థాపన చేసిన ఇందిరమ్మ ఇండ్ల కాలని నీ ఏనాడు పట్టించుకోలేదు...**
- **ఎవరిది అభివృద్ధి ఎవరిది అణచివేత దోరణి అన్నది జగిత్యాల ప్రజలు అందరికీ తెలుసు...**
- **అన్ని నియోజకవర్గాలకు 1500 డబల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేస్తే ఎందుకు నిర్మించలేదు...**
- **జగిత్యాలలో 4500 ఇండ్ల నిర్మాణంలో నా పాత్ర ప్రజలకు తెలుసు...**
- **కొత్త బస్టాండ్ పెట్రోల్ బంక్ వివాదం విషయంలో జీవన్ రెడ్డి అనుచరులు మున్సిపల్ లో ఉన్నపుడు ఇచ్చిన అనుమతులు కాదా...**
- **జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

**జగిత్యాల ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొన్న జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి మాటలు ద్వేషపూరితంగా ఉన్నాయని కానీ విమర్శ లా లేవు అన్నారు కార్యకర్తల ను కాదని కేసీఆర్ ను చాటుగా కలిసి జీవన్ రెడ్డి ప్యాకేజీ మాటలు మాట్లాడం విడ్డురంగా ఉడన్నారు గత 10ఏండ్లు కేసీఆర్ ను తీవ్రంగా విమర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేశారు ముఖ్యమంత్రి నీ నన్ను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అనడం విడ్డూరంగా ఉందన్నారు ప్రజల కోసం పని చేసినందుకా ప్రైవేట్ లిమిటెడ్ అనడం అని ప్రశ్నించారు ఉగాది కి బూరె లు తినిపిస్తానని కాలని వాసులతో అన్నారు ఏమైంది రాష్ట్రంలో అత్యధిక డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ను కేసీఆర్ ఇచ్చారు అది సత్యం వాగు దాటిన తర్వాత తెప్ప తగలేసి మాటలు నాకు రావు ఎప్పుడైనా ఇందిరమ్మ కాలని గురించి నిధులు కావాలని కేసీఆర్ ను కోరారా అని అడిగారు కాంట్రాక్టర్ లు కమిషన్ ఇప్పుడు 15 శాతం గతంలో 4 శాతం అంటే ఎవరిని అంటున్నారు కేసీఆర్ 4 శాతం తీసుకున్నట్టు వయసు పెరిగి ఇష్టారీతిన మాట్లాడుతున్నారు మెడికల్ కాలేజీ ఏర్పాటులో నా ప్రయత్నం ఉంది తెలంగాణలో మెడికల్ కాలేజీ ఆసుపత్రి నర్సింగ్ కాలేజీ ఒక దగ్గర ఉన్న ఏకైక జిల్లా జగిత్యాల 334 వైద్యులు 366 సిస్టర్ లు 730 పడకల ఆసుపత్రి శాంక్షన్ అయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వంలో 8 నెలలు ఎమ్మెల్సీ గా ఉండి మీరు ఏం చేశారు నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి కొన్ని పూర్తి అయ్యాయని 2 వేల ఇండ్లు మంజూరు అయ్యాయని 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు త్వరితగతిన జరుగుతున్నాయన్నారు విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని గొల్లపల్లి రోడ్డులో మహిళా డిగ్రీ కలశాలను ఎమ్మెల్సీ గా ఉండి పట్టించుకోలేదని

తాటిపల్లి చలిగల్ లిఫ్ట్ పనులు పరిస్తితి ఏంటి ప్రతి పనిని విమర్శించాలంటే గతంలో చేసిన పనుల పై పూర్తి చిట్టా ఉంది కొత్త బస్టాండ్ పెట్రోల్ బంక్ విషయంలో జీవన్ రెడ్డి అనుచరులు మున్సిపల్ లో ఉన్నపుడు ఇచ్చిన అనుమతులు కాదా అని అన్నారు జగిత్యాల సమగ్ర అభివృద్ధి కి కృషి చేస్తున్నామన్నారు గత 4 ఏండ్లలో కాంట్రాక్టర్ లు బిల్లులు రాకనే పనులు చేయలేదు సీనియర్ నాయకులు వారి హయాంలో అభివృద్ధి కన్నా అణచివేతలకే ప్రాధాన్యం ఇచ్చారు మాజీ



జెడ్పీ చైర్మన్ పై విజిలెన్స్ కేసు పెట్టించారు బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుని భూ కబ్జా దారు అన్నారు కేసీఆర్ ను దశాబ్ద కాలం తిట్టారు అవన్నీ మర్చిపోయారా అన్ని నియోజకవర్గాలకు 1500 డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేసీఆర్ మంజూరు చేస్తే నేను 4500 నిర్మించామని ప్రజలకు తెలుసునని ఎక్కడా 1500 లో సగం కూడా డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం చేయలేదని గుర్తు చేశారు

జగిత్యాల ప్రజలకు సేవ చేయాలనే రోజు భూమిపూజ చేస్తున్నానని తుఫిడ్ నిధులు గత ప్రభుత్వం మున్సిపల్ లో డిపాజిట్ చేయకనే పనులు ప్రారంభం కాలేదని పాత బస్టాండ్ పోలీస్ స్టేషన్ లో పెట్రోల్ బంక్ విషయం లో నేను ఆలస్యం చేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఏడాది లో ఎమ్మెల్సీ గా ఉండి మీరు ఏం చేశారు మంత్రి గా ఉన్నపుడు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు ఎన్ని విమర్శలు చేసినా జగిత్యాల లో అభివృద్ధి ఆగదన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య సీనియర్ నాయకులు బండ శంకర్ మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్

కౌన్సిలర్ లు ప్రశాంత్ రావు పిట్ట ధర్మరాజు మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ నాయకులు కప్పల శ్రీకాంత్ రామకృష్ణ రెడ్డి మ్యానపురి మహేష్ నాయకులు పాల్గొన్నారు

## ఈ నెల 31న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల జిల్లా ,ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):-**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని మెడికల్ గోడౌన్‌లో నిర్మించిన అధునాతన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 17 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 42 వేల 450 మంది విద్యార్థులకు, 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న 6 వేల 654 మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. రోజుకు 50 వేల మందికి ఆహారం అందించగల సామర్థ్యంతో ఈ కిచెన్‌ను రూపొందించారని, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అమలు భాగస్వామిగా వ్యవహరిస్తుండగా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా కిచెన్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన సుమారు 8 వేల చదరపు అడుగుల షెడ్‌లో ఈ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడం జరిగిందని, ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను అత్యున్నత స్థాయిలో నిర్వహించేందుకు ఫుడ్ ల్యాబ్, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్, ఆర్.ఓ. వాటర్ ప్లాంట్, బాయిలర్ ప్లాంట్, సెంట్రల్ గ్యాస్ బ్యాంక్, ఆటోమేటిక్ వెజిటబుల్ వాషింగ్ అండ్ కటింగ్ యూనిట్ వంటి ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కిచెన్‌లో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ స్టీమర్లతో గంటకు 5 వేల 600 ఇడ్లీలు, ఆటోమేటిక్ దోశ మెషీన్‌తో గంటకు 2 వేల దోశలు, ఆటోమేటిక్ పూరీ మెషీన్‌తో గంటకు 3 వేల 600 పూరీలు, సాంబార్, కూరల తయారీ యూనిట్ల ద్వారా 2 గంటల్లో 5 వేల మంది విద్యార్థులకు సరిపడా ఆహారం, రైస్ కుకింగ్ పరికరాల ద్వారా కేవలం 40 నిమిషాలలో 1 వేయి మందికి సరిపడా అన్నం తయారు చేసే సామర్థ్యం ఉందని తెలిపారు. విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సూచనల మేరకు వారపు మెనూను రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారం,



మందమర్రి, లక్సెట్టిపేట, దండేపల్లి, కాజీపేట, నెన్నాల్, హాజీపూర్, నాస్పూర్, భీమారం మండలాలు, జగిత్యాల జిల్లాలోని వెల్లటూరు, ఎండపల్లి మండలాలు, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం పూట ఆకలితో పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెళ్లకుండా ఆరోగ్యకరమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం తీసుకుని ఉత్సాహంగా విద్యను అభ్యసించేలా చేయడం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణంలో, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, ఏకాగ్రత, విద్యాభ్యాసంపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు.

## దశాబ్దం దాటుతున్నా పూర్తికాని రహదారి

- **మెటల్ పరిచి వదిలేశారు రోడ్డు వేయడం మరిచారు!**
- **అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**

**చర్ల, ఆగస్టు 30:(వుదయం ప్రతినిధి)**

ఒకటి కాదు.. రెండు కాదు.. దాదాపు పది సంవత్సరాలు గడుస్తున్నా కలివేరు తిప్పాపురం రహదారి నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై మెటల్ పరిచి వదిలేయడంతో రాకపోకలు కష్టతరంగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ రహదారి కష్టాలు మాత్రం తీరడం లేదని వారు వాపోతున్నారు.

**మెటల్ రోడ్డు.. ప్రయాణం నరకప్రాయం**

రహదారిపై మెటల్ పరిచి పనులు నిలిపివేయడంతో గుంతలు, రాళ్ల మధ్య ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉండటంతో పాటు, వాహనాలు దెబ్బతింటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, బాలింతలు ఈ రహదారిపై ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు.“ఈ రోడ్డుపై ప్రయాణిస్తే నడుములు జారిపోతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలన్నా ఇబ్బందే. ఇంతకాలం రహదారి పూర్తికాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం” అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**నిధుల కొరతా.. గుత్తేదారుల నిర్లక్ష్యమా?**

రహదారి పనులు ఎందుకు నిలిచిపోయాయన్న అంశంపై అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గుత్తేదారుకు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిపివేశారని అధికారులు చెబుతుండగా, మరోవైపు పనులను వేరే గుత్తేదారుకు అప్పగించినప్పటికీ వారు కూడా పనులు చేపట్టడం లేదని కొందరు అధికారులు పేర్కొంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.అయితే కారణాలు ఏవైనా.. దశాబ్ద కాలంగా రహదారి పూర్తికాకపోవడంతో నష్టపోతున్నది మాత్రం సామాన్య ప్రజలేనని వారు అంటున్నారు.

**ఎమ్మెల్యే చొరవ చూపాలని విజ్ఞప్తి**

ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రత్యేకంగా దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు, సంబంధిత గుత్తేదారుతో మాట్లాడి రహదారి పనులు ఎందుకు నిలిచిపోయాయో పూర్తి స్థాయిలో తెలుసుకుని, పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పది సంవత్సరాలుగా ఒక రహదారి నిర్మాణం పూర్తికాకపోవడం వెనుక అసలు కారణమేంటి? నిధుల సమస్యా.. గుత్తేదారు మార్పా.. అధికారుల పర్యవేక్షణ లోపమా? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, రహదారి పనులకు ఉన్న అడ్డంకులను తొలగించి వేగంగా పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## వేగవంతంగా గోదావరి పుష్కర పనులు పూర్తి చేస్తాం

- **కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా 30 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నిర్మల్ జిల్లాలోని అన్ని పుష్కర ఘాట్ ల వద్ద భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సదుపాయాల కల్పన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావులు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే ఆమోదం పొందిన పనులను త్వరగా ప్రారంభించాలని అన్నారు. పనులన్నీ నాణ్యవంతంగా ఉండాలన్నారు. కలెక్టర్లు పుష్కరాల పనులన్నీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నివేదికలు సమర్పించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలోని బాసర పుష్కర క్షేత్రం వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దేవాదాయ, నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. వీటితో పాటు జిల్లాలోని గోదావరి పరీవాహక అన్ని పుష్కర ప్రదేశాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి,

అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## గిన్నిస్ బుక్ లో రికార్డ్ సృష్టించిన సిఐకి ఘన సన్మానం





**కామారెడ్డి, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. మహేష్ ను గ్రామస్తులు, మిత్ర బృందం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కామారెడ్డి పట్టణంలో వశిష్ట కాలేజీలో అభినందన సభ ఆదివారం నిర్వహించారు. తాడ్వాయి మండలం దేమి కలాన్ గ్రామస్తులు, చిన్న నాటి మిత్రులు, క్లాస్ మేట్స్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఇటీవల సాహసోపేత బైక్ యాత్రలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చోటు సాధించారు. లడక్ లో 2,100 కిలోమీటర్లు ప్రయాణించి ఎత్తయిన రహదారి ఉమ్లింగ్ పాస్ ను విజయవంతంగా అధిగమించిన విషయాలు వివరించారు. ఎత్తయిన రహదారి ఉమ్లింగ్ పాస్ను కఠినంగా 7రోజుల పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్బంగా దేమికలాన్ కు చెందిన గ్రామస్తులు, యువకులు, చిన్న నాటి మిత్రులు, డిగ్రీ క్లాస్ మేట్స్ పాల్గొని సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో తాడ్వాయి మాజీ ఎంపిపి రాజు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకట్, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి)**

సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లి గ్రామాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.5 లక్షల నిధుల మంజూరుతో నూతనంగా నిర్మాణం చేపట్టిన “ఇందిరమ్మ ఇండ్లను” ఆదివారం రోజున స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన గౌరవ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు...ముందుగా పెద్దపల్లి నియోజకవర్గంలోని పలు వివాహ వేడుకల్లో మరియు పలు శుభాకార్యాలల్లో పాల్గొని ఆశీర్వాదించిన ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే విజయరమణ రావు ఈ కార్యక్రమంలో పన్నాల రాములు మరియు స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు...

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలతో డిజిటల్ యాతనలో తెలంగాణ వ్యవసాయం




సిద్దిపేట/జగదేవపూర్, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి)

కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాల వల్ల తెలంగాణ అన్నదాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాచరం కనకయ్య మండిపడ్డారు. సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో నెట్‌వర్క్ సిగ్నల్స్ సరిగా లేక, చాలామంది వద్ద స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో లేక సర్వర్ సమస్యలతో యూరియా యాప్‌లలో స్లాట్ బుకింగ్ కాక రైతులు అల్లాడిపోతున్నారని ధ్వజమెత్తారు. ఒకవేళ కష్టపడి బుక్ చేసుకుని పంపిణీ కేంద్రాలకు వెళ్తే స్టాక్ లేదని తిప్పి పంపడం దారుణమన్నారు. రైతు చేతిలో ఎరువుల బస్తా ఉండాలి తప్ప యాప్ స్లాట్ కాదని, డిజిటల్ విప్లవం పేరుతో సాగును క్లిష్టతరం చేయడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు సాగుకు అవసరమైన 3ఫేస్ విద్యుత్ పగటిపూట నిరంతరాయంగా అందక తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడుతోందని ఆరోపించారు. రాత్రివేళల్లో కరెంట్ రావడంతో చీకటిలో పొలాల వద్దకు వెళ్లే రైతులు పాములు, తేళ్లు మరియు విద్యుత్ షాక్‌ల బారిన పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పారదర్శకత పేరుతో కాలయాపన చేయకుండా రైతులకు వెంటనే యూరియాను నేరుగా అందజేయాలని, పగటిపూట నాణ్యమైన 3ఫేస్ విద్యుత్‌ను సరఫరా చేసి అన్నదాతలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మున్నూరు కాపు రాజ్యాధికార పార్టీ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



నాగర్‌కర్నూల్ రూరల్, ఆగస్టు 30 (వుదయం ప్రతినిధి):

మున్నూరు కాపు రాజ్యాధికార పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని చేయూత వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు పిటిగడ్డ శ్రీనివాసులు అధ్యక్షతలో జరిగిన సమావేశంలో అధ్యక్షులుగా పార్టీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పిటిగడ్డ శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా లింగం భాస్కర్, పాలమూరు శంకరయ్య, కోశాధికారిగా వారధి నరేందర్ ఎన్నికయ్యారు. వీరితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మున్నూరు కాపు సమాజ ఐక్యత, అభివృద్ధి, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవం

నారాయణపేట టౌన్ ఆగస్టు30 (వుదయం ప్రతినిధి)

లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320 ఎ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్, నారాయణపేటలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం కోసం మొక్కలు ఎంతో ముఖ్యమైనవి. మన చుట్టూ పచ్చదనం పెరిగినప్పుడే మనకు ఆరోగ్యకరమైన ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలనీ కోరారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రవికుమార్ గౌడ్ ఆధ్వర్యంలోనిర్వహించారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మల్టిపుల్ కౌన్సిల్ మెంబర్ హరినారాయణ, కార్యదర్శి లయన్ మోహన్ కుమార్ కోన,సభ్యులు శ్రీనివాస్ లాహోటి, కృష్ణమూర్తి,జనార్దన్, కర్లీ బాలకృష్ణ,బాలాజీ కాంప్లె, బాలా జీ ఎగ్ బోట్ ,వెంకటయ్య,హిమాన్సు సింగ్, సదానం దంచారి,సురేందర్ చారి బి. సాయినాథ్, శాంత, ఎస్. చక్రవర్తి, విద్యార్థిని విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు.




## ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, వుదయం బ్యూరో:

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ERO, AEROలతో నోటీసుల జారీ, విచారణ మరియు పరిష్కార చర్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నోటీసులను తక్షణమే అందజేయాలని, నోటీసు ఇచ్చిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన తర్వాతే విచారణ చేపట్టి పరిష్కరించాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజూ నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ ప్రజా సమస్యలను సజావుగా తీర్చాలని తెలిపారు. అలాగే 'నో మ్యాపింగ్' జాబితాలను రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచి, నిబంధనలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ.. జిల్లాలో నోటీసుల హియరింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, భారత ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా సవరణ ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## మహాపాదయాత్రలో మాజీ ఎంపీ బీబీ పాటిల్‌తో వీరశైవ లింగాయత్ నాయకులు

- పటాన్‌చెరు నుంచి బొంతపల్లి వరకు భక్తిశ్రద్ధలతో మహాపాదయాత్ర.

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి వుదయం:



సంగారెడ్డి జిల్లా పరిధిలో నిర్వహించిన మహాపాదయాత్ర భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా కొనసాగింది. పటాన్‌చెరు నుంచి బొంతపల్లి శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం వరకు సాగిన ఈ మహాపాదయాత్రలో మాజీ ఎంపీ బీబీ పాటిల్ పాల్గొని భక్తులకు ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా పరమపూజ్య శ్రీ హిరేమట్ పీఠాధిపతి శ్రీ వీరయ్య స్వామి అప్ప గారి సాన్నిధ్యంలో జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు భక్తులతో కలిసి పాదయాత్రలో నడిచారు.పటాన్‌చెరు నుంచి ప్రారంభమైన మహాపాదయాత్ర బొంతపల్లి శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం వరకు భక్తి పారవశ్యంతో కొనసాగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వీరశైవులు, లింగాయత్ సమాజ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారి నామస్మరణతో ముందుకు సాగారు.ఈ మహాపాదయాత్ర సందర్భంగా భక్తులు ఆధ్యాత్మిక భావంతో పాల్గొని ఐక్యతను చాటారు. వీరశైవ లింగాయత్ సమాజం సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షిస్తూ ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని పలువురు ఆకాంక్షించారు. భక్తుల భారీ పాల్గొనడంతో పటాన్‌చెరు నుంచి బొంతపల్లి వరకు మహాపాదయాత్ర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు .. జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ ఆగస్ట్ 30 ( వుదయం ప్రతినిధి)



బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్‌లలో బైక్ హెల్ప్ సెంటర్లు - అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు

మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ -2026 పరీక్షను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా ఎస్.పి.డి.జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జె.పి.ఎన్.సి.ఈ.లోని నీట్ పీజీ -2026 పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ విధానం, పరీక్షా నిబంధనల అమలు తదితర అంశాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో, సురక్షితంగా చేరుకునేలా ప్రత్యేక రవాణా సహాయ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్‌లలో బైక్ హెల్ప్ సెంటర్లను ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి జిల్లాకు చేరుకునే అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రాలను ఇబ్బంది లేకుండా చేరుకునేందుకు ఈ బైక్ హెల్ప్ సెంటర్ల ద్వారా అవసరమైన రవాణా సహాయం అందిస్తున్నారు. అదనపు కలెక్టర్ ఆయా హెల్ప్ సెంటర్లను కూడా పరిశీలించి, అభ్యర్థులకు అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సిబ్బందికి సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు, పరీక్షా నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నీట్ పీజీ -2026 పరీక్షను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. ఆర్.డి.ఓ నవీన్, డి.ఎస్.పి.(ఎస్.బి)రమణా రెడ్డి తదితరులు ఉన్నారు.

## కన్న పేగు బంధం కళ్లముందే కనుమరుగైతే...

- ఆ తల్లి గుండెను ఎవరు ఓదార్చగలరు?
- ఆత్మహత్య పరిష్కారం కాదు... ఒక్క క్షణం నిర్ణయం కుటుంబానికి జీవితాంతం కన్నీటి శిక్ష
- కలెక్టర్ నుంచి ఎస్పీ వరకు... ప్రభుత్వం నుంచి సమాజం వరకు ఒక్కటే సందేశం — ప్రాణాన్ని కాపాడాలి, బాధను పంచుకోవాలి

వికారాబాద్ ఆగస్టు 30 (వుదయం బ్యూరో)




మనిషి జీవితంలో సమస్యలు రావడం సహజం. కానీ సమస్య వచ్చిన ప్రతిసారీ జీవితం ముగించుకోవాలనే ఆలోచన రావడం మాత్రం అత్యంత ప్రమాదకరమైన మానసిక సంక్షోభానికి సంకేతం. చదువులో వైఫల్యం కావచ్చు... ప్రేమలో విఫలం కావచ్చు... కుటుంబ కలహాలు కావచ్చు... ఉద్యోగం రాకపోవడం కావచ్చు... అప్పులు కావచ్చు... ఆర్థిక ఇబ్బందులు కావచ్చు... అవమానం కావచ్చు... ఒంటరితనం కావచ్చు... అనారోగ్యం కావచ్చు... సమస్య ఏదైనా కావచ్చు. ఆ సమస్య మనిషికి ఆ క్షణంలో కొండంత పెద్దదిగా కనిపించవచ్చు. కానీ ఆ సమస్య కంటే మనిషి జీవితం ఎంతో పెద్దది. ఆ ఒక్క విషయం గుర్తుపెట్టుకోకుండా తీసుకునే ఒక్క క్షణ నిర్ణయం ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాదు, మొత్తం కుటుంబ జీవితాన్ని చీకటిలోకి నెట్టేస్తుంది. వికారాబాద్ జిల్లాలో గత కొన్నేళ్లుగా నమోదైన సంఘటనలను పరిశీలిస్తే ఆత్మహత్యల వెనుక ఒకే ఒక్క కారణం లేదని స్పష్టమవుతోంది. విద్యార్థుల విషయంలో చదువు, పాఠశాల వాతావరణం, తోటి విద్యార్థుల వేధింపులు, ఉపాధ్యాయులతో సమస్యలు వంటి అంశాలు కొన్ని ఘటనల్లో కనిపించాయి. 2021లో వికారాబాద్ జిల్లాలో ఓ పదో తరగతి విద్యార్థి ఉపాధ్యాయుడి మందలింపుతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన నమోదైంది. అదే సంవత్సరంలో మరో విద్యార్థి తోటి విద్యార్థుల ఆటపట్టింపులతో మనోవేదనకు గురైన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. మరోవైపు ఉద్యోగం రాకపోవడం, సమాజం నుంచి ఎదురయ్యే అవమానం కూడా యువతను ఎంత తీవ్రంగా ప్రభావితం చేయగలదో 2021లో కుల్కచర్లకు చెందిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ మృతి ఘటన చూపించింది. ఉద్యోగం లేకపోవడంపై ఎదురైన అవమానం, నిరాశ అతని మానసిక స్థితిపై ప్రభావం చూపినట్లు ఆ సమయంలో వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ప్రేమ, వివాహం, కుటుంబ సంబంధాల సమస్యలు కూడా కొన్ని ఘటనల్లో కారణాలుగా కుటుంబ సభ్యులు లేదా పోలీసులు పేర్కొన్న సందర్భాలు ఉన్నాయి. 2021లో వికారాబాద్‌లో 21 ఏళ్ల యువతి కుటుంబ విభేదాల నేపథ్యంలో మృతి చెందిన ఘటన వార్తల్లో వచ్చింది. 2023లో 19 ఏళ్ల నర్సింగ్ విద్యార్థిని మృతి ఘటనలో మొదట అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, పోలీసుల దర్యాప్తులో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు భావించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఈ సంఘటనలన్నింటినీ కలిపి చూస్తే ఒక విషయం స్పష్టమవుతోంది—ఆత్మహత్యకు ఒక్క కారణం ఉండదు; అనేక ఒత్తిళ్లు కలిసినప్పుడు మనిషి ఆలోచనా శక్తి తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే సమస్యను కేవలం పోలీసు కేసుగా చూడకుండా మానసిక ఆరోగ్యం, కుటుంబం, విద్య, సామాజిక వాతావరణం, ఆర్థిక పరిస్థితులు అన్నింటినీ కలిపి చూడాల్సిన అవసరం ఉంది. కన్న తల్లి బాధను ఒకసారి ఊహించండి. చిన్నప్పటి నుంచి బిడ్డను కంటికి రెప్పలా కాపాడిన తల్లి... జ్వరం వస్తే రాత్రంతా నిద్రపోకుండా చూసుకున్న తల్లి... బిడ్డ చదువుకోవాలని తన అవసరాలను తగ్గించుకున్న తల్లి... బిడ్డ భవిష్యత్తు బాగుండాలని ఎన్నో కలలు కన్న తల్లి... అదే బిడ్డ ఒక్కరోజు ఇంటికి తిరిగి రాకుండా పోతే? గదిలో బిడ్డ పుస్తకాలు ఉంటాయి... బట్టలు ఉంటాయి... ఫొటోలు ఉంటాయి... ఫోన్ ఉంటుంది... కానీ "అమ్మా" అని పిలిచే గొంతు ఉండదు. ఆ బాధకు ఓదార్పు ఏమిటి? బిడ్డను చదివించేందుకు కష్టపడ్డ తండ్రి పరిస్థితి ఏమిటి? తన చేతులతో పెంచిన బిడ్డ తన కళ్లముందే లేకుండా పోతే ఆ తండ్రి గుండెలో ఏర్పడే ఖాళీని ఎవరు నింపగలరు? అందుకే ఆత్మహత్య గురించి ఆలోచించే ప్రతి యువకుడు ముందుగా తన తల్లిదండ్రుల ముఖాన్ని గుర్తు చేసుకోవాలి. "నా సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు" అనిపించే ముందు "నాతో మాట్లాడే వాళ్లు ఎవరున్నారు?" అని ఆలోచించాలి. స్నేహితుడితో మాట్లాడాలి. తల్లిదండ్రులతో మాట్లాడాలి. ఉపాధ్యాయుడితో మాట్లాడాలి. బంధువులతో మాట్లాడాలి. అవసరమైతే కౌన్సెలర్‌ను సంప్రదించాలి. కానీ జీవితాన్ని మాత్రం ముగించకూడదు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారీ, ఐఏఎస్ గారి పరిపాలనా దృష్టిలో కూడా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే వ్యవస్థను బలోపేతం చేయడం అత్యంత ముఖ్యమైన అంశం. జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఆయన కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్‌గా ఉన్నారు. ప్రజలు ప్రభుత్వ వ్యవస్థను సంప్రదించడానికి అధికారిక హెల్ప్‌లైన్ వ్యవస్థలు కూడా జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. ఆత్మహత్య నివారణ విషయంలో దీని అర్థం చాలా లోతైనది. సమస్యను చివరి దశకు వెళ్లనివ్వకుండా, బాధలో ఉన్న వ్యక్తి ప్రభుత్వ వ్యవస్థను, వైద్య సేవలను, కౌన్సెలింగ్ సేవలను, పోలీసు వ్యవస్థను సంప్రదించగలిగే వాతావరణం ఉండాలి. ఒక యువకుడు కుటుంబ సమస్యతో బాధపడుతున్నా... ఒక విద్యార్థి చదువు ఒత్తిడితో కుంగిపోతున్నా... ఒక రైతు అప్పుల సమస్యతో ఇబ్బంది పడుతున్నా... ఒక మహిళ కుటుంబ హింసతో బాధపడుతున్నా... సమస్యను చెప్పుకునే తలుపు తెరిచి ఉండాలి. కలెక్టర్ సందేశాన్ని ఈ నేపథ్యంలో ఒక పరిపాలనా బాధ్యతగా చూస్తే— "సమస్యను దాచుకోకండి, అధికార వ్యవస్థను సంప్రదించండి, అందుబాటులో ఉన్న సహాయాన్ని వినియోగించుకోండి" అనే దిశలో ప్రజలకు భరోసా కల్పించడమే కీలకం. ఇదే సమయంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆధ్వర్యంలో పోలీసు శాఖలోనే Stress Management, Strengthening Mind, Resilience అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడటం కూడా ప్రాధాన్యమైన అంశం. పోలీసు సిబ్బంది వంటి అధిక ఒత్తిడి ఉన్న వృత్తుల్లో పనిచేసే వారికి మానసిక ఒత్తిడిని గుర్తించడం, దాన్ని నిర్వహించడం, మానసిక స్థైర్యాన్ని పెంచుకోవడం అవసరమని ఈ కార్యక్రమం స్పష్టం చేస్తోంది. ఎస్పీ సందేశం నుంచి తీసుకోవాల్సిన ప్రధాన సామాజిక పాఠం— ఒత్తిడిని దాచుకోవడం కాదు, గుర్తించి పరిష్కరించుకోవడం. పోలీసులు ప్రజల సమస్యలను వింటారు; అదే విధంగా కుటుంబ సభ్యులు కూడా పిల్లల మాట వినాలి. పోలీసు శాఖలో కౌన్సెలింగ్, అవగాహన, ఒత్తిడి నిర్వహణకు ప్రాధాన్యం పెరుగుతున్నట్లే విద్యార్థులు, యువత, కుటుంబాల్లో కూడా మానసిక ఆరోగ్యంపై అవగాహన పెరగాలి. ప్రభుత్వం కూడా ఇదే దిశగా మానసిక ఆరోగ్య సేవలను విస్తరిస్తోంది. Tele MANAS ద్వారా 24 గంటల మానసిక ఆరోగ్య సహాయం అందుబాటులో ఉంది. 14416 లేదా 180089 14416 నంబర్లకు సంప్రదించవచ్చు. ఈ వ్యవస్థ కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైనప్పుడు తదుపరి మానసిక ఆరోగ్య సేవలకు అనుసంధానం చేసే ఉద్దేశంతో పనిచేస్తోంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణపై దేశవ్యాప్తంగా కూడా ప్రత్యేక దృష్టి పెరిగింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన జాతీయ టాస్క్‌ఫోర్స్ విద్యార్థుల ఆత్మహత్యలకు దారితీసే ప్రధాన కారణాలను గుర్తించడం, మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు విధానాలను రూపొందించడం వంటి అంశాలపై పనిచేస్తోంది. 2026లో కూడా ఈ అంశంపై ప్రత్యేక సంప్రదింపులు కొనసాగుతున్నాయి. అంటే ప్రభుత్వం చెప్పే ప్రధాన సందేశం ఒక్కటే—మానసిక ఆరోగ్యం కూడా ఆరోగ్యమే; బాధపడుతున్న వ్యక్తిని ఒంటరిగా వదిలేయకూడదు; సహాయం కోరడాన్ని బలహీనతగా చూడకూడదు. వికారాబాద్ జిల్లాలో ఆత్మహత్యలపై చర్చిస్తున్నప్పుడు మరో ముఖ్యమైన అంశం గణాంకాల విషయంలో జాగ్రత్త. కొన్ని జిల్లా స్థాయి క్రైమ్ నివేదికల్లో మొత్తం ఆత్మహత్య కేసుల సంఖ్యలు నమోదయ్యాయి. అయితే "గత ఐదేళ్లలో కేవలం 18-30 సంవత్సరాల యువతీ యువకులు ఎంతమంది ఆత్మహత్య చేసుకున్నారు?" అనే ప్రశ్నకు వయస్సువారీ, లింగవారీ, సంవత్సరంవారీ పూర్తి అధికారిక జిల్లా గణాంకాలను నిర్ధారించకుండా ఒక సంఖ్య చెప్పడం సరైన జర్నలిజం కాదు. అందుకే ఈ ప్రత్యేక కథనంలో కల్పిత సంఖ్యలను కాకుండా ధృవీకరించగల సంఘటనలు, ప్రభుత్వ విధానాలు, అధికారుల చర్యలు, సామాజిక విశ్లేషణను మాత్రమే ముందుకు తెస్తోంది. ఎందుకంటే ఒక ప్రాణం గురించి రాసే వార్తలో ఒక్క అంకె కూడా తప్పుగా ఉండకూడదు. యువతలో సమస్యలను గుర్తించడం ఇప్పుడు అత్యవసరం. ఒక విద్యార్థి ఒక్కసారిగా మౌనంగా మారితే గమనించాలి. ఒక యువకుడు అందరినీ దూరం చేసుకుంటే మాట్లాడాలి. ఎప్పుడూ నిరాశగా కనిపిస్తే కారణం అడగాలి. "నా వల్ల ఎవరికీ ఉపయోగం లేదు", "ఇంకా బతకడం ఎందుకు?" వంటి మాటలను సరదాగా తీసుకోకూడదు. ఒక సంభాషణ ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు. తల్లిదండ్రులు పిల్లలను మార్కుల యంత్రాలుగా చూడకూడదు. "ఎన్ని మార్కులు?" అనే ప్రశ్నకు ముందు "ఎలా ఉన్నావు?" అనే ప్రశ్న రావాలి. పరీక్షలో ఫెయిల్ అయితే మరోసారి రాయవచ్చు. ఉద్యోగం రాకపోతే మరో అవకాశం ఉంటుంది. ప్రేమ విఫలమైతే కాలం గడిచేకొద్దీ మనసు మారుతుంది. అప్పు ఉంటే దాన్ని పరిష్కరించేందుకు మార్గాలు వెతకవచ్చు. కుటుంబ సమస్య ఉంటే పెద్దలను కూర్చోబెట్టి మాట్లాడవచ్చు. కానీ ప్రాణం పోయిన తర్వాత ఏ సమస్యకూ రెండో అవకాశం ఉండదు. అందుకే వికారాబాద్ జిల్లాలో ప్రతి పాఠశాల, ప్రతి కళాశాల, ప్రతి హాస్టల్‌లో మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. తల్లిదండ్రులకు పిల్లల మానసిక సంకేతాలను గుర్తించే అవగాహన కల్పించాలి. ఉపాధ్యాయులకు సంక్షోభంలో ఉన్న విద్యార్థులను గుర్తించే శిక్షణ ఇవ్వాలి. యువతకు ఉచితంగా, గోప్యంగా మాట్లాడగల కౌన్సెలింగ్ వేదికలు అందుబాటులోకి రావాలి. పోలీసు, వైద్య, విద్య, సంక్షేమ, రెవెన్యూ శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలి. ఎందుకంటే ఆత్మహత్య జరిగిన తర్వాత పంచనామా చేయడం కంటే... ఆత్మహత్య ఆలోచన వచ్చే ముందే ఒక మనిషిని పట్టుకుని "నీకు మేమున్నాం" అని చెప్పడం గొప్ప సేవ. చివరగా ఒక తల్లి గుండెలో నుంచి వచ్చే ప్రశ్నను ప్రతి యువకుడు వినాలి— "బిడ్డా... నీ బాధ నాకు ఒక్కసారి చెప్పి ఉంటే నేను నీతో నిలబడేదాన్ని కదా?" ఒక తండ్రి మనసులోని మాటను వినాలి— "నువ్వు ఓడిపోయినా పరవాలేదు బిడ్డా... నువ్వు లేకుండా మాత్రం నేను ఎలా బతకాలి?" ఈ మాటలు కల్పితం కాదు; పిల్లలను కోల్పోయిన కుటుంబాల బాధను అర్థం చేసుకునే ప్రయత్నం మాత్రమే. అందుకే మిత్రమా... నీకు సమస్య ఉంటే చెప్పు. ఏడవాలనిపిస్తే ఏడువు. మాట్లాడాలనిపిస్తే మాట్లాడి. సహాయం కావాలంటే అడుగు. కౌన్సెలర్‌ను కలువు. వైద్యుడిని సంప్రదించు. పోలీసులను సంప్రదించు. నీ కుటుంబాన్ని సంప్రదించు. కానీ నీ జీవితాన్ని మాత్రం ముగించకు. నీ సమస్య కంటే నీ జీవితం పెద్దది. నీ ఓటమి కంటే నీ భవిష్యత్తు పెద్దది. నీ బాధ కంటే నీ తల్లిదండ్రుల ప్రేమ పెద్దది. నీకు కనిపించని రేపు ఇంకా నీ కోసం ఎదురుచూస్తోంది. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు... బాధను పంచుకోవడమే పరిష్కారం వైపు మొదటి అడుగు. జీవితం నుంచి పారిపోవడం కాదు... జీవితంతో పోరాడాలి. ప్రాణాన్ని తీసుకోవడం కాదు... సమస్యను పరిష్కరించుకోవాలి. ఇదే వికారాబాద్ జిల్లాలో ప్రతి ఇంటికి, ప్రతి విద్యార్థికి, ప్రతి యువకుడికి, ప్రతి తల్లిదండ్రికి చేరాల్సిన సందేశం.

----ఏం రవీందర్ ,సీనియర్ జర్నలిస్టు



## వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్

మెదక్ జిల్లా వుదయం

నిజాంపేట మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, 9వ వార్డు సభ్యులు నాయిని. లక్ష్మణ్ సోదరుడు చంద్రకాంత్-శ్వేతల వివాహ వేడుకకు మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల్రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్, బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు బజార్ రంజిత్ గౌడ్, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, వెంకటస్వామి గౌడ్, నాయిని మహేష్, శివకుమార్, రాజుగౌడ్, శేఖర్, కరుణాకర్, గుండు శ్రీకాంత్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## పేటలో ఘనంగా జగ లింగేశ్వర స్వామి జాతర మహోత్సవాలు

నారాయణపేట ,ఆగస్టు30 (వుదయం ప్రతినిధి):

నారాయణపేట పట్టణ నడిబొడ్డున కొలువైన కురువ జగ లింగేశ్వర స్వామి జాతర, అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, సరాఫ్ నాగరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ బట్టడ, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ 10వ వార్డ్ కౌన్సిలర్ కందన్‌పల్లి సత్యమ్మ, మాజీ కౌన్సిలర్ డాక్టర్ సాయి బాబా ,గొల్లపల్లి గొల్ల గోపాల్, కురువ మనోజ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి వేణుగోపాల్ మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో గ్రామంలోని సుభిక్షంగా ఉండాలని, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని, వరుణ దేవుడు కటాక్షించాలని కోరారు. జాతరను విజయవంతం చేసిన ఆలయ కమిటీకి, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ పెద్దలు మాజీ మార్కెట్ చైర్మన్ లకు, కౌన్సిలర్లకు శాలువాతో సత్కరించారు.

## ఎడ్మ శ్రీను యాదవ్ కు ఉత్తమ కోచ్ అవార్డు

అచ్చంపేటఆగస్టు30 (వుదయం ప్రతినిధి)



అచ్చంపేట నియోజకవర్గం నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రానికి చెందిన జాతీయ స్థాయి క్రీడాకారుడు, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎడ్మ శ్రీను యాదవ్ అథ్లెటిక్స్ లో చేసిన సేవలకు గాను 2026 ఉత్తమ కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్ మీర్ పేట్ లోని బచ్ పన్ ప్లే స్కూల్ లో తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ అవార్డును అందజేశారు.ఈ సమావేశానికి తెలంగాణ విద్యాశాఖ మెంబర్ చారగొండ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఎడ్మ శ్రీను యాదవ్ మాట్లాడుతూ అథ్లెటిక్స్ లో తన సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని, అవార్డు రావడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని, జీవితాంతం అథ్లెటిక్స్ కు సేవ చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫిట్ నెస్ పై దృష్టి సారించాలని సూచించారు. తనకు అవార్డు అందజేసిన బజరంగ్ స్పోర్ట్స్ అకాడమీ, రామ్ లక్ష్మణ్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులకు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.అవార్డు రావడం పట్ల గ్రామస్థులు, సీనియర్ క్రీడాకారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

## బీడీ కార్మికులందరికీ జీవనభృతి మంజూరు చేయాలి

- హామీ ఇచ్చిన రూ.4,016ల భృతిని వెంటనే అమలు చేయాలి
- రిటైర్మెంట్ పెన్షన్ రూ.7,500లకు పెంచాలి: సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్

సిద్దిపేట, ఆగస్టు 30 (వుదయం బ్యూరో)

రాష్ట్రంలో బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా జీవనభృతి మంజూరు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జీవనభృతిని రూ.4,016లకు పెంచి వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో తెలంగాణ బీడీ & సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కామిని గోపాలస్వామి అధ్యక్షతన నిర్వహించిన 4వ రాష్ట్ర మహాసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 7 లక్షల మంది బీడీ కార్మికులు ఉన్నారని, మూడు బడ్జెట్‌లు గడిచినా వారి జీవనభృతికి కేటాయింపులు చేయకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్య సమస్యలతో, పనిదినాలు తగ్గి ఆర్థికంగా చితికిపోతున్న కార్మికులను ఆదుకోవాలని, కేంద్ర ప్రభుత్వం రిటైర్మెంట్ పెన్షన్‌ను కనీసం రూ.7,500లకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే 15 ఏళ్లుగా సవరించని కనీస వేతనాల జీవోను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. రమ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఆమోదించారు. అనంతరం రూ.4,016 జీవనభృతి అమలు, రూ.7,500 రిటైర్మెంట్ పెన్షన్, కనీస వేతనాల జీవో విడుదల మరియు 4 లేబర్ కోడ్‌ల ఉపసంహరణపై తీర్మానాలు చేశారు. ఈ డిమాండ్ల సాధనకు త్వరలోనే కలెక్టరేట్ ధర్నా చేపడతామని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, యూనియన్ జిల్లా కార్యదర్శి గొడ్డు బర్ల భాస్కర్, శశిధర్, రవికుమార్, శోభ తదితరులు పాల్గొన్నారు.



# మధిర నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట

**చింతకాని, బోనకల్ మండలాల్లో రూ.131.61 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**మధిర, ఆగస్టు 29, వుదయం ప్రతినిధి:**

మధిర నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నియోజకవర్గంలోని చింతకాని, బోనకల్ మండలాల్లో ప్రజలకు అవసరమైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యా, వ్యవసాయ రంగాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చింతకాని మండలంలో కోదుమూరు ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.66 లక్షలు, లచగూడెంలో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు రూ.29 కోట్లు కేటాయించారు. అలాగే లచగూడెం–నేరడ పీఆర్ రహదారి వరకు చింతకాని, వందనం ఆర్అండ్‌బీ రహదారి నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.75 కోట్లు, లచగూడెం, అనంతారం బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరు చేశారు. చింతకాని గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.44 లక్షలు, నాగిలిగొండ ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్లకు రూ.85 లక్షలు, నాగిలిగొండ నుంచి తూటికుంట్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.25 కోట్లు కేటాయించారు. బోనకల్ మండలంలోని నారాయణపురంలో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన పీఏసీఎస్ గోదాం నిర్మాణానికి రూ.80.84 లక్షలు, నారాయణపురం ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.63 లక్షలు కేటాయించారు. మోటమర్రిలో 300 మెట్రిక్ టన్నుల పీఏసీఎస్ గోదాం నిర్మాణానికి రూ.24.50 లక్షలు, ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్లకు రూ.1 కోటి, రాయన్నపేట ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.19 లక్షలు మంజూరుచేశారు. కలకోట, రాపల్లి, గన్నవరం, ముసలిమడుగు–లక్ష్మీపురం రహదారిని కిలోమీటర్ 0/0 నుంచి 20/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసేందుకు రూ.57 కోట్లు, బ్రహ్మణపల్లి, గన్నవరం మీదుగా రాపల్లి వరకు ఉన్న పీడబ్ల్యూడీ రహదారిని కిలోమీటర్ 0/0 నుంచి 8/0 వరకు వెడల్పు చేసి పటిష్టం చేసేందుకు రూ.26 కోట్లు కేటాయించారు. రాపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. చింతకాని, బోనకల్ మండలాల్లో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనుల మొత్తం అంచనా వ్యయం రూ.131.61 కోట్లు. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, విద్య, వ్యవసాయం, మౌలిక వసతుల రంగాల్లో ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



**11వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

**సూర్యాపేట ఆగస్టు 30: వుదయం ప్రతినిధి**

సూర్యాపేట పట్టణంలోని 11వ వార్డు (రాయినిగూడెం)లో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా వార్డు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే ప్రజా వేదికగా పనిచేయాలని అన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పార్టీ నాయకులు, కార్యకర్తల దృష్టికి తీసుకువచ్చేలా కార్యాలయం వారధిగా నిలవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

11వ వార్డులో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రతి కుటుంబానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రజాదరణ తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ గంగా భవాని, ఎడ్ల వీరమల్లు యాదవ్, 11వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నంద్యాల మహేష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ బోనాలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి**

**సూర్యాపేట జిల్లా ఆగస్టు 30: వుదయం ప్రతినిధి**



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డలో గల శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లికి వైభవోపేతంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ బోనాల పండుగ వేడుకను పురస్కరించుకొని ముందస్తుగా మాజీ మంత్రివర్యులు, స్థానిక శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్వాహకులు, గౌడ పెద్దలు, పూజారులు ఘనస్వాగతం పలికి సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించారు.

## రైతుల నీళ్ల గోస తీరాలె.. ఈఎల్‌వీ భాస్కర్

**శివన్నగూడెం, రాచకొండ ఎత్తిపోతలపై అసెంబ్లీల గళమెత్తాలని హరీశ్‌రావుకు విజ్ఞప్తి**

**మర్రిగూడ,ఆగస్టు 30 (వుదయం):**



దీర్ఘకాలంగా అసంపూర్తిగా ఉన్న శివన్నగూడెం ప్రాజెక్టును తక్షణమే పూర్తిచేసేలా అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును ఈఎల్‌వీ భాస్కర్ కోరారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో ఈ ప్రాజెక్టుతో పాటు రాచకొండ ఎత్తిపోతల పథకం మంజూరుపై గళమెత్తాలని విజ్ఞప్తి చేస్తూ ఆయనకు ఓ వినతిపత్రం అందజేశారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న శివన్నగూడెం ప్రాజెక్టు పూర్తయితేనే స్థానిక రైతుల సాగునీటి కష్టాలు తీరుతాయని భాస్కర్ ఈ సందర్భంగా వివరించారు. రైతుల పక్షాన పోరాడాలన్న ఆయన విజ్ఞప్తిపై హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారు.

## బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశం




**మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి**

**నల్గొండ జిల్లా, వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 30**

నల్లగొండ పట్టణ కేంద్రంలో కే బి ఆర్ క్యాంపు కార్యాలయంలో నల్లగొండ నియోజకవర్గం ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశం నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగినది జెడ్పి మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కంచర్ల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల విపల పాలనపై.. రాష్ట్ర పార్టీ ఇచ్చిన నిరసనల షెడ్యూల్ ను ప్రకటించారు. రెండో తేదీన నియోజకవర్గం కేంద్రంలో ధర్నా బాకీ కార్డుల పంపకం ప్లెక్సీ ప్రదర్శన మూడో తేదీన రైతు సదస్సులు సదస్సులు నాలుగవ తేదీన మహిళలు వికలాంగుల. వంటావార్పు, ఐదవ తేదీన ఫీజు రియంబర్స్మెంట్ జాబ్ క్యాలండర్ కొరకు యూత్ ర్యాలీలు ఏడవ తేదీన మండల జిల్లా ప్రజావాణిలో వినతి పత్రాలు సెప్టెంబర్ 8వ తేదీన అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు ఎనమిది రోజుల కార్యక్రమాలపై ప్రెస్ మీట్ పార్టీ ప్రకటించిన ఈ కార్యక్రమాలను కార్యకర్తలు నాయకులు, ప్రజలవద్దకు తీసుకుని వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. జెడ్పి మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం మాటలతో గద్దెనెక్కిందని వారు పరిపాలన చేసేది మరొక సంవత్సరమేనని ఆ తర్వాత ఎన్నికల సంవత్సరమేనని ఈ మూడు సంవత్సరాల్లో వారు ప్రజలకు చేసింది ఏమీ లేదని తప్పుడు ప్రచారంతో కేసీఆర్ ను బదనామ్ చేస్తున్నారని ఉన్నారని నాయకులు కార్యకర్తలు వాస్తవాలు ప్రజలకు వివరించాలని కోరారు. మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కరరావు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఈనెల 3వ తేదీన మిర్యాలగూడకు వస్తున్నందున నల్లగొండ నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని, విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్ నల్గొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి మాజీ ఎంపీపీ కరీం పాషా, బొజ్జ వెంకటయ్య, మాజీ జడ్పిటిసిలు తండు సైదులు గౌడ్ తుమ్మల లింగస్వామి, నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్ నల్గొండ మండల పార్టీ అధ్యక్షులు దేప వెంకటరెడ్డి తో పాటు పలువురు కార్పొరేటర్లు సర్పంచులు, నగర, మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్-పీజీ 2026 పరీక్ష

**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**ఖమ్మం వుదయం బ్యూరో, ఆగస్టు- 30**



ఖమ్మం జిల్లాలో నీట్–పీజీ 2026 (NEET–PG) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా, సజావుగా ముగిసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాల్లో నీట్ పరీక్షా నిర్వహణకు రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష ప్రక్రియ పూర్తి పారదర్శకతతో జరిగినట్లు తెలిపారు. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలకు 668 విద్యార్థులను కేటాయించగా, 642 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 26 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు, అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాల అంకురార్పణ



**చర్ల, ఆగస్టు 30: (వుదయం ప్రతినిధి)**

వచ్చే నెల 14న జరగనున్న వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని చర్ల మండల కేంద్రంలోని గణేష్ నగర్‌లో ఆదివారం గణేష్ నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. గణేష్ నగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10:55 గంటలకు సుముహూర్తంలో పసుపు రాట వేసి పందిరి ముహూర్త వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రముఖ పండితులు, మొగలపల్లి రామాలయ అర్చకులు పెనుమర్తి సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నవరాత్రి మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. వేదమంత్రాల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలతో గణేష్ నగర్ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గణేష్ నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

## బోనాల పండుగలో సంకినేని వెంకటేశ్వరరావు



**సూర్యాపేట ఆగస్టు 30: వుదయం ప్రతినిధి**

సూర్యాపేట పట్టణం తాళ్లగడ్డలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా నేడు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ శాసనసభ సభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు. ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాలు స్వీకరించారు. "తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక మన బోనాల పండుగ. సూర్యాపేట ప్రజలందరిపై, ముఖ్యంగా తాళ్లగడ్డ కాలనీ వాసులపై ఆ జగన్మాత ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి. ఆ తల్లి దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి" అని తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బిజెపి పట్టణ అధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండి అబిద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమల్ల నరసింహ, పీఎం విశ్వకర్మ యోజన జిల్లా కన్వీనర్ సలిగంటి వీరేందర్, జిల్లా నాయకులు పలస మల్సూర్ గౌడ్, బండపల్లి శ్రీనివాస్, యార్లగడ్డ రామారావు, మండల పార్టీ అధ్యక్షులు తాళ్లపల్లి మధు, పాల్గొన్నారు.

## చలమల కృష్ణారెడ్డి కుమారుడు వినిత్ రెడ్డి -లిపిరెడ్డి వివాహా కార్యక్రమానికి హాజరైన గుత్తా సుఖేందర్ రెడ్డి

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 30**



శంషాబాద్ జిఎంఆర్ అరేనా కన్వెన్షన్ సెంటర్ లో మునుగోడు నియోజకవర్గ సీనియర్ నాయకులు , చలమల కృష్ణా రెడ్డి కుమారుడు వినిత్ రెడ్డి –లిపిరెడ్డి వివాహ కార్యక్రమానికి హాజరై , నూతన వధూవరులను ఆశీర్వదించినా తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , గుత్తా అమిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొద్దులగూడెంలో ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



**దమ్మపేట ఆగస్టు 30, (వుదయం ప్రతినిధి ):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం,. మొద్దులు గూడెంలో. గ్రామంలో హరిజనవాడకు చెందిన. ప్రజలు. మంచినీటి కోసం మొద్దులు గూడెం లో ప్రదాన రహదారిపై. ఖాళీ బిందెలు తో మహిళలు పురుషులు పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. ఈ రాస్తారోకో కు సంఘీభావం గా. మద్దతు గా సిపిఎం పార్టీ దమ్మపేట మండల కార్యదర్శి. మోరంపూడిశ్రీనివాసరావు. పార్టీ మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మి నారాయణ లు పాల్గొన్నారు వారు మాట్లాడుతూ మొద్దులు గూడెంలో దళిత పేటలోని గ్రామపంచాయతీ మోటారు చెడిపోయి షుమారు 30. రోజులు అయింది. రోజూ కూలి మీద జీవితం గడిపే 200. కుటుంబాలకు మంచి నీళ్ళు రావటం లేదు. యుద్ద ప్రాతిపదికన జిల్లా కలెక్టర్ స్పందించి. వెంటనే మొద్దులు గూడెం లోని దళిత పేట లో క్రొత్త గా బోరు వేయించి కొత్త కరెంట్ మోటార్ బిగించి మంచినీరు అందించాలి అని కోరారు. పరిష్కారం చేయనిఎడల మండలం అభివృద్ధి కార్యాలయం ఎదుట గ్రామస్తులతో ధర్నా చేపడతాం అన్నారు. వెంటనే మంచినీరు అందించాలి అన్నారు . కార్యక్రమంలో దళితపేటలోనిప్రజలు. మిగతా గ్రామ ప్రజలు. ఎం సీతయ్య ఎం మల్లేశ్వర రావు. కె రాములు, తదితరులు పాల్గొన్నారు.

## 20 ఏళ్లుగా బస్సు కోసం ఎదురుచూపులు

**విద్యార్థులు, గ్రామస్తుల ఇబ్బందులు తీర్చేందుకు వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలి: మట్టపల్లి సతీష్**

**అనంతగిరి ఆగస్టు 30 వుదయం**

మండలంలోని పాలవరం గ్రామానికి గత 20 ఏళ్లుగా బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామానికి చెందిన సామాన్య కార్యకర్త మట్టపల్లి సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పాలవరం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోదాడ ఆర్టీసీ మేనేజర్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. కోదాడ నుంచి చనుపల్లి వరకు పెద్ద రహదారి ఉండడంవల్ల ఒక బస్సు ఏర్పాటు చేసి పాలవరం మీదుగా ఉదయం, సాయంత్రం రెండు వేళలా బస్సు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, గ్రామస్తులు వైద్యం, ఉద్యోగాలు, ఇతర అవసరాల కోసం ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు స్పందించి పాలవరం మీదుగా బస్సు సర్వీసును ప్రారంభించాలని సతీష్ కోరారు.



## కాపుగల్లులో ముత్యాలమ్మ పండుగ

**కోదాడ ఆగస్టు 30(వుదయం)**

కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో ముత్యాలమ్మ పండుగ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా బలి కార్యక్రమం నిర్వహించిన తరువాత మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకుని ముత్యాలమ్మ తల్లికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొంతగాని అప్పారావు, పిఏసిఎస్ చైర్మన్ నంబూరి సూర్యం తదితరులు పాల్గొన్నారు.



## ఖానాపురంలో ఘనంగా బోనాల పండుగ

**అనంతగిరి ఆగస్టు 30 వుదయం**

మండల పరిధిలోని ఖానాపురం గ్రామంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు, గ్రామస్తులు భారీ ఊరేగింపుగా బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలివెళ్లి సమర్పించి మొక్కులు చెల్లించారు. డప్పు చప్పుళ్ళ, సంప్రదాయ నృత్యాలతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు, యువత కూడా వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.



## తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిని సన్మానించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ఖమ్మం, వుదయం బ్యూరో, ఆగస్టు 30**

తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు మునగాల వెంకటరత్నం ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదివారం సత్కరించారు. ఇటీవల హైదరాబాదులోని రవీంద్ర భారతి లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందిస్తూ దేశ సమగ్రతను జాతీయ సమైక్యతను కాంక్షిస్తున్నందున జాతీయ సమైక్యత అవార్డుతో పాటు ప్రశాంశ పత్రం పొందిన గ్రహీత ప్రముఖ జానపద సీనియర్ కళాకారులు పిట్టలదొర, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుడు మునగాల వెంకటరత్నం ను చింతకాని లో రాష్ట్ర డిప్యూటీ సీఎం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మత్తేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, చింతకాని గ్రామ సర్పంచ్ కిలారుమనోహర్ బాబు, తదితరులు వున్నారు.

## మహాదేవపురలో ఎత్తిపోతల పథకం నుంచి నీటి ఎత్తిపోతలు ప్రారంభం



**మధిర ఆగస్టు 29, వుదయం ప్రతినిధి:**

మధిర నియోజకవర్గ రైతుల సాగునీటి కష్టాలను తీర్చడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మధిర నియోజకవర్గ శాసనసభ్యులుమల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయి. మధిర మండలం మహాదేవపుర గ్రామంలో వైరా ఏటిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం నుంచి నీటిని ఎత్తిపోసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులుప్రారంభించారు. ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. రైతుల పొలాలకు సాగునీరు అందించడం, వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం భట్టి విక్రమార్క అభివృద్ధి దృక్పథానికి నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మధిర నియోజకవర్గంలో రహదారులు, సాగునీరు, డ్రైనేజీ, విద్య, తాగునీరు, మౌలిక వసతుల కోసం పెద్ద ఎత్తున నిధులు తీసుకువస్తూ అభివృద్ధికి కొత్త ఊపునిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. రైతుల ముఖాల్లో చిరునవ్వు కనిపించాలనే లక్ష్యంతో సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తున్న భట్టి విక్రమార్కకి రైతులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆదూరి శీను, గ్రామ కాంగ్రెస్ నాయకులు కుటుంబాక హనుమంతరావు, ఆవుల కిరణ్, ఆవుల శీను, వరదబోయినవెంకటేశ్వర్లు, కంభంపల్లి శేషయ్య, వరదబోయిన కోటేశ్వరరావు, వరదబోయిన మురళి, బట్ట రాజు, బారిస వెంకయ్య, కళ్యాణ్, మర్సకట్ల కొండ, బట్ట అంజిబాబు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన యువకుడికి కౌన్సిలర్ పరామర్శ

**మధిర, ఆగస్టు 29, వుదయం ప్రతినిధి:**



ఇటీవల ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి కాలు ఫ్యాక్చర్ కావడంతో చికిత్స పొందుతున్న దేవిశెట్టి కృష్ణ కుమారుడిని 21వ డివిజన్ కౌన్సిలర్ రంగా రూప శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడం తన బాధ్యత అని కౌన్సిలర్ రంగా రూప శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట నాగరాజు, కాంగ్రెస్ నాయకులు యర్రగుంట కమలాకర్, నరసింహారావు, కమతం ప్రవీణ్, గాలి ప్రసాద్ పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాలపై దాడులా..?

- ఇదేనా కాంగ్రెస్ సామాజిక న్యాయం?
- కోదాడలో బీసీ జనసభ, యాదవ హక్కుల పోరాట సమితి ఆగ్రహం
- రాహుల్ గాంధీ జోడో యాత్ర సందేశం ఇదేనా?

**కోదాడ ఆగస్టు 30(వుదయం)**

కోదాడ: బడుగు, బలహీన వర్గాల ప్రజలపై అక్రమ కేసులు బనాయించి, దాడులకు పాల్పడడమే కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న సామాజిక న్యాయమా? అని బీసీ జనసభ, యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు ప్రశ్నించారు. ఆదివారం కోదాడ పట్టణంలో మదలా ఉపేందర్ యాదవ్, గంధం కనకమ్మలకు మద్దతుగా వివిధ బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం కోసం పాదయాత్రలు, జోడో యాత్రలు నిర్వహిస్తుంటే.. తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలపై దాడులు జరగడం దారుణమని విమర్శించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ.. రాఖీ పండుగ రోజున మీరు మీ సోదరితో సంతోషంగా రాఖీ కట్టించుకోవచ్చు.. కానీ మా అక్కాచెల్లెళ్లు తమ సోదరుడికి రాఖీ కట్టేందుకు వస్తే వారిపై దాడులు చేసి, అసభ్యకరంగా ప్రవర్తిస్తారా? అని ప్రశ్నించారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని, బాధ్యుడైన కోదాడ సీఐ శివశంకర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మదలా ఉపేందర్ యాదవ్‌పై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరారు. అలాగే గంధం కనకమ్మకు చెందిన డబ్బా షాపును పునరుద్ధరించి, ఆమెకు తిరిగి జీవనోపాధి కల్పించడంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే హ్యూమన్ రైట్స్ కమిషన్, మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామని, హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్, లోడంగి గోవర్ధన్, మేకల కృష్ణయ్య యాదవ్, రవి యాదవ్, జటంగి వెంకట నరసయ్య యాదవ్, రేణుక యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వేదాద్రి కృష్ణానదిలో మధిర స్విమ్మర్స్ సందడి




**మధిర, ఆగస్టు 29, వుదయం :**

మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేదాద్రి కృష్ణానదిలో రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు వాసంశెట్టి జనార్ధన్‌రావు మధిర నుంచి వేదాద్రికి సైకిల్‌పై చేరుకోగా 30 మంది సభ్యులు బైక్ ర్యాలీగా వేదాద్రికి వెళ్లారు. అనంతరం కృష్ణానదిలో ఈత కొడుతూ ఆనందోత్సాహాలతో గడిపారు. అనంతరం వేదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహా రెడ్డి మాట్లాడుతూ స్విమ్మింగ్ శారీరక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ ఈతను అలవాటుగా చేసుకోవాలని సూచించారు., ఉల్లాసం పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలనునిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు, ఊటుకూరు భాస్కరరావు, కొలగాని శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి చుక్క రాంబాబు, లింగంపల్లి అప్పారావు, వేముల నవీన్, మహిళా స్విమ్మింగ్ సభ్యులు జంగా అరుణ, కొలగాని కళావతి, వెలివేల రాధిక, వాసంశెట్టి అనురాధ తదితరులు పాల్గొన్నారు. వేదాద్రికి వచ్చిన స్విమ్మర్స్‌కు వెలివేల శ్రీధర్, ఉట్ల వేణు, రావూరి రాము, కొలగాని ప్రసాద్‌రావు అల్పాహారం ఏర్పాటు చేశారు.

# చక్కని ఆరోగ్యం

## మొటిమల సమస్య వేధిస్తోందా?



కొంతమంది ముఖంపై ఎంత వెతికినా ఒక్క మొటిమైనా కనిపించదు. మేకప్ మాయాజాలం లేకుండానే న్యాచురల్ బ్యూటీస్‌గా కనిపించేస్తుంటారు. ఇలాంటి వాళ్లను చూడగానే.. అందం కోసం ఎన్నెన్ని సౌందర్య చికిత్సలు తీసుకుంటారో అని పిస్తుంటుంది. నిజానికి ఈ మహిమంతా చికిత్సలు, చిట్కాల్లో కాదు.. వారు పాటించే రోజువారీ అలవాట్లలో ఉంటుందంటున్నారు నిపుణులు.

సరిగా ముఖాన్ని శుభ్రం చేసుకోకపోవడం కూడా మొటిమలు రావడానికి ఓ కారణమే అంటున్నారు నిపుణులు. ప్రత్యేకించి చెమట పట్టినప్పుడు, రాత్రి పడుకునే ముందు తప్పనిసరిగా ముఖం శుభ్రం చేసుకోవాలంటున్నారు. ఫలితంగా ముఖంపై దుమ్ము, జిడ్డుదనం తొలగిపోయి చర్మ రంధ్రాలు మూసుకుపోవు.. తద్వారా మొటిమలూ ఏర్పడవు. అయితే ఈ క్రమంలో చర్మతత్వానికి సరిపడే ఫేస్‌వాష్‌ను ఎంచుకోవడమూ ముఖ్యమేనని చెబుతున్నారు.

టాయిలెట్ సీటు కంటే మొబైల్ స్క్రీన్ ఎక్కువ అపరిశుభ్రంగా ఉంటుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఫోన్ మాట్లాడే టప్పుడు, మొబైల్‌ను తాకిన చేతులతోనే ముఖాన్ని ముట్టుకోవడం వల్ల ఈ క్రిములు ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయట. ఈ సమస్య దరిచేరకుండా.. ఫోన్ స్క్రీన్‌ను ఎప్పటికప్పుడు శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు.

చేతుల్ని పదే పదే ముఖానికి తాకించే అలవాటు కొంతమందికి ఉంటుంది. ఫలితంగా చేతులకున్న క్రిములు, మురికి ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయట. అందుకే ముఖం కడుక్కునేటప్పుడు తప్ప అసలు చేతుల్ని ముఖానికి తాకించకుండా జాగ్రత్తపడమంటున్నారు నిపుణులు.

రోజూ వాడే క్రమంలో మన చర్మం, జుట్టు కుదుళ్లలో ఉన్న జిడ్డు దిండు కవర్ల పైకి చేరుతుంది. అది వాతావరణంలోని దుమ్మును ఆకర్షిస్తుంది. ఈ అపరిశుభ్రమైన దిండ్లనే ఎక్కువ రోజులు వాడడం, ఇతరులు వీటిని ఉపయోగించడం వల్ల ముఖంపై మొటిమలొస్తాయట. కాబట్టి వారానికోసారైనా దిండ్ల కవర్లను మార్చుకోవడం, ఎవరి దిండు వారే వాడుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

మొటిమల బాధ లేకుండా ఉండాలంటే.. రోజువారీ తీసుకునే ఆహారం విషయంలోనూ కచ్చితంగా వ్యవహరించాలట. ఈ క్రమంలో ఆరోగ్యకరమైన ఆహారానికి అధిక ప్రాధాన్యమివ్వాలి.

కొంతమందిలో అధిక బరువూ మొటిమల సమస్యకు దారి తీసే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. ఇలాంటి వారి శరీరంలో ఆండ్రోజెన్లు, ఇన్సులిన్ స్థాయులు ఎక్కువగా ఉంటాయట. ఇవి మొటిమలు రావడానికి కారణమవుతాయట. కాబట్టి బరువును అదుపులో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యమే కాదు.. అందం కూడా దరి చేరుతుందని చెబుతున్నారు నిపుణులు.

## జీరో క్యాలరీలు అని చెప్పి కృత్రిమ స్వీటెనర్లను అధికంగా ఉపయోగిస్తున్నారా.. అయితే జాగ్రత్త..



చక్కెరకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలుగా చాలామంది భావిస్తుంటారు. ముఖ్యంగా బరువు తగ్గాలని కోరుకునేవారు, మధుమేహం లేదా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవాలనుకునేవారు వీటిని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అయితే వీటిని దీర్ఘకాలం తీసుకోవడం వల్ల కలిగే ప్రభావాలపై తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనం కొన్ని కీలక విషయాలను వెల్లడించింది. కృత్రిమ స్వీటెనర్ల వినియోగం టైప్-2 మధుమేహం, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి సమస్యల ముప్పుతో సంబంధం కలిగి ఉంటుందని పరిశోధన సూచించింది. ఫ్రాంటియర్స్ ఆఫ్ న్యూట్రిషన్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ మెటా-విశ్లేషణలో అమెరికా, యూరప్, జపాన్‌కు చెందిన సుమారు 7.2 లక్షల మంది పెద్దల సమాచారాన్ని పరిశీలించారు. ఇందులో ఆరు వేర్వేరు అధ్యయనాల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించారు. ముఖ్యంగా కృత్రిమ స్వీటెనర్లను పదేళ్లకు పైగా తీసుకున్నవారిలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం 31 శాతం అధికంగా ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. కృత్రిమ స్వీటెనర్లను తక్కువ క్యాలరీలు కలిగిన చక్కెర ప్రత్యామ్నాయాలుగా ఉపయోగిస్తారు. ఇవి డైట్ డ్రింక్స్, షుగర్-ఫ్రీ పానీయాలు, ప్రాసెస్డ్ ఫుడ్స్, కొన్ని పాల ఉత్పత్తుల్లో కూడా ఉంటాయి. అందువల్ల తాము తీసుకునే ఆహారంలో కృత్రిమ స్వీటెనర్లు ఉన్నాయా లేదా తెలుసుకోవడానికి ఉత్పత్తుల లేబుళ్లను పరిశీలించడం అవసరం. మధుమేహం లేదా రక్తంలో చక్కెర స్థాయిలకు సంబంధించిన సమస్యలు ఉన్నవారు చక్కెర వినియోగాన్ని తగ్గించేందుకు కృత్రిమ స్వీటెనర్లను ఎంచుకుంటారు. అయితే వీటిని ఎక్కువ కాలం తీసుకోవడం వల్ల శరీరంలోని జీవక్రియపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై మరింత క్లినికల్ పరిశోధన అవసరమని నిపుణులు చెబుతున్నారు. కృత్రిమ స్వీటెనర్ల అధిక వినియోగం పేగుల్లోని సూక్ష్మజీవుల సమతుల్యతను ప్రభావితం చేస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గట్ మైక్రోబయోమ్‌లో మార్పులు చోటుచేసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. శరీరంలోని సాధారణ జీవక్రియ ప్రక్రియలకు కూడా అంతరాయం కలిగే అవకాశం ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. పేగుల్లోని మంచి బ్యాక్టీరియా వైవిధ్యం తగ్గడం వల్ల శరీరంలో స్వల్పస్థాయి వాపు లేదా ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. ఇది దీర్ఘకాలం కొనసాగితే క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీసి మధుమేహం, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి జీవనశైలి సంబంధిత వ్యాధుల ముప్పును పెంచే అవకాశం ఉంటుంది. కృత్రిమ స్వీటెనర్లు ఆకలి, ఆహారం తీసుకోవాలనే కోరికను నియంత్రించే శరీర వ్యవస్థలపై కూడా ప్రభావం చూపిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆకలి, శక్తి వినియోగాన్ని నియంత్రించడంలో ఘ్రెలిన్, లెప్టిన్ వంటి హార్మోన్లు కీలక పాత్ర పోషిస్తాయి. వీటి సంకేతాల్లో మార్పులు ఆహార ఎంపికలు, ఆకలి స్థాయిలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. మెటబాలిక్ సిండ్రోమ్ అంటే శరీరంలోని సాధారణ జీవక్రియ పనితీరులో ఏర్పడే సమస్య. ఇందులో రక్తంలో చక్కెర స్థాయిలు, నడుము చుట్టు కొలత, కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి అంశాలు ప్రభావితమవుతాయి. ఈ పరిస్థితి ఉన్నవారిలో టైప్-2 మధుమేహం, గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అయితే కృత్రిమ స్వీటెనర్లు నేరుగా మధుమేహానికి కారణమవుతాయని ఈ అధ్యయనం నిరూపించలేదు.

## బరువు తగ్గేందుకు ఎలాంటి ఆహారాలను తినాలి.. కేలరీలను లెక్కించాలా..

బరువు తగ్గేందుకు చాలా మంది కేలరీలను లెక్కించడం, ఆహారం పరిమాణాన్ని తగ్గించడం, ఆకలిని నియంత్రించడం వంటి పద్ధతులను అనుసరిస్తుంటారు. అయితే వీటికి భిన్నంగా ఆహారంలో ఎలాంటి పదార్థాలను ఎంచుకుంటున్నామన్నదే కీలకమని తాజా అధ్యయనం సూచిస్తోంది. తక్కువ కొవ్వు, పూర్తిగా మొక్కల ఆధారిత ఆహారం తీసుకోవడం ద్వారా కేలరీలను ప్రత్యేకంగా లెక్కించాల్సిన అవసరం లేకుండానే వాటి వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు బరువును నియంత్రించుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. 16 వారాల పాటు సాగిన క్లినికల్ ట్రయల్‌లో అధిక బరువు ఉన్న పెద్దలను పరిశీలించారు. ఇందులో ఒక వర్గానికి పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పుధాన్యాలపై ఆధారపడిన తక్కువ కొవ్వు శాకాహార ఆహారాన్ని అందించారు. మరో వర్గం తమ సాధారణ ఆహారపు అలవాట్లను కొనసాగించింది. ముఖ్యంగా ఏ వర్గానికీ కేలరీల పరిమితిని విధించలేదు. ఎంత ఆహారం తినాలో కూడా నిర్దేశించలేదు. అధ్యయనంలో తక్కువ కొవ్వు శాకాహార ఆహారం తీసుకున్నవారు రోజుకు సగటున 357 కేలరీలు తక్కువగా తీసుకున్నట్లు గుర్తించారు. అయినప్పటికీ వారు తినే ఆహారం మొత్తం బరువులో గణనీయమైన మార్పు కనిపించలేదు. అంటే ఆహారం పరిమాణం పెద్దగా తగ్గించకుండానే కేలరీల వినియోగం తగ్గింది. దీనికి ప్రధాన కారణం ఎనర్జీ డెన్సిటీ అని పరిశోధకులు పేర్కొన్నారు. అంటే ఒక గ్రాము ఆహారంలో ఎన్ని కేలరీలు ఉన్నాయన్నది. కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు వంటి మొక్కల ఆధారిత ఆహారాల్లో నీరు, ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల వాటిలో ప్రతి గ్రాముకు ఉండే కేలరీలు సాధారణంగా తక్కువగా ఉంటాయి. దీంతో కడుపు నిండేంత ఆహారం తీసుకున్నప్పటికీ మొత్తం కేలరీల వినియోగం తక్కువగా ఉంటుంది. అధ్యయనం ప్రకారం శాకాహార ఆహారం తీసుకున్నవారి ఆహారంలో ఎనర్జీ డెన్సిటీ సుమారు 30 శాతం తగ్గింది. ఎనర్జీ డెన్సిటీ ఎంత ఎక్కువగా తగ్గిందో, అంత ఎక్కువ బరువు తగ్గుదలతో సంబంధం ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. కేలరీల వినియోగంలో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా ఈ సంబంధం కొనసాగింది. శాకాహార ఆహారంలో మాంసం, పాల ఉత్పత్తులు, గుడ్లు వంటి అధిక కేలరీల సాంద్రత కలిగిన జంతు ఆధారిత ఆహారాలను తగ్గించి, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి తక్కువ కేలరీలు కలిగిన ఆహారాలను ఎక్కువగా తీసుకున్నారు. వీటిలో నీరు, ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల తక్కువ కేలరీలతోనే ఎక్కువ పరిమాణంలో ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. ఆహారంలోని ఎనర్జీ డెన్సిటీ మన ఆకలి, తృప్తిపై కూడా ప్రభావం చూపిస్తుంది. తక్కువ ఎనర్జీ డెన్సిటీ కలిగిన ఆహారాన్ని తీసుకున్నప్పుడు శరీరంలోని సహజమైన ఆకలి నియంత్రణ సంకేతాలు మనకు అనుకూలంగా పనిచేస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఫలితంగా కడుపు నిండిన భావన కలిగినప్పటికీ మొత్తం కేలరీల వినియోగం తగ్గుతుంది. బరువు తగ్గేందుకు సాధారణంగా చిన్న పరిమాణాల్లో తినాలని, కేలరీలను కచ్చితంగా లెక్కించాలని సూచిస్తుంటారు. అయితే ఈ అధ్యయనం ఆహారం పరిమాణాన్ని తగ్గించడం కంటే, ప్లేట్‌లో ఉండే ఆహారాల స్వభావాన్ని మార్చడం మరో మార్గంగా ఉంటుందని సూచిస్తోంది.



## ప్రీడయాబెటిస్ సమస్య ఉందా.. ఉదయం అల్పాహారం కీలకం..

ప్రీడయాబెటిస్ ఉన్నవారు ఉదయం తీసుకునే అల్పాహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. రోజును సరైన ఆహారంతో ప్రారంభించడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడమే కాకుండా, రోజంతా శక్తి స్థాయిలను స్థిరంగా ఉంచుకోవచ్చు. ముఖ్యంగా అధికంగా శుద్ధి చేసిన కార్బొహైడ్రేట్లకు బదులుగా ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాన్ని ఎంచుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదయం నిద్రలేచిన వెంటనే కొందరిలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీనిని డాన్ ఫినామినన్ గా పేర్కొంటారు. కార్టిసాల్, గ్రోత్ హార్మోన్ల ప్రభావంతో తెల్లవారుజామున సహజంగానే రక్తంలో చక్కెర పెరుగుతాయి. అందువల్ల ఉదయం తీసుకునే మొదటి భోజనం రోజంతా శరీరంలోని మెటబాలిక్ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉండే అల్పాహారం తీసుకోవడం వల్ల గ్లూకోజ్ స్థాయిలు స్థిరంగా ఉండటానికి, మధ్యాహ్నం సమయంలో శక్తి ఒక్కసారిగా తగ్గిపోకుండా ఉండటానికి సహాయపడుతుంది. ప్రీడయాబెటిస్‌లో శరీరంలోని కండరాలు, కొవ్వు కణజాలం, కాలేయంలోని కణాలు ఇన్సులిన్‌కు తక్కువగా స్పందిస్తాయి. ఫలితంగా రక్తంలోని గ్లూకోజ్‌ను నియంత్రించేందుకు ప్యాంక్రియాస్ ఎక్కువ ఇన్సులిన్‌ను విడుదల చేయాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో వైట్ బ్రెడ్, చక్కెర కలిపిన సిరియల్స్, ప్యాకెట్ జ్యూస్ వంటి శుద్ధి చేసిన కార్బొహైడ్రేట్లు అధికంగా ఉండే అల్పాహారం తీసుకుంటే రక్తంలో చక్కెర వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. దీనికి బదులుగా కాంప్లెక్స్ కార్బొహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన సమతుల్యమైన అల్పాహారం తీసుకోవడం మంచిది. ఇలాంటి ఆహారం జీర్ణక్రియను నెమ్మదింపజేసి గ్లూకోజ్ రక్తంలోకి నెమ్మదిగా విడుదలయ్యేలా చేస్తుంది. దీనివల్ల అల్పాహారం తర్వాత మాత్రమే కాకుండా, ఆ తర్వాత తీసుకునే భోజనాల సమయంలో కూడా రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడే సెకండ్ మీల్ ఎఫెక్ట్ ఏర్పడుతుంది. ప్రీడయాబెటిస్ ఉన్నవారు తమ అల్పాహారంలో మూడు ముఖ్యమైన అంశాలను చేర్చేలా చూసుకోవాలి. మొదటిది అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్. రోజువారీ అల్పాహారంలో సుమారు 20 నుంచి 30 గ్రాముల ప్రోటీన్ ఉండేలా చూసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. రెండోది కరిగే, పులియబెట్టే ఫైబర్. సుమారు 8 నుంచి 10 గ్రాముల ఫైబర్ కార్బొహైడ్రేట్ల శోషణను నెమ్మదింపజేయడంతోపాటు పేగుల్లోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాకు మద్దతు ఇస్తుంది. మూడోది ఆరోగ్యకరమైన మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు. ఇవి శరీర కణాలు ఇన్సులిన్‌కు స్పందించే విధానానికి సహాయపడతాయి. గుడ్లతో తయారు చేసిన కూరగాయల స్క్రాంబుల్ మంచి అల్పాహార ఎంపికగా ఉంటుంది. గుడ్లలో కార్బొహైడ్రేట్లు తక్కువగా ఉండటంతోపాటు నాణ్యమైన ప్రోటీన్, కోలిన్ వంటి పోషకాలు ఉంటాయి. రెండు గుడ్లను పాలకూర, టమాటాలు వంటి కూరగాయలతో కలిపి తీసుకోవచ్చు. దీనికి కొద్దిగా అవకాడో జోడించడం ద్వారా ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా లభిస్తాయి. అయితే పరిమాణాన్ని నియంత్రించడం ముఖ్యం.

ఇన్‌స్టంట్ ఓట్స్‌కు బదులుగా స్టీల్-కట్ ఓట్స్‌ను ఎంచుకోవచ్చు. వీటిలో సహజమైన ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా బీటా-గ్లూకాన్ అనే కరిగే ఫైబర్ గ్లూకోజ్ ప్రతిస్పందనను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఓట్స్‌కు ఒక టేబుల్‌స్పూన్ చియా గింజలు, కొద్దిగా దాల్చిన చెక్కను జోడించవచ్చు. చియా గింజల ద్వారా ఫైబర్, ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు లభిస్తాయి. చక్కెర కలపని గ్రీక్ యోగర్ట్ లేదా పెరుగు కూడా మంచి ఎంపిక.

## ప్రపంచంలో చాలా చోట్ల వ్యాప్తి చెందుతున్న హెచ్5ఎన్1 వైరస్..

ఇటీవల ప్రపంచంలో చాలా చోట్ల హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. సాధారణ జలుబు, ఫ్లూ లక్షణాల్లాగే ప్రారంభమయ్యే ఈ వైరస్ సంక్రమణ అరుదుగా మనుషులకు కూడా సోకే అవకాశం ఉంటుంది. అయితే మనుషుల మధ్య వ్యాప్తి చాలా అరుదుగా జరుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ వ్యాధి సోకిన పక్షులతో సన్నిహితంగా ఉండేవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రారంభ లక్షణాలను గుర్తించడం, ప్రమాదంలో ఉన్నవారు ఎవరో తెలుసుకోవడం, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఇన్ఫెక్షన్ ముప్పును తగ్గించుకోవచ్చు. హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ అంటే ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌లో ఒక రకం. ఇది ప్రధానంగా వ్యాధి సోకిన పక్షులు, కోళ్లు, వాటి విసర్జనలు లేదా లాలాజలంతో సన్నిహితంగా ఉండటం ద్వారా వ్యాపిస్తుంది. కలుషితమైన పరిసరాలు, పౌల్ట్రీ ఫారాలు, లైవ్ బర్డ్ మార్కెట్ల ద్వారా కూడా వైరస్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. అరుదైన సందర్భాల్లో మనుషులకు, ఇతర జంతువులకు కూడా ఈ వైరస్ సోకుతుంది. వైరస్ సోకిన పక్షులతో సన్నిహితంగా మెలిగిన తర్వాత హెచ్5ఎన్1 లక్షణాలు కనిపిస్తాయి. ప్రారంభ దశలో జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడం, నీరసం, తలనొప్పి, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి సాధారణ జలుబు లేదా ఫ్లూ లక్షణాలను పోలి ఉండడంతో వైరస్‌ను ప్రారంభంలో గుర్తించడం కొంత కష్టంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఇన్ఫెక్షన్ తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంటుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఊపిరి అందకపోవడం, ఛాతిలో నొప్పి, న్యుమోనియా, తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం తీసుకోవడం అవసరం. ముఖ్యంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తగ్గకుండా కొనసాగుతున్న అధిక జ్వరం లేదా శ్వాసకోశ లక్షణాలు మరింత తీవ్రమవుతుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. హెచ్5ఎన్1 ఇన్ఫెక్షన్ కొన్ని సందర్భాల్లో వేగంగా తీవ్రతరం అవుతుందని ఆరోగ్య అధికారులు హెచ్చరిస్తున్నారు. పక్షులతో నిత్యం సన్నిహితంగా పనిచేసే వారికి హెచ్5ఎన్1 ముప్పు ఎక్కువగా ఉంటుంది. పౌల్ట్రీ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, పశువైద్యులు, లైవ్ బర్డ్ మార్కెట్‌లో పనిచేసేవారు, జంతు సంరక్షణ సిబ్బంది, అనారోగ్యంతో ఉన్న లేదా చనిపోయిన పక్షులను నిర్వహించే వ్యక్తులు ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు కూడా మరింత అప్రమత్తంగా ఉండాలి.




## ఒకే రకమైన నొప్పిని వ్యక్తులు వేర్వేరుగా అనుభవిస్తారు



ఒకే రకమైన గాయం ఇద్దరికి అయినప్పటికీ.. ఒకరికి తీవ్రమైన నొప్పి అనిపిస్తే, మరొకరు అదే గాయాన్ని తక్కువ నొప్పితోనే భరిస్తారు. అలాగే ఒకరు త్వరగా కోలుకుంటే, మరొకరికి పూర్తిగా కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. గాయం తీవ్రత ఒక్కటే నొప్పిని, కోలుకునే వేగాన్ని నిర్ణయించదని నిపుణులు చెబుతున్నారు. మెదడు, నరాలు, జన్యువులు, వయసు, ఆరోగ్య పరిస్థితులు, ఒత్తిడి, చికిత్స, పునరావాసం వంటి అనేక అంశాలు నొప్పి అనుభూతిని, రికవరీని ప్రభావితం చేస్తాయి. శరీరంలోని కణజాలం దెబ్బతిన్నప్పుడు నొప్పిని గుర్తించే ప్రత్యేక నరాల చివరలు స్పందిస్తాయి. వేడి, ఒత్తిడి లేదా కణజాలానికి జరిగిన నష్టం వంటి ప్రమాదకరమైన ఉద్దీపనలను ఇవి గుర్తించి, పరిధీయ నరాలు, వెన్నుపాము ద్వారా మెదడుకు సంకేతాలను పంపిస్తాయి. ఆ సంకేతాలను మెదడు విశ్లేషించి నొప్పిగా అనుభూతి చెందేలా చేస్తుంది. అయితే ఈ నొప్పి తీవ్రత కేవలం గాయం ఎంత పెద్దదన్నదానిపైనే ఆధారపడదు. జన్యువులు, వయసు, ఆరోగ్య పరిస్థితులు, ఒత్తిడి, భయం, గత అనుభవాలు, అంచనాలు, సామాజిక మద్దతు వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. నొప్పి అనేది కేవలం శరీరంలో కణజాలం దెబ్బతిన్నదానికి కొలమానం కాదు. ఇది శారీరక, మానసిక, సామాజిక అంశాల కలయికతో ఏర్పడే వ్యక్తిగత అనుభవం. అందుకే ఒకే రకమైన గాయం ఉన్న ఇద్దరు వ్యక్తులు పూర్తిగా భిన్నమైన స్థాయిలో నొప్పిని అనుభవిస్తారు. నొప్పి ప్రధానంగా వివిధ విధానాల్లో కనిపిస్తుంది. కణజాలం దెబ్బతినడం లేదా వాపు కారణంగా వచ్చే నొప్పిని నోసిసెప్టివ్ పెయిన్ అంటారు. నరాల వ్యవస్థకు నష్టం కలిగినప్పుడు వచ్చే నొప్పిని న్యూరోపాథిక్ పెయిన్ అంటారు. స్పష్టమైన కణజాల లేదా నరాల నష్టం లేకపోయినా నొప్పిని ప్రాసెస్ చేసే విధానంలో మార్పుల వల్ల కలిగే నొప్పిని నోసిప్లాస్టిక్ పెయిన్‌గా పేర్కొంటారు. నొప్పిని ఎంత తీవ్రంగా అనుభవిస్తామన్నదానిలో నాడీ వ్యవస్థ, జన్యువులు కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. నొప్పి సంకేతాలను నియంత్రించే అనేక రసాయనాలు, రిసెప్టర్లు, నాడీ మార్గాలు శరీరంలో ఉంటాయి. వీటి స్పందనలో వ్యక్తుల మధ్య జన్యుపరమైన తేడాలు ఉంటాయి. నరాల చివరల సున్నితత్వం, హార్మోన్లు, శరీరంలోని వివిధ రసాయనాల ప్రభావం మారడం వల్ల కూడా ఒకే గాయానికి ఇద్దరు వ్యక్తులు భిన్నంగా స్పందిస్తారు. వయసు, ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలు కూడా నొప్పి, రికవరీపై ప్రభావం చూపుతాయి. మధుమేహం, ఆస్టియోపోరోసిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు గాయానికి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులతో పోలిస్తే భిన్నంగా స్పందిస్తారు. ముఖ్యంగా మధుమేహం కారణంగా ఎక్కువకాలం రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉంటే పరిధీయ నరాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. దీనివల్ల నొప్పి, తిమ్మిరి, జలదరింపు లేదా స్పర్శ, వేడి, నొప్పిని గుర్తించే సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. నొప్పి తక్కువగా ఉందని గాయం కూడా చిన్నదే అని భావించడం సరికాదు. నరాల స్పందన తగ్గిపోయిన వ్యక్తికి తీవ్రమైన గాయం అయినప్పటికీ పెద్దగా నొప్పి అనిపించదు. మరోవైపు బయటకు కనిపించే గాయం చిన్నదిగా ఉన్నప్పటికీ కొంతమందికి తీవ్రమైన నొప్పి ఉంటుంది. ఒకేలా కనిపించే రెండు గాయాల వల్ల శరీరం లోపల జరిగే నష్టం కూడా వేర్వేరుగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సూక్ష్మస్థాయిలో జరిగిన నష్టం వెంటనే సాధారణ పరీక్షల్లో కనిపించదు. రక్తనాళాలకు నష్టం, శరీరంలోని కొన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా తగ్గడం, అంతర్గత రక్తస్రావం లేదా అధిక రక్తనష్టం వంటి అంశాలు గాయం తర్వాత పరిస్థితి ఎలా మారుతుందన్నదానిపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా తలకు గాయం అయినప్పుడు బయటకు కనిపించే గాయం తీవ్రతను బట్టి లోపల పరిస్థితిని అంచనా వేయడం సాధ్యం కాదు.

తలకు గాయం అయినప్పుడు నొప్పి ఎంత ఉందన్నదాని కంటే వైద్య సహాయం ఎంత త్వరగా అందిందన్నది కూడా చాలా ముఖ్యం. మెదడు గాయాల్లో రక్తస్రావం, వాపు, గాయాలు లేదా మెదడు పనితీరును ప్రభావితం చేసే ఇతర మార్పులు సంభవిస్తాయి. కొన్ని లక్షణాలు వెంటనే కనిపించవు. లేదా కొంత సమయం తర్వాత మరింత స్పష్టంగా మారుతాయి. అందువల్ల తలకు గాయం అయిన తర్వాత పరిస్థితిని నిర్లక్ష్యం చేయకుండా అవసరమైతే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలి. గాయం స్వభావం, తీవ్రతను బట్టి చికిత్స మారుతుంది. కొన్ని మెదడు గాయాల్లో రక్తస్రావం లేదా మెదడుపై ఒత్తిడి పెరగడం వంటి పరిస్థితులు ఉంటే అత్యవసర చికిత్స లేదా శస్త్రచికిత్స అవసరం అవుతుంది. ముఖ్యంగా తీవ్రమైన తల గాయాల్లో చికిత్స ఆలస్యం కాకుండా చూడటం కీలకం. సమయానికి వైద్య సహాయం, సరైన చికిత్స, పునరావాసం రికవరీపై ప్రభావం చూపుతాయి. నొప్పి అనుభూతిలో ఒత్తిడి, భయం, మానసిక స్థితి కూడా పాత్ర పోషిస్తాయి. ఒక వ్యక్తి గాయం గురించి ఎంత భయపడుతున్నాడు, గతంలో అలాంటి నొప్పిని ఎలా అనుభవించాడు, ప్రస్తుతం ఎంత ఒత్తిడిలో ఉన్నాడు, గాయం తర్వాత ఏం జరుగుతుందనే అంచనాలు ఎలా ఉన్నాయి వంటి అంశాలు నొప్పి అనుభూతిని ప్రభావితం చేస్తాయి. అయితే దీని అర్థం నొప్పి కేవలం మనసులోనే ఉందని కాదు. నొప్పిని గుర్తించడం, నియంత్రించడం, అనుభవించడం వంటి ప్రక్రియల్లో మెదడు కీలక పాత్ర పోషిస్తుంది. మానసిక పరిస్థితి చికిత్స, ఫిజియోథెరపీ, మందుల వినియోగం, పునరావాస కార్యక్రమాలను వ్యక్తి ఎంతవరకు పాటిస్తాడన్నదానిపైనా ప్రభావం చూపిస్తాయి. ఎక్కువకాలం కొనసాగే గాయాల నుంచి కోలుకునే సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి లభించే సామాజిక మద్దతు కూడా ముఖ్యమైనదిగా మారుతుంది.



## ల్యాప్‌టాప్ కొనుగోలులో ప్రాసెసర్‌కే ప్రాధాన్యం!



ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌ల కొనుగోలుదారుల ఆలోచనా విధానంలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. బ్రాండ్ పేరు కంటే సాంకేతిక ఫీచర్లు, సామర్థ్యానికే వినియోగదారులు పెద్దపీట వేస్తున్నారని ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ నిర్వహించిన బెస్ట్ ఇన్ టెక్ సర్వేలో తేలింది. దాదాపు 40,000 మంది వినియోగదారుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. దీని ప్రకారం.. ల్యాప్‌టాప్ కొనుగోలుదారుల్లో అత్యధికంగా 87% మంది ప్రాసెసర్ పనితీరు ఆధారంగానే తుది నిర్ణయం తీసుకుంటున్నారు. ట్యాబ్లెట్ విషయానికొస్తే.. స్క్రీన్ పరిమాణం, డిస్‌ప్లే నాణ్యతకే 74% మంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ట్యాబ్లెట్ విషయంలో ధర (12%), ప్రాసెసర్ (9%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.




# ఓటింగ్‌లో పాల్గొన్నవి సుభాష్ చంద్ర అనుబంధ కంపెనీలే!




ఎస్సెల్‌గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్‌చంద్ర వ్యక్తిగత దివాలా ప్రక్రియపై వివాదం కొనసాగుతోంది. రూ.22,006 కోట్ల క్లెయిమ్‌నకు గానూ రూ.6.5 కోట్లు మాత్రమే చెల్లించేందుకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (NCLT) అనుమతించడంపై రుణాలు ఇచ్చిన బ్యాంకులు గుర్రుమంటున్నాయి. రుణ పరిష్కార ప్రణాళికకు ఆమోదం తెలిపిన క్రెడిటర్లకు సుభాష్ కుటుంబంతో సంబంధం ఉందని ఆరోపిస్తున్నాయి.

సుభాష్ చంద్రపై దాఖలైన వ్యక్తిగత దివాలా ప్రక్రియలో భాగంగా క్రెడిటర్లంతా కలిసి రూ.22,006.57 కోట్లు క్లెయిమ్ చేయగా.. కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే పరిష్కార ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళికకు 80.81 శాతం క్రెడిటర్ల నుంచి ఆమోదం లభించడం గమనార్హం. అయితే, ఇందులో సుభాష్ చంద్ర కుటుంబంతో సంబంధం ఉన్న 5 సంస్థలు రుణదాతల కమిటీలో 61.78 శాతం ఓటింగ్ వాటాను కలిగి ఉన్నాయని, ఈ ప్రణాళిక ఆమోదించడంలో కీలక పాత్ర పోషించాయని బ్యాంకులు ఆరోపిస్తున్నాయి.

వీణా ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, డైరెక్ట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, వరల్డ్ క్రెస్ట్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ, లెమనేడ్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ, కార్ప్‌కాల్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఎల్ఎల్‌పీ కంపెనీలకు అధిక ఓటింగ్ వాటా ఉండడంతో ఇదీ సాధ్యమైందని బ్యాంకులు పేర్కొంటున్నాయి. వీణా ఇన్వెస్ట్‌మెంట్స్ అనేది సుభాష్ చంద్ర సుభాష్ చంద్ర సోదరుడి భార్య సుశీలాదేవి గోయల్ నిర్వహిస్తున్నారని; అలాగే, డైరెక్ట్‌మీడియా, వెంచర్స్, వరల్డ్ క్రెస్ట్ కూడా వాటి అనుబంధ సంస్థలని పేర్కొంటున్నాయి. దివాలా ప్రక్రియ నిబంధనల ప్రకారం అనుబంధ సంస్థలకు ఓటింగ్ హక్కులు ఉండకూడదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ ట్రస్టీషిప్ సర్వీసెస్ వాదించాయి. దీనిపై ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో కేసు మూడో సభ్యుడైన నీలేష్ శర్మ వద్దకు చేరింది. అయితే, రుణగ్రహీతకు ప్రత్యక్షంగా 51 శాతం కంటే ఎక్కువ వాటా లేదా బోర్డు నియంత్రణ ఉంటేనే అనుబంధ సంస్థగా పరిగణించవచ్చని పేర్కొంటూ బ్యాంకుల అభ్యంతరాలను తిరస్కరించి, పరిష్కార ప్రణాళికకు ఆయన ఆమోదం తెలిపారు.

రుణంలో మొత్తం 3.2 శాతం వాటా కలిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎన్‌సీఎల్‌టీ ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళతామని పేర్కొంది. ప్రభుత్వరంగ బ్యాంకులైన కెనరా బ్యాంక్ (1.60%), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (0.76%), ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ (6.09%) కూడా ఈ ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తాము కూడా అప్పీల్‌కు వెళతామని ప్రకటించాయి.

# ఈ వారమూ ఐపీఓల సందడి..




ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారమూ ఐపీఓల సందడి కొనసాగనుంది. మెయిన్‌బోర్డు, ఎస్ఎంఈ కేటగిరీలో మొత్తం ఏడు కంపెనీలు సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. దీంతో పాటు ఎనిమిది మెయిన్‌బోర్డు ఐపీఓలు స్టాక్ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఆ వివరాలు చూసేద్దాం..

పర్పుల్ స్టైల్ ల్యాబ్స్ ఐపీఓ ఆగస్టు 31న సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. సెప్టెంబర్ 2న ముగియనుంది. పూర్తి ఫ్రెష్ ఇష్యూ రూపంలో రూ.680 కోట్లు కంపెనీ సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.546–రూ.575గా నిర్ణయించింది.

రేస్ ఆఫ్ బిలీఫ్ ఐపీఓ సెప్టెంబర్ 1న ప్రారంభమై 3న ముగియనుంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.125 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.227–రూ.239గా నిర్ణయించింది.

దీపా జువెలర్స్ ఐపీఓ సెప్టెంబర్ 1న ప్రారంభమై 3న ముగుస్తుంది. మొత్తం రూ.459.72 కోట్లు సమీకరించనుంది. ఫ్రెష్ ఇష్యూ, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిధుల సమీకరణ జరగనుంది. ధరల శ్రేణిని రూ.168– 177గా కంపెనీ నిర్ణయించింది.

ఎస్ఎంఈ కేటగిరీలో: అశుతోష్ ఫైబర్ ఐపీఓ (రూ.56.35 కోట్లు) శాంతి ఇనార్గానిక్స్ (రూ.47.24 కోట్లు), ఫైకెమ్ టెక్నాలజీస్ (రూ.14.58 కోట్లు) ఐపీఓలు ఆగస్టు 31న సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. ఫార్మ్‌పీస్ ఐపీఓ సెప్టెంబర్ 1న ప్రారంభం కానుంది. రూ.32 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనుంది. లిస్టింగ్‌లు ఇవీ: మెయిన్‌బోర్డు కేటగిరీలో అగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్, హై-టెక్ ఇంజినీర్స్ లిమిటెడ్, స్కైవేస్ ఎయిర్‌సర్వీసెస్, సింబియోటెక్ ఫార్మాలాబ్, అన్ను ప్రాజెక్ట్స్, లుమినో ఇండస్ట్రీస్, ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ప్రయారిటీ జువెల్స్ ఈ వారం లిస్ట్ కానున్న కంపెనీల జాబితాలో ఉన్నాయి.

# ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులకు మద్దతిస్తాం: టెమాసెక్




ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టుబడులకు తాము మద్దతు ఇస్తామని సింగపూర్ ప్రభుత్వ వెల్త్‌ఫండ్ అయిన టెమాసెక్ తెలిపింది. నష్టాల్లో ఉన్న ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ పెట్టిన పెట్టుబడులపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో టెమాసెక్ పై ప్రకటన చేసింది. ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉండగా.. మిగిలిన వాటా టాటా సన్స్ వద్ద ఉంది. 2022 జనవరిలో భారత ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా సన్స్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో టెమాసెక్ వాటాదారుగా ఉంది. టాటా సన్స్ గ్రూపు భారీ స్థాయిలో చేపడుతున్న ఎయిరిండియా నవీకరణ ప్రక్రియ సంక్లిష్టమైనదే కాకుండా, పలు సంవత్సరాలు కొనసాగుతుందని, అనుసంధానపరంగా సవాళ్లు ఉంటాయని టెమాసెక్ అభిప్రాయపడింది. 'ముఖ్యంగా విమానయాన రంగంలో ఇలాంటి ప్రక్రియకు సమయం పడుతుంది. గగనతల ఆంక్షలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, ఇంధన ధరల్లో అస్థిరత లాంటి పలు బాహ్య అంశాలపై ఇది ఆధారపడి ఉండటమే ఇందుకు కారణమ'ని తెలిపింది. సింగపూర్ బయట దీర్ఘకాలిక వృద్ధిని సాధించేందుకు, రెండో హబ్‌గా భావిస్తున్న భారత్‌లో పెట్టుబడులు పెట్టడాన్ని కొనసాగిస్తామనే విషయాన్ని సింగపూర్ ఎయిర్‌లైన్స్ స్పష్టం చేసినట్లు వెల్లడించింది. అమెరికా, చైనా తర్వాత ప్రపంచంలో మూడో అతిపెద్ద విమాన రవాణా మార్కెట్‌గా ఉన్న భారత్ తమకు రెండో ప్రధాన కేంద్రంగా సేవలు అందించే స్థితిలో ఉందని తెలిపింది. '2013 నుంచి విస్తారా ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తూ.. చాలా కాలంగా భారత విపణితో సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంబంధాన్ని కలిగి ఉంది. భారత విమానయాన రంగ వృద్ధిలో తన భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేందుకు ఎయిరిండియాలో పెట్టుబడి ఆ సంస్థకు ఉపయోగపడుతుంద'ని టెమాసెక్ వివరించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో వాటాదారుగా తాము ఆ సంస్థ వ్యాపార నిర్ణయాన్ని దీర్ఘకాలిక దృక్పథంతో చూస్తామని, దానికి మద్దతు కూడా తెలుపుతామని తెలిపింది.

# త్వరలో అంతర్జాతీయ మార్కెట్లోకి లలితా జువెలరీ



తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) పూర్తి చేసుకున్న ఆభరణాల విక్రయ సంస్థ లలితా జువెలరీ మార్ట్ లిమిటెడ్ వ్యాపార విస్తరణపై పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతోందని సంస్థ సీఎండీ ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. శనివారమిక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల్లో రిటెయిల్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించడంతోపాటు, అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశం చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం తమకు 64 షోరూములున్నాయని, వీటికి అదనంగా మరో 110 కేంద్రాలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. 2027 మార్చి నాటికి కనీసం 10 స్టోర్లకు పైగా ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. దక్షిణాదిలో 175 షోరూములకు చేరుకోగానే ఉత్తర భారత్‌కు విస్తరిస్తామని వెల్లడించారు. ఇందులో తొలుత మహారాష్ట్ర, ఆ తర్వాత ఉత్తరప్రదేశ్, ఢిల్లీ మార్కెట్లు ఉంటాయన్నారు.

మలేషియా, సింగపూర్‌లో...: వచ్చే 2–3 నెలల్లో మలేషియాలో షోరూమును ప్రారంభించబోతున్నట్లు కిరణ్ కుమార్ వెల్లడించారు. ఆ తర్వాత సింగపూర్ మార్కెట్లోకి అడుగు పెడతామని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఉన్న భారతీయ, ఆసియా వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలను, అత్యుత్తమ ధరకే అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

విక్రయాలు పెంచుకుంటూ...: అధిక లాభాలు ఆశించకుండా, తక్కువ లాభంతో ఎక్కువ విక్రయాలు సాధించడమే సంస్థ ప్రధాన వ్యూహమని ఆయన వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 58 షోరూముల ద్వారా రూ.25,000 కోట్ల మొత్తం ఆదాయం, రూ.1,000 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో స్టోర్ల సంఖ్య పెరిగిన కొద్దీ విక్రయాల విలువ మరింత వృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమకు 9 లేదా 14 క్యారెట్ల బంగారం విక్రయించే ఆలోచన లేదని ఆయన స్పష్టం చేశారు. 22 క్యారెట్ల పసిడి ఆభరణాలనే విక్రయిస్తామన్నారు. తమ వద్దకు వస్తున్నవారిలో 60% పాత బంగారం మార్పిడి చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

పసిడి ధరలపై...: 'నేను వ్యాపారం మొదలుపెట్టినప్పుడు గ్రాము రూ.280 ఉండేది. కరోనా సమయంలో కిలో బంగారం రూ.48 లక్షలకు చేరింది. ఇప్పుడు దాదాపు రూ.1.63 కోట్ల దరిదాపుల్లో ఉంది. బంగారం ధర ఎప్పుడూ వృద్ధి దశలోనే ఉంటుంది. కాబట్టి, పసిడిని అత్యంత సురక్షితమైన సాధనంగా చూడాల'ని ఆయన సూచించారు.




## మహిళల హాకీ ప్రపంచకప్ విజేత అర్జెంటీనా




మహిళల హాకీ ప్రపంచకప్‌లో అర్జెంటీనా విజేతగా నిలిచింది. శనివారం జరిగిన తుది పోరులో ఆ జట్టు షూటౌట్లో 3–1తో ఆతిథ్య నెదర్లాండ్స్‌ను ఓడించింది. నిర్ణీత సమయానికి రెండు జట్లూ 1–1తో సమంగా నిలిచాయి. యిబీ జాన్సన్ (30వ నిమిషం) గోల్ కొట్టి నెదర్లాండ్స్‌కు ఆధిక్యాన్ని అందించింది. మరో ఆరు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా పెనాల్టీ కార్నర్‌ను మారియో గ్రానాటో (54వ నిమిషం) గోల్‌గా మలిచి స్కోరు సమం చేసింది. షూటౌట్లో నెదర్లాండ్స్ జట్టులో మారీన్ గోల్ కొట్టగా.. సాండర్స్, ఫెలిస్ విఫలమయ్యారు. అర్జెంటీనా జట్టులో విక్టోరియా గ్రానాటో, బ్రిసా, సోఫియా కైరో గోల్స్ కొట్టి జట్టును విజయపథంలో నడిపించారు. అర్జెంటీనా మహిళల జట్టుకు ఇది మూడో ప్రపంచ కప్. గతంలోనూ నెదర్లాండ్స్‌పైనే (2002, 2010) నెగ్గి ఆ జట్టు ట్రోఫీ కైవసం చేసుకోవడం విశేషం. 2022 ప్రపంచకప్‌లోనూ నెదర్లాండ్స్‌తో అర్జెంటీనా ఫైనల్ ఆడినా.. డచ్ జట్టుదే పైచేయిగా నిలిచింది. ప్రస్తుత టోర్నీలో మూడో స్థానం కోసం జరిగిన పోరులో బెల్జియం 1–0తో ఆస్ట్రేలియాను ఓడించింది.

# నోబాల్ వేస్తే.. ఆ ఇద్దరికీ ఫైన్ వేయండి: సునీల్ గావస్కర్

శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఎక్కువగా నోబాల్స్ సంధించాడు. 2021 నుంచి ఇప్పటి వరకు దాదాపు 85 నో బాల్స్ విసరడం గమనార్హం. ఇటీవలే అరంగేట్రం చేసిన సారాంశ్ జైన్ కూడా కొన్నిసార్లు పాదాన్ని క్రీజ్ బయట పెట్టాడు. ఇదే విషయంపై స్పిన్ కోచ్ సాయిరాజ్ బహుతులే 'టెస్టుల్లోనూ నో బాల్ వేస్తే ఫ్రీహిట్ దానిని గణించడం జరుగుతుంది. అలాంటప్పుడు బౌలింగ్ క్రీజ్‌ను ఎందుకు దాటాలి. ఈ తప్పిదాలు క్షమించరానివి'' అని గావస్కర్ వ్యాఖ్యానించారు.

''భారత స్పిన్ బౌలింగ్ కోచ్ సరదాగా ఆ వ్యాఖ్యలు చేశాడు. నో బాల్ వేసిన తర్వాత ఫ్రీ హిట్ అంటే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఉంటుంది. టెస్టులనూ ఆ దారిలోకి తీసుకెళ్లొద్దు.



ఇస్తే బాగుంటుంది' అని సరదాగా వ్యాఖ్యానించాడు. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఓ కీలక సూచన చేశారు. ఇలా పదేపదే నోబాల్స్ విసిరిన బౌలర్లపై చర్యలు తీసుకోవాలని.. అదే సమయంలో బౌలింగ్ కోచ్‌నూ బాధ్యుడిని చేయాలని స్పష్టం చేశారు.

'ఇటీవల నో బాల్స్‌ను వేయడంపై చర్చ సాగుతోంది. ఇది అత్యంత కీలక విషయమని గుర్తించాలి. మ్యాచ్ స్వరూపాన్నే మార్చేయగలదు. ఆటగాళ్లు కొన్నింటిని కంట్రోల్ చేయగలరు. బ్యాటర్ అయితే గార్డ్‌ను తీసుకోవడం.. అదే బౌలర్‌గా నో బాల్స్ వేయకుండా ఉండటం. ఇప్పుడున్న కాలంలో ప్రతి ఇలా చేయడం వల్ల పరుగులు రాబట్టడం బ్యాటర్లకు తేలికగా మారుతుంది. అలా కాకుండా.. ప్రతి నో బాల్‌కు బౌలర్‌కు జరిమానా విధించాలి. ఆ సంఖ్య పెరుగుతూ ఉంటే రెట్టింపు చేయాలి. అదే సమయంలో సగం జరిమానాను బౌలింగ్ కోచ్‌కూ విధించాలి. ఆ నిధులను జట్టు డిన్నర్ కోసం కేటాయించాలి. ఇతర అంశాల్లోనూ ఫైన్‌లు వేయాలి. ఫీల్డింగ్ సరిగా చేయకపోయినా కూడా విధించాలి. అందుకోసం ఓటింగ్ పెట్టాలి. ఇలాంటివి జట్టులో ఫన్‌ను తీసుకొస్తాయి. ఆటగాళ్ల మధ్య సఖ్యత పెంచుతాయి'' అని గావస్కర్ సూచించారు.

# 'ఆ విషయంపై మాట్లాడొద్దు'.. పాక్ క్రికెటర్లకు పీసీబీ సూచన




మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలుశిక్ష విషయంపై పాకిస్థానీ క్రికెటర్లు ఎలాంటి వ్యాఖ్యలూ చేయొద్దని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సూచించింది. పాక్ జట్టు ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ఆడుతోంది. ఇమ్రాన్ వ్యవహారంపై పాక్ క్రికెటర్లు స్పందించేలా బ్రిటిష్ మీడియా ప్రయత్నించిన నేపథ్యంలో పీసీబీ ఈమేరకు సూచన చేసింది. ఇమ్రాన్ ఖాన్ మూడేళ్లుగా జైలులో నరకం అనుభవిస్తున్నారని ఆయన కుమారులు ఇటీవల ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైక్ అథర్టన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆరోపించిన వేళ ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇమ్రాన్ కుమారుల ఇంటర్వ్యూను ఆటగాళ్లు చూశారా? అని పాక్ ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను విలేకరులు అడిగారు. ఆటగాళ్లు భోజనం చేస్తూ ఉండటంతో దానిని చూడలేదని సర్ఫరాజ్ మీడియాతో అన్నాడు.

మరోవైపు, రావల్పిండి జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం కూడా క్షీణించినట్లు అంతకుముందు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ మాజీ కెప్టెన్ అయిన ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై క్రికెట్ ప్రపంచం కూడా స్పందించింది. ఇమ్రాన్ ఖాన్‌కు మెరుగైన వైద్యం అందించాలని సునీల్ గావస్కర్, గ్రెగ్ ఛాపెల్‌తో సహా దాదాపు 21 మంది మాజీ కెప్టెన్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు లేఖ రాశారు. ఆస్ట్రేలియా క్రికెటర్ ప్యాట్ కమిన్స్ కూడా తన మద్దతును తెలియజేశాడు.

# తొలి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ.. శ్రీలంకకు ఐసీసీ బిగ్ షాక్!

మహిళా క్రికెట్‌లో తొలి సారి ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించేందుకు ఐసీసీ సన్నద్ధమవుతోంది. వచ్చే ఏడాది ఈ ట్రోఫీ ఉండనుంది. ఇందులో ఆరు జట్లు తలపడతాయి. శ్రీలంక క్రికెట్ బోర్డు ఆతిథ్యంలో ఈ టోర్నీ జరుగుతుందని తొలుత వార్తలు వచ్చాయి. కానీ, ఇప్పుడు ఐసీసీ తన నిర్ణయాన్ని మార్చుకోనుందని తెలుస్తోంది. కొత్త వేదికను వచ్చే ఐసీసీ బోర్డు సమావేశంలో నిర్ణయించే అవకాశం ఉంది. ''అవును.. శ్రీలంక ఆతిథ్య హక్కులను కోల్పోయినట్లే. మరో వేదికగా మ్యాచులు జరిగే అవకాశం ఉంది. ఎక్కడ అనేది మాత్రం చెప్పలేను'' అని శ్రీలంక బోర్డు తాత్కాలిక కమిటీకార్యదర్శి ప్రకాశ్ షఫ్టెర్ తెలిపారు. శ్రీలంక బోర్డును ప్రభుత్వం నియమించిన తాత్కాలిక అడ్మినిస్ట్రేషన్ నడిపిస్తోంది. ఐసీసీ నిబంధనల ప్రకారం.. సభ్య దేశాల పాలక మండలిలో ప్రభుత్వాల జోక్యం ఉండకూడదు. దీంతో ఐసీసీ బోర్డు సమావేశాల్లోనూ శ్రీలంక ప్రతినిధులకు అనుమతి లేదు.వెంటనే ఎన్నికలు నిర్వహించాలని శ్రీలంకకు ఐసీసీ సూచించింది. ఇప్పటికే శ్రీలంక క్రీడా శాఖకు తాత్కాలిక కమిటీ రాజ్యాంగ ముసాయిదాను సమర్పించింది.




# కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ.. నాయకత్వ బాధ్యతల్లోకి యువ సంచలనం



టీమ్ఇండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అప్పుడే కెప్టెన్ అయిపోయాడు. అదీనూ ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీలో హేమాహేమీ ఆటగాళ్లు ఉన్న ఈస్ట్ జోన్ జట్టుకు నాయకత్వం బాధ్యతలను స్వీకరించాడు. అదేంటి ఇషాన్ కిషన్‌కు అతడిని డిప్యూటీగా చేశారు కదా.. అనే సందేహం రాకమానదు. అవునండి.. సూర్యవంశీ వైస్ కెప్టెనే. కాకపోతే సెంట్రల్ జోన్‌తో జరుగుతోన్న సెమీస్‌లో ఇషాన్‌కు గాయమైంది. దీంతో అతడు మైదానం వీడాడు. మరి జట్టును నడిపించే బాధ్యతలు ఎవరికి వస్తాయి? ఆటోమేటిక్‌గా ఉప సారథి కేగా. అలా ఈస్ట్‌జోన్ కెప్టెన్‌గా వైభవ్ విధులు నిర్వర్తిస్తున్నాడన్నమాట.

ఈస్ట్‌జోన్ జట్టులో సీనియర్ పేసర్ మహ్మద్ షమీతోపాటు ముకేశ్ కుమార్, అభిమన్యు ఈశ్వరన్, కుమార్ కుషాంగ్రా, అనుకుల్ రాయ్ వంటి ఆటగాళ్లను వైభవ్ ముందుండి నడిపిస్తున్నాడు. టాస్ గెలిచిన ఈస్ట్ జోన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కాసేటికే ఇషాన్ గాయంతో మైదానం వీడాడు. అయితే, షమీ పదునైనా బౌలింగ్‌తో ఆకట్టుకోగా.. అభిజిత్ సర్కార్ 2, ముకేశ్ కుమార్ ఒక వికెట్ తీశారు. అనుకుల్ రాయ్ కూడా పొదుపుగా బౌలింగ్ చేస్తున్నాడు. ప్రస్తుతం తొలి రోజు లంచ్ బ్రేక్ సమయానికి సెంట్రల్ జోన్ 32 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది.

# వుదయం సినిమా


# "సమ్మర్ హాలిడేస్" 'స్కూల్ సాంగ్' లాంచ్ ఈవెంట్

**వుదయం సినిమా:** కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో ఈ సినిమాలోని 'స్కూల్ సాంగ్..' రిలీజ్ చేశారు. సందడిగా సాగిన ఈ కార్యక్రమంలో కొరియోగ్రాఫర్ ఆట సందీప్ మాట్లాడుతూ – 'స్కూల్ సాంగ్..' కు డ్యాన్స్ కంపోజ్ చేయడాన్ని ఎంజాయ్ చేశాను. ఈ పాటకు కొరియోగ్రాఫ్ చేసే ముందు డైరెక్టర్ శ్రీకర్ ఈ పాట ముందు వెనక ఉండే సీన్స్ చూపించాడు. ఆ బ్యూటిఫుల్ సీన్స్ నన్ను ఇన్స్ పైర్ చేశాయి. సింజిత్ కంపోజ్ చేసిన సాంగ్ చూసి ఎగ్జైట్ అయ్యాను. ఆ మ్యూజిక్ కు తగినట్లు స్టెప్స్ రూపకల్పన చేశాను. డైరెక్టర్ చెప్పినట్లు మంచి హుక్ స్టెప్స్ డిజైన్ చేశాను. పిల్లలతో పాటు తల్లిదండ్రులు అంతా చూడాల్సిన చిత్రమిది. సినిమాలో బ్యూటిఫుల్ ఎమోషన్స్ మిమ్మల్ని ఆకట్టుకుంటాయి. అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లాడుతూ – పిల్లలతో ఒక పూర్తి పాట పాడించాలనేది నా డ్రీమ్. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది. సింగర్ విశ్వదత్తా ఈ పాటను ఎంతో అందంగా పాడాడు. జి సరిగమపా విన్నర్ ఆ అబ్బాయి. అతనికి తొలి పాట ఇది. ఈ పాటకు కొరియోగ్రఫీ చాలా ఇంపార్టెంట్. సందీప్ మంచి హుక్ స్టెప్స్ ఇచ్చారు. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. మూవీ మీ అందరినీ ఎంటర్ టైన్ చేస్తుంది. అన్నారు. సింగర్ విశ్వదత్తా మాట్లాడుతూ – ఈ సాంగ్ పాడే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సాంగ్ పాడే అవకాశం కల్పించిన సింజిత్ గారికి కృతజ్ఞతలు. స్కూల్ సాంగ్ పాట మీ అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ పాట విని ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు. నటి వాసుకి మాట్లాడుతూ – నేను ఎంతోమంది పేరున్న ఆర్టిస్టులతో కలిసి నటించాను. కానీ ఈ పిల్లలతో కలిసి నటిస్తున్నప్పుడు మాత్రం టెన్షన్ పడ్డాను. వీరిలో అపారమైన నట ప్రతిభ ఉంది. అప్పట్లో అంజలి అంజలి పాట విన్నప్పుడు ఎంత హ్యాపీగా ఫీలయ్యానో ఈ సినిమాలోని స్కూల్ సాంగ్ కు కూడా అంతే సంతోషించాను. పిల్లల నేపథ్య సినిమా చేయాలంటే గట్స్ కావాలి. ఆ అభిరుచి, సాహసం మా ధీరజ్ గారిలో ఉన్నాయి. శ్రీకర్ ఈ చిత్రాన్ని బ్యూటిఫుల్ ఎమోషన్స్ తో రూపొందించారు. సింజిత్ కంపోజ్ చేసిన సాంగ్ ను తన కొరియోగ్రఫీతో సందీప్ మరింత ఆకట్టుకునేలా చేశారు. అన్నారు.చైల్డ్ ఆర్టిస్ట్ అరుణ్ మాట్లాడుతూ – మా మూవీ సాంగ్ లాంఛ్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్.పిల్లలుగా మాకు చదువులు, ఆటలు, పేరెంట్స్ తో అనుబంధం అంతా ఈ పాటలో డైరెక్టర్ శ్రీకర్ గారు చూపించారు. నా వయసు పిల్లలంతా ఈ పాటతో బాగా కనెక్ట్ అవుతారు. ఈ పాటలో నేను పడిన ఎమోషన్స్ అన్నీ ప్రతి పిల్లాడిలోనూ కనిపిస్తాయి. ధీరజ్ ఒక సోదరుడిలా మిమ్మల్ని చూసుకున్నారు.




# 'ఇరుముడి' సెన్సేషనల్ రన్..

**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ రన్ కొనసాగిస్తోంది. అద్భుతమైన వసూళ్లతో దూసుకెళ్తున్న ఈ సినిమా రెండో వారంలోనూ స్ట్రాంగ్ కలెక్షన్స్ నమోదు చేస్తోంది. వీకెండ్‌లో వసూళ్లు మరింతగా పెరిగాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర తన జోరును కొనసాగిస్తోంది.ఇప్పటికే 'ఇరుముడి' వరల్డ్‌వైడ్‌గా రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను క్రాస్ చేసింది. రవితేజ కెరీర్‌లో ఇదొక మైలురాయి కావడం విశేషం. ఈ సెన్సేషనల్ రన్‌లో నైజాం ఏరియా కీలకంగా నిలిచింది. అక్కడ రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. మిగతా ఏరియాల్లోనూ సినిమా ఇంప్రెసివ్ కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది.ముఖ్యంగా రీజినల్ సినిమాల్లో బిగ్గెస్ట్ హిట్స్‌లో ఒకటిగా 'ఇరుముడి' నిలిచింది. అలాగే నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు అత్యంత లాభదాయకమైన థియేట్రికల్ వెంచర్స్‌లో ఒకటిగా నిలుస్తోంది.రెండో వారంలోనూ సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. పలు సెంటర్లలో హౌస్‌ఫుల్ షోలు కొనసాగుతున్నాయి. ఈరోజు కనిపించిన జోరు రేపు కూడా కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు.కొత్త సినిమాల నుంచి పోటీ ఉన్నప్పటికీ ఆడియన్స్ పెద్ద సంఖ్యలో థియేటర్లకు వస్తుండటంతో 'ఇరుముడి' రియల్ బ్లాక్‌బస్టర్‌గా తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది. ఫైనల్‌గా మరింత భారీ కలెక్షన్స్ నమోదు చేసే దిశగా సినిమా వెళ్తోంది.



# 'తెల్ల కాగితం'.. అక్టోబర్ 2న వరల్డ్ వైడ్‌గా రిలీజ్



**వుదయం సినిమా:** అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత కృష్ణ కొమ్మలపాటి సమర్పణలో హర్ష్ రోషన్ ప్రస్తుతం చేస్తున్న నూతన చిత్రం 'తెల్ల కాగితం'. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' వంటి చిత్రాలతో విజయం సాధించిన హర్ష్ రోషన్ 'తెల్ల కాగితం' సినిమాతో రమేష్ బండ్రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యూత్ ఫుల్ ఎమోషనల్ లవ్ ఎంటర్టైనర్‌గా రానున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ అయింది. ఫస్ట్ లుక్ పోస్టర్, 'చిలకా' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ అన్నీ కూడా ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేశాయి. ఇక తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 'తెల కాగితం' అక్టోబర్ 2న ఘనంగా విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ ప్రస్తుతం అందరిలోనూ ఇంట్రెస్ట్‌ను కలిగించేలా ఉంది. ఇందులో హర్ష్ రోషన్, నక్షత్ర జంట ఎంతో క్యూట్‌గా కనిపిస్తోంది. పోస్టర్‌లో చూపించిన ఆ వర్షపు చినుకులు, గొడుగులా అడ్డుగా పెట్టుకున్న అరిటాకు, హీరోహీరోయిన్ల లుక్స్ అన్నీ కూడా ఎంతో సహజంగా అనిపిస్తున్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో అంచనాలు పెంచిన 'తెల కాగితం' బాక్సాఫీస్ వద్ద మంచి ప్రభావాన్ని చూపించేలా ఉంది.'సామజవరగమన', 'నారి నారి నడుమ మురారి' వంటి విజయవంతమైన వినోదాత్మక చిత్రాలకు సహ–రచయితగా గుర్తింపు పొందిన టాలెంటెడ్ రైటర్ నందు సవిరిగాన ఈ చిత్రానికి కథను అందించారు. కథను రూపొందించడమే కాకుండా స్క్రీన్‌ప్లే, సంభాషణలను కూడా రాశారు.'బేబీ' వంటి చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను ఇచ్చి విజయవంతంగా దూసుకుపోతోన్న మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ కె.వి. గుహన్ కెమెరామెన్‌గా, కార్తీక శ్రీనివాస్ ఎడిటర్‌గా ఈ చిత్రానికి పనిచేస్తున్నారు.

# "టార్టాయిస్" ఫస్ట్ లుక్ పోస్టర్



**వుదయం సినిమా:** స్లీప్ వాకింగ్ చేస్తున్న యంగ్ హీరో ఎవరు అనేది నిన్నటిదాకా సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఆ సస్పెన్స్ కు తెర దించుతూ మేకర్స్ ఆ యంగ్ హీరో ఎవరు ?, ఆయన సినిమాఏంటి ? అనేది అనౌన్స్ చేశారు. స్లీప్వాకింగ్ చేస్తున్న యంగ్ హీరో రాజ్ తరుణ్, ఆయన నటిస్తున్న కొత్త సినిమా "టార్టాయిస్" అంటూ మేకర్స్ ఈ రోజు ప్రకటించారు. ఈ మూవీ టైటిల్ అనౌన్స్ మెంట్ తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "టార్టాయిస్" సినిమాను ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్ పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. "టార్టాయిస్" సినిమాను సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. మానస కుమార్, సంతోష్ ఇమ్మడి కో ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు. "టార్టాయిస్" సినిమా టైటిల్ అనౌన్స్ మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది. ఈ పోస్టర్ లో ఒక డెడ్ బాడీ పక్కన హీరో రాజ్ తరుణ్ రక్తపు మరకలతో కూర్చుని ఉండటం, ఆయన పక్కనే ఒక కత్తి పడి ఉండటం ఆసక్తి రేపుతోంది. రాజ్తరుణ్ తన కెరీర్ లో ఇప్పటిదాకా చేయ ని ఒక కొత్త తరహా ఇంటెన్స్ క్యారెక్టర్ ఈ సినిమాలో చేస్తున్న ట్లు ఫస్ట్ లుక్ పోస్టర్ తో తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేక ర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

# 'ముగ్గురు కోతులు' టైటిల్ సాంగ్



**వుదయం సినిమా:** జీఎస్ఆర్ క్రియేషన్స్ సమర్పణలో స్కై ఫ్లేర్ నెట్‌వర్క్స్ సహ సమర్పణలో శోభారాణి గరిమెల్ల నిర్మాణంలో కార్తీక్ గరిమెల్ల తెరకెక్కిస్తున్న చిత్రం 'ముగ్గురు కోతులు'. ఈ మూవీలో తేజ కొండపల్లి, గణేష్ బొడ్డ, దేవాన్ష్ ముఖ్య పాత్రల్ని పోషిస్తుండగా.. వర్షిక పాశం హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది. ఇక తాజాగా మరో అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా నుంచి రీసెంట్‌గా టైటిల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. 'ముగ్గురు కోతులు' అంటూ సాగిన ఈ వీడియో సాంగ్‌లో ముగ్గురు హీరోలు ఫుల్ ఎంజాయ్ చేస్తూ కనిపిస్తున్నారు. బ్యాచిలర్, సింగిల్ లైఫ్‌లు ఎలా ఉంటాయో ఈ వీడియో సాంగ్‌లో కనిపిస్తుంది. యూత్ ఫుల్ ఫన్ ఓరియెంటెడ్‌గా సినిమా రానుందని ఈ పాటను చూస్తేనే అర్థం అవుతోంది. క్యాచీ ట్యూన్‌కి, హీరోలు చేసే అల్లరి పనులకు ఆడియెన్స్ ఫిదా అయ్యేలా కనిపిస్తున్నారు. ఇక ఈ పాటకు జగదీష్ బుసయవలస సాహిత్యం, చైతన్య గన్నవరపు గాత్రం ప్రధాన ఆకర్షణగా నిలిచేలా ఉంది.ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాకి ఎస్. సుహాస్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ మూవీకి రాజ్ నోముల కెమెరామెన్‌గా, జమీర్ షేక్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. మున్ముందు మరిన్ని అప్డేట్‌లతో ఆడియెన్స్‌ని అలరిచేందుకు టీం రెడీగా ఉంది.

# 'సీక్రెట్ సోల్జర్' ట్రైలర్



నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సెప్టెంబర్ 18న సినిమా విడుదల కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా వచ్చిన డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ.. "అందరికీ నమస్కారం. సూర్య శ్రీనివాస్ 'హిట్ 3' సినిమా సమయంలో ఈ సినిమా గురించి చెబుతూ ఉండేవారు. నాకు ఈ ట్రైలర్ చాలా నచ్చింది. ట్రైలర్‌లో కష్టం కనిపించింది. చాలా కష్టపడి సినిమాను తీశారు అనే ఫీలింగ్ ట్రైలర్ కలిగించింది. ఇదే క్వాలిటీ సినిమాలో ఉంటే మాత్రం ఖచ్చితంగా తెలుగు ఆడియన్స్ సపోర్ట్ చేస్తారు. అద్భుతమైన రైటింగ్‌తో తీస్తే చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేకుండా ఆడియన్స్ చూస్తారు. నిహాల్ చాలా ఇంటెన్సిటీతో కనిపించాడు. శ్రీనివాస్ నాకు 'హిట్ 3' సినిమా నుంచి తెలుసు. ఆ సినిమాకి చాలా కష్టపడ్డాడు. ఇద్దరూ కూడా చాలా హార్డ్ వర్క్‌తో ఈ సినిమా చేశారని అనిపిస్తుంది. ఖచ్చితంగా ప్రేక్షకులు వాళ్లను ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను. సెప్టెంబర్ 18న సినిమా రిలీజ్ అవుతుంది. అందరూ ఇది బిగ్ స్క్రీన్‌పై చూడాల్సిన సినిమా. డైరెక్టర్ విశ్వనాథ్ గారికి కంగ్రాచులేషన్స్. ఆల్ ది వెరీ బెస్ట్.రైటర్, డైరెక్టర్ బీవీఎస్ రవి మాట్లాడుతూ.. "సీక్రెట్ సోల్జర్ ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఈ సినిమా సెన్సార్‌లోనే 8 నెలల పాటు ఉందని విన్నాను. కచ్చితంగా అందరికీ నచ్చడం వల్లే సెన్సార్ నుంచి బయటకు వచ్చింది. నిర్మాత ఈ సినిమాకి తన దగ్గర ఉన్న డబ్బులన్నీ ఖర్చుపెట్టి తీశారు. సినిమాపై చాలా ప్యాషన్ ఉంది ఆయనకి. కచ్చితంగా ఈ సినిమా మంచి విజయం సాధించి, ఆయన మరో సినిమా తీయాలని కోరుకుంటున్నాను. కాలభైరవ మ్యూజిక్ చాలా బాగుంది. చాలా మంచి స్ట్రాంగ్ టీమ్‌తో వస్తున్నారు. సినిమా ఖచ్చితంగా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను.శాన్వి మాట్లాడుతూ..అందరికీ నమస్కారం. నిహాల్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్. సినిమా కథ నాకు తెలుసు. ఇందులో చాలా బలమైన ఎమోషన్ ఉంది. ఫ్రెండ్షిప్ ఉంది. అది నాకు చాలా నచ్చింది. నిహాల్ ఎవరో సినిమా వచ్చినప్పుడు చాలా మంచి పెర్ఫార్మర్ అని తెలుసు. కష్టాన్ని కూడా చాలా ఎంజాయ్ చేస్తూ ఉంటాడు. నిహాల్ తెలుగు సినిమా ముద్దుబిడ్డ. తప్పకుండా ఈ సినిమాతో తనకి మరింత మంచి పేరు వస్తుందని నమ్ముతున్నాను.


# 'అన్వే దయానా'.. సోనీ లివ్‌లో స్ట్రీమింగ్

**వుదయం సినిమా:** ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'అన్వే దయానా' చిత్రం థియేట్రికల్ రిలీజ్ తర్వాత ఇప్పుడు సోనీ లివ్‌లో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రేమ, కామెడీ, మన నేటివిటీకి, మన సంస్కృతి, కుటుంబ అనుబంధాల మేళవింపుగా రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు మరింత విస్తృత ప్రేక్షకులకు చేరువ కానుంది. ప్రేక్షకులు తమ ఇంటి నుంచే ఈ అందమైన కథను ఆస్వాదించే అవకాశం. 5చెన్నైలోని పెరంబూర్ నేపథ్యంగా తెరకెక్కిన 'అన్వే దయానా' సినిమా కథ, సంప్రదాయాలకు కట్టుబడి ఉండే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే ఊహించని మలుపుతో ఏం జరిగిందనే పాయింట్ చుట్టూ సాగుతుంది.



# భక్తి ప్రధాన చిత్రం 'కనకదుర్గ'

**వుదయం సినిమా:** బిర్లా స్టూడియోస్, టెంపుల్ టౌన్ పిక్చర్స్ సంయుక్తంగా రూపొందిస్తోన్న అత్యంత ఆసక్తికర భక్తి ప్రధాన చిత్రం 'కనకదుర్గ'. ఈ చిత్రం Z5 తెలుగు భారీ పోస్ట్ థియేట్రికల్ ఫిల్మ్ లైనప్‌లో చోటు దక్కించుకుంది. దైవత్వం యొక్క అద్భుతమైన శక్తిని ప్రతిబింబించే ఓ పవర్‌ఫుల్ కథతో తెరకెక్కుతోన్న ఈ సినిమా ఆసక్తికరమైన క్రియేటివ్ కలయికగా నిలుస్తోంది. అల్లరి నరేష్, కాజల్ చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ఈ చిత్రానికి ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తుండగా.. బీవీఎస్ రవి కథను అందిస్తున్నారు. మ్యూజికల్ సెన్సేషనల్ ఎస్. థమన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. భక్తి, యాక్షన్, భావోద్వేగాలు, సంగీతం.. ఇలా అన్ని అంశాల సమ్మేళనంగా రూపొందుతోన్న 'కనకదుర్గ' చిత్రం, సర్వశక్తిమంతమైన శ్రీ కనకదుర్గ అమ్మవారి దివ్యశక్తి, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత నుంచి స్ఫూర్తి పొందింది. భక్తి భావాన్ని ఆవిష్కరిస్తూనే, నేటి ప్రేక్షకులకు ఆకట్టుకునే కథతో ఓ పవర్‌ఫుల్ సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు ఈ చిత్రం సిద్ధమవుతోంది.ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న 'కనకదుర్గ' చిత్రాన్ని బిర్లా స్టూడియోస్ సమర్పణలో టెంపుల్ టౌన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం ముందుగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలై.. ఆ తర్వాత ప్రత్యేకంగా Z5 తెలుగులో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది.




Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.